
Website : www.saisadguruvani.org

"పాదుకా మహోత్సవ" ప్రత్యేక సంచిక






శ్రీ భరద్వాజ

# సద్గురువాణి

సంపుటి-22

సంచిక-3

జూలై, ఆగష్టు, సెప్టెంబర్ - 2022




శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

శ్రీ భరద్వాజ

# సద్గురువాణి


సంపుటి - 22 జూలై, ఆగష్టు, సెప్టెంబర్ - 2022 సంచిక - 3

**శ్రీ దత్తసాయి మాస్టర్ సాంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**

ప్రధాన సంపాదకులు :
**శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు**

'పాదుకా మహోత్సవ' ప్రత్యేక సంచిక

నిర్వహణ :
**శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము**


"ద్వారకామాయి ప్రవేశం వనరించినంతనే
సర్వ సుఖ సంపదలు పొందగలరు"
- శ్రీ శిరిడీ సాయి

## చందా వివరములు

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | - | రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - | రూ॥ | 50/- |
| 3 సం॥ల చందా | - | రూ॥ | 150/- |
| 5 సం॥ల చందా | - | రూ॥ | 250/- |
| పోషకులు (ఉదారులు) | - | రూ॥ | 1000/- |


మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**C/o. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**

ప్లాట్ నెం. 13, పవర్ సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర,
పరవాడ (మం), విశాఖపట్నం - 531 021.
సెల్ : 9849645224


"శ్రీ భరద్వాజ సద్గురువాణి" సభ్యత్వ చందా రుసుము పంపుటకు :

**SRI BHARADWAJA PUBLICATIONS**
Online A/C No. : 095510011006491
IFSC Code : UBIN0809551
Union Bank of India, Ukkunagaram Branch
(Used for RTGS and NEFT Transactions)

## విషయ సూచిక


1. విషయసూచిక .......... 1
2. మా మాట .......... 2
3. భగవంతుడిని ఏమి కోరాలి .......... 4
4. జగద్గురు శ్రీ శిరిడీ సాయిబాబా .......... 5
5. పండుగలు - పర్వదినాలు .......... 6
6. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు .......... 7
7. శ్రీగురు చరితామృతము .......... 9
8. భార్యను గౌరవించడం ఎలా .......... 10
9. ఒక్కక్షణం .......... 11
10. గురుపూజా మహోత్సవాలు .......... 12
11. జిజ్ఞాస .......... 13
12. గురుపూర్ణిమ .......... 14
13. ఓం శ్రీ గం గణేశాయనమః .......... 15
14. గురు భక్తి .......... 16
15. పూర్ణ అంతరంగాలు .......... 17
16. ఆధ్యాత్మిక-సామాజిక సేవలో .......... 21
17. మేము సహితం .......... 23
18. ఆధ్యాత్మిక-సామాజిక సేవలో చిత్రమాలిక .......... 24
19. జన్మదిన శుభాకాంక్షలు .......... 26
20. అవధూత శ్రీ చీరాల స్వామి .......... 32
21. గురుస్థానంలో పాదుకా ప్రతిష్ఠ .......... 33
22. శ్రీ గజానన్ మహరాజ్ .......... 36
23. సద్గురువుల పాదుకా మహోత్సవం .......... 37
24. శ్రావణ పూర్ణిమ - ఉపాకర్మ .......... 38
25. శ్రీ నిజాముద్దీన్ ఔలియా .......... 39
26. చెప్పులయ్యా! చెప్పులు!! .......... 41
27. తెలుసుకుందాము .......... 42
28. బాలవికాశం - ప్రజ్ఞాశాలి గిడుగు .......... 43
29. హయగ్రీవుడు .......... 44
30. స్ఫూర్తి ప్రధాత (బి.వి. నర్సింహస్వామి) .......... 45
31. శ్రీ సద్గురు పాదుకాష్టకం-పాదుకా మహోత్సవం ... 47
32. ఏరిన ముత్యాలు .......... 48



E-mail : poorna.sai09@gmail.com
Website : **www.saisadguruvani.org**
Facebook : **Sri Shiridi Sai Seva Trust**
Co-Ordinator at USA : **Sri K. KARUNAREDDY**




## పాఠకులకూ ప్రకటన కర్తలందరికీ గురుపూర్ణిమ మరియు స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు

జీవితం ఒక ప్రయాణం లాంటిది, గమ్యం చేరే లోపల ఎందరెందరితోనో పరిచయాలు, పలకరింపులు, అనుభూతులు, అనుభవాలు, ఒక్కొక్కటి ఒక్కొక్కరకమైన అనుభూతి, అనుభవం. వాటిలో ఇష్టమైనవి, అయిష్టమైనవి, సహించేవి, సహించరానివి, ఇట్లా ఎన్నెన్నో. మధ్యలో కలిసేవారు, విడిపోయేవారు, కొంతదూరం కలసి పయనం చేసేవారు, మధ్యలో వచ్చి మధ్యలో వెళ్ళిపోయేవారు మరి కొందరు. ఏది ఏమయినా, ప్రయనంలో మదిలో మెదిలే భావాలను సరిచేసుకుంటూ గమ్యం చేరటం మన కర్తవ్యం. గమ్యం చేరేలోపల కలిగే అనుభవాలు కొన్ని ఎట్లా ఉండాలో నేర్పితే, మరికొన్ని ఎట్లా ఉండకూడదో తెలియచేస్తాయి. అందులో మన పాత్ర ఎంత? మనం ఆశించినట్లుగా కోరుకున్నట్లుగా ఇతరులు ఉండాలని భావిస్తున్నామా! లేక, ఇతరులకు శ్రేయస్సు కలిగేలా మనం ఉంటున్నామా! అని పరిశీలించుకుంటే, మన జీవన ప్రయాణం ఎటు సాగుతున్నదో తెలుస్తుంది. అప్పుడు కన్నుల ఎదుట కనిపించే ప్రతీదీ గురుస్వరూపముగా గోచరిస్తుంది. అదే సరియైన దృష్టి కలగటము. అప్పుడు అంతా ఆనందమే. రాగద్వేషాలు, ఈర్ష అసూయలు, ఇష్టా అయిష్టాలకు తావు లేకుండా పోతుంది. అంతవరకు కష్టంగా, నష్టంగా ఉండి బాధకలిగించింది, వివేకముతో కూడిన ఆలోచనతో జతకూడి ఆనందముగా మారుతుంది. అలనాడు మహర్షులందరూ "మాకు అన్ని దిక్కుల నుండి ఉత్తమమైన భావాలే వచ్చుగాక" అని ఎలుగెత్తి అడిగేరట, దాని భావం, "మాకు ఎదురయ్యే ప్రతిదానిలోనూ మంచిని స్వీకరించే గుణం మాకు ప్రసాదించు" అని విన్నవించుకున్నారు. మన ఎదుట నిలచిన సకల చరాచర దృశ్యమానము అంతా గురుస్వరూపమే. "ఎవరి దృష్టి నా యందు కలదో వారియందే నా కటాక్షము కలదు" అన్నారు సాయి. బాబా పై దృష్టి నిలపటము అంటే, ఎదురుగా ఉన్న చిత్రపటము మీదనో, విగ్రహమునో తదేకముగా చూడటం కాదు. దాని వెనుక ఉన్న చైతన్య శక్తిని గమనించటము. "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి, శిరిడీలోనే ఉన్నాడు అని అనుకునేవాడు నన్నసలు చూడనట్లే, నీవు చూసేదంతా కలసి నేను" అని చెప్పటమే కాక, తన సర్వవ్యాపకత్వాన్ని ప్రత్యక్ష నిరూపణ చేశారు సాయి. సాయిపై దృష్టి నిలపటమంటే, సర్వత్రా వ్యాపించి ఉన్న చైతన్యాన్ని గమనించటము అని అర్థము.

ఒకనాడు యయాతి మహారాజు వేటకై అడవికి వెళ్ళేడు. అక్కడ నిర్జనారణ్యంలో దుమ్ము కొట్టుకునిఉన్న శరీరముతో, ఎటువంటి అచ్ఛాధన లేకుండా కటిక నేలపై ఒక వ్యక్తి నిశ్చలముగా పడుకొని ఉన్నాడు. యయాతి మహారాజు అతనిదగ్గరకు వెళ్ళి చేతులు జోడించి నమస్కరించి, "స్వామీ! క్రూరమృగాలు సంచరించే ఈ నిర్జరారణ్యంలో నిశ్చలంగా, ఎటువంటి అచ్ఛాదన లేకుండా పడుకొని ఉన్న మిమ్ములను చూస్తుంటే, మీరు చేతకాక గాని, అశక్తులై గాని, విరక్తులై గాని, ఉన్మాదులై గాని ఇట్లా ఉన్నారని నేను భావించటంలేదు. మాలిన్యంగా కనిపించే మీ శరీరము నుంచి సుగంధాలు వ్యాపిస్తున్నాయి, మీ ముఖారవిందంలో, మీరు బ్రహ్మానందాన్ని గ్రోలుతూ ఉన్నారని తెలుస్తున్నది. ఈ బాహ్య స్థితిలో అటువంటి ఆనందాన్ని ఎట్లా పొందగలుగుతున్నారో తెలియజేగలరు" అని అడిగేడు. అందుకు ఆ అవధూత యయాతి మాటలకు చిరునవ్వు నవ్వి, "నిన్ను చూస్తుంటే నాకు చాలా సంతోషం కలుగుతుంది. ఇంతకు ముందు ఈ దారిన వెళ్ళిన వారందరు నన్ను పిచ్చివాడినని, క్షుద్రకుడని, విరాగి అని, శవమని, ఇట్లా ఇంకా ఎన్నో, ఎన్నో విధాలుగా వారి వారి సంస్కారాలననుసరించి, నన్ను అంచనా వేసి, వెడలి వెళ్ళిపోయారు. కాని నువ్వు ఒక్కడివే నేను బ్రహ్మానందములో మునిగి తేలుతున్నానని గుర్తించి ప్రశ్నించావు, సరియైన నీ దృష్టిని చూస్తుంటే నాకు ఆనందం వేస్తుంది, దానికి ప్రతిఫలంగా నేను ఈ మహదానందాన్ని పొందటానికి కారణమైన 24 మంది గురువుల గురించి తెలియజేస్తాను, విను" అంటూ తాను జ్ఞానమార్జించిన 24మంది గురువుల గురించి యయాతికి తెలియజేశాడు ఆ అవధూత. అటువంటి జ్ఞానము ఆర్జించమని తెలియజేయటానికే ఒక వ్యాసపూర్ణిమ నాడు స్థంభాన్ని (సృష్టికి ఆధారభూతమై నిలచిన దానిని) పూజించమని భక్తులతో సాయి చెప్పటంలోని భావం. అటు వంటి దృష్టి కలిగి, గుర్తెరిగి జీవించిన నాడు, నిరంతరం వెంటనుండి సహస్రముఖాలుగా, సహస్రవిధాలుగా బోధిస్తూ గమ్యంవైపు నడిపిస్తారు శ్రీ శిరిడీ సాయినాధుడు .

1910వ సంవత్సరములో మశీదులో కూర్చున్న నూల్కర్, శ్యామా మొదలైన భక్తులతో "ఖాళీగా కూర్చోవటమెందుకు మశీదులోని స్థంభాన్ని పూజించండి" అని బాబా చెప్పటంతో, ఆ రోజు విశేషం ఏమిటి అని పరిశీలించి చూసిన భక్తులకు, నాడు ఆషాఢ పూర్ణిమ, నేటి సంప్రదాయాలకు ఆది గురువైన వ్యాస భగవాన్ జన్మించిన రోజు, వ్యాస పూర్ణిమ అని తెలిసి, "మాకు గురువైన మీకు పూజ చేస్తాము కానీ ఆ స్థంభానికి కాదు" అంటూ పట్టుబట్టి, ఒప్పించి, చివరకు భక్తులందరు పూజాద్రవ్యాలతో శ్రీ సాయిని పూజించారు. నాటినుంచి ప్రతి సంవత్సరము సాయి సన్నిధిలో "గురుపూర్ణిమ" జరపటం ఆనవాయితి అయ్యింది. వారి వారి సంస్కారములను అనుసరించి, తాము ఆశ్రయించిన గురువుని వ్యాసపూర్ణిమ రోజున సేవించటం ద్వారా మరింత విస్తారమయ్యి, నేడు దేశం నలుమూలలా, వాడవాడలా గురుపూర్ణిమ ఉత్సవాలు ఒక వేడుకగా రంగరంగ వైభవముగా, ఒక దానిని మించి మరొకచోట జరుగుతున్నయ్యి, ఇక సాయి మందిరాలలోని విశేషాలు చెప్పనవసరమే లేదు. చివరకు, ఎవరికి వారు అవతలి వారికంటే తాము ఎంత ఘనంగా ఉత్సవాలు నిర్వహించామా! అనే

పంతంగా జరుపుకునే వేడుకగా గురుపౌర్ణమిని భావిస్తున్నారే గాని, సాయి బోధించిన అసలు తత్వాన్ని గుర్తెరిగి ప్రవర్తించేవారు అరుదయ్యారు. 'తాను గురువు అని భావించే వాడు ఆ పదవికే అనర్హుడు' అని శాస్త్రం. సాయి తాను ఎన్నడు గురువు అని భావించలేదు, అట్లా ప్రవర్తించనూ లేదు. 'అల్లా మాలిక్' "భగవంతుడు యజమాని, నేను ఆయన సేవకుడను మాత్రమే" అని అనేవారు సాయి. బాబా తన గురుసేవా వృత్తాంతములో, తన గురువు శ్రద్ధా-సబూరి అనే రెండుపైసలు దక్షిణగా తనను అడిగినప్పుడు "మౌనముగా తల వంచాను" అంటారు. ఉన్నదంతా ఒక్కటే అయినప్పుడు ఇచ్చేదెవరు, పుచ్చుకునే దెవరు! కట్టె అగ్నితో జతకూడినప్పుడు అది అగ్నివలె భాసించి, విశ్వవిభుని తత్వం విభూతిగా మారి, తన ఉనికిని కోల్పోతుంది. నిజమైన జ్ఞాని స్థితి కూడా అదే. తన దరిచేరిన వారిని ఉద్ధరించాలనే భావనతో, సృష్టికి ఆధారభూతమైన దానిని గుర్తించి సేవించమని చెప్పడానికే స్థంభాన్ని పూజించమన్నారు బాబా. ఇంటి కప్పుకు ఆధారం స్థంభము, అది నేలలో దృఢంగా నాటుకొని ఉంటుంది. దాని బలంపైనే ఇంటి కప్పు ఆధారపడి ఉంటుంది, తనను ఆశ్రయించిన వారిని కాపాడుతుంది. అదే విధంగా ఆత్మనిష్ఠుడైన గురువు కూడ తనను ఆశ్రయించిన వారిని రక్షిస్తారు. సృష్టి అంతటా వ్యాపించి, చైతన్య స్వరూపుడయిన సాయి మనకోసం మన మధ్యకు ఐదున్నర అడుగుల రూపంలో అవతరించి, సంచరించి, సర్వులను ఉద్ధరించటం తన అవతార లక్ష్యంగా పెట్టుకున్నారు. అది మరచి, కేవలం సాయి అనే రూపానికే పరిమితమై, బాహ్యాడంబరములో మునిగిన వారిని, "నా ఈ భౌతిక దేహం నుంచి నా గురువు నన్ను ఎన్నడో విడుదల చేశారు, నీవు చూసేదంతా కలసి నేను" అన్నారు బాబా. స్థంభాన్ని పూజించమని చెప్పటమే కాదు, 1912వ సంవత్సరములో శ్రావణ పౌర్ణమి రోజున తాను మొట్టమొదట ప్రకటమైన వేపచెట్టు దగ్గర, తన గురుస్థానమైన ప్రదేశంలో, భక్తులు తమ గురువుకు ప్రతీకగా పాలరాతి పాదుకల ప్రతిష్ఠకు పూనుకుంటే సాయి వాటిని స్వయంగా స్పృశించి, "ఇవి భగవంతుని పాదాలు", గురుస్థానములో ప్రతిష్ఠించమని తెలిపేరు. అంటే వాటిని ఆధారముచేసుకొని సర్వత్రా వ్యాపించి ఉన్న భగవత్ తత్వాన్ని గ్రహించి, ఆ మార్గంలో పయనించమని సాయి ఆదేశం. అది గుర్తెరిగి ఆ పాదుకలను ఆశ్రయిస్తే నడక, నడత రెండూ, రెండు పాదాలయ్యి, ఆధ్యాత్మిక పథంలో ముందుకు నడిపిస్తాయి.

గురుస్థానములో పాదుకలు ప్రతిష్ఠించి నేటికి (2022 శ్రావణ పౌర్ణమికి) 110 సంవత్సరాలు పూర్తి అయ్యి 111వ వసంతంలోనికి ప్రవేశించటమైనది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని, ఆంధ్రరాష్ట్రంలో అనేక మంది దత్తావతారుల, అవధూతల, మహాత్ముల పాదుకలను ఒక్కచోట చేర్చి సాయి విశ్వరూపాన్ని ఆవిష్కరించటానికి, విశ్వతత్వాన్ని తెలుపుతూ, పాదుకల ప్రాశస్త్యాన్ని తెలియజేస్తూ, "సద్గురువుల పాదుకామహోత్సవము" గత 27 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నది దేశం మొత్తంమీద శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు (పవర్‌సిటీ, విశాఖపట్నం) విశాఖపట్నం వారేనని నిండు మనస్సుతో తెలియజేస్తున్నాము. నేడు శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం రూపుదిద్దుకొని, ఆ ప్రాంగణములో పాదుకా మహోత్సవము నిర్వహించ తలపెట్టిన శుభ తరుణంలో శ్రీ సమర్థ రామదాసస్వామి- సజ్జనఘడ్, శ్రీరామస్వామి, శ్రీ మాణిక్యేశ్వరీమాతా, శ్రీ గాడీతాత, శ్రీ కాశిరెడ్డి నాయిన పాదుకల రూపంలో విచ్చేసి. పాదుకాక్షేత్రములో కొలువై భక్తులను అనుగ్రహించటమే కాకుండా మరికొందరు మహాత్ములు తాము ఉపయోగించిన వస్తువుల రూపంతో, పాదుకాక్షేత్రమునకు విచ్చేసి, పాదుకాక్షేత్రాన్ని సుసంపన్నం చేస్తూ, అనుగ్రహిస్తున్న శుభ తరుణంలో, మొట్టమొదటిసారిగా, నూతనంగా రూపుదిద్దుకున్న శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో సద్గురువుల పాదుకామహోత్సవము నిర్వహించబోతున్న తరుణంలో మరియు శిరిడీలోని గురుస్థానమున పాదుకాప్రతిష్ఠ జరిగి 110వసంతాలు పూర్తయిన శుభసందర్భములో, శ్రీ దత్తావతారుల, అవధూత, మహాత్ముల అనుగ్రహ వీచికలు సర్వులపై ప్రసరించాలని, అందుకు ఆలంబనగా శ్రీ దత్త సాయి సంప్రదాయములో పాదుకల విశిష్టత మరింతగా అందరితో కలసి పంచుకోవాలనే భావనతో ఈ సంచికను **'పాదుకామహోత్సవ ప్రత్యేక సంచిక'** గా రూపొందించాము. 'శ్రీ భరద్వాజ సద్గురువాణి' దాదాపు 40 శాతం సబ్సిడీతో మీకందిస్తున్నాము, సంచిక సంచికకూ ముద్రణ, రవాణా వ్యయములు అనూహ్యముగా పెరుగుతున్న తరుణంలో, పత్రిక ముద్రణ మరింత భారముగా మారుతున్నది. అయినప్పటికి మా శాయశక్తులా ప్రస్తుత చందారుసుముకే కొనసాగించ దలచాము. ఈ సంచికను 'శ్రీసద్గురుపాదుకామహోత్సవ' ప్రత్యేకసంచికగా ఎక్కువ పేజీలతో, విభిన్న శీర్షికలతో మీకందిస్తున్నాము, స్థలాభావము వలన పుస్తక పరిచయం, స్ఫూర్తిప్రదాత, మన సంప్రదాయాలు మొదలైన శీర్షికలను ఈ సంచికలో అందించలేదు. శ్రావణ పౌర్ణమినాడు సద్గురువుల పాదుకామహోత్సవమునకు నాంది పలికిన నర్సీపట్నం శ్రీపాకలపాటి గురువుగారి ఆశ్రమంలో పాదుకామహోత్సవము నిర్వహించటముతోపాటు, **ఆగష్టు 13, 14 మరియు 15 తేదీలలో శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం, పవర్‌సిటీలో 28వ సద్గురువుల పాదుకామహోత్సవము** శ్రీశిరిడీ సాయి సేవాట్రస్టు, శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా జరుపనిర్ణయించడమైనది.

పాదుకామహోత్సవము ఆ 3రోజులు శ్రీ శిరిడీసాయి భక్తులందరూ ఒక్కటై, సాయిసన్నిధిని అనుభవించటానికి మా వంతు ప్రయత్నం ప్రారంభించాము. రండి, తరలిరండి, కలసి సాగుదాం. "ఆద్యంతాలు లేని ఈ పాదాలు పరమ పవిత్రమైనవి" అన్నారు శ్రీ సాయి. ఆ సాయి చూపిన బాటలో నడచి, సాయి మెచ్చే విధముగా మన అడుగులు వేద్దాము. అందుకు ఆలంబనగా అనేక మంది అవధూతల, మహాత్ముల బోధనలు 'సద్గురువాణి' ద్వారా అందించటానికి మా వంతు ప్రయత్నం చేశాము. ప్రయత్నం మాది, ఆస్వాదన మీది, అనుగ్రహం శ్రీ సాయిది.



**"శ్రీ భరద్వాజ సద్గురువాణి"** మీ హృదయవాణిగా తీర్చిదిద్దటానికి నిరంతరం మావంతు శాయశక్తులా ప్రయత్నిస్తామని, ఎల్లవేళలా మీ సహకారం ఇట్లానే కొనసాగాలని కోరుకుంటూ...

**శ్రావణపౌర్ణమి మరియు శిరిడీలోని గురుస్థానములో శత ఏకాదశ వసంతాల పాదుకాప్రతిష్ఠ మహోత్సవ శుభాకాంక్షలతో...**

**మీ పబ్లిషర్**
**శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**

# భగవంతుడిని మనమేమి కోరాలి?

శ్రీ గులాబ్ బాబా, భక్తులనుద్దేశించి "భగవంతుడిని మనమేమి కోరాలి?" అనే ప్రశ్న వేశారు. భక్తుల మౌనమే జవాబయ్యింది. తిరిగి బాబానే చెప్పటం ప్రారంభించారు "నా దగ్గరకు వచ్చేవారంతా అనేక కోరికలతో వస్తుంటారు. బాబా! నా కుమార్తెకు వివాహము కాలేదని, నా కుమారునికి జబ్బు చేసిందని, నా భార్యకు కేన్సర్ వ్యాధి వచ్చిందని, నా కుమారుడు పిచ్చివాడయ్యాడు, నాకు సంతానం లేదు, నాకు ఇల్లు లేదు, నాకు కారు కావాలి, నాకు లాటరీలో ప్రథమ బహుమతి రావాలి ఈ విధంగా నన్ను కోరుతూనే ఉంటారు. నేను వారి కోరికలు సఫలం చేసినా ఒక్క అడుగు ముందుకువేసే వారుకాని, ధార్మికంగా జీవించేందుకు ప్రయత్నంచేసే వారుకాని నాకు ఒక్కరూ అగపడడం లేదు. మనం భగవంతుని ఆశీస్సులు మాత్రమే కోరాలి. అంతేకాదు ఈ జన్మలోను మరి రాబోవు జన్మలలో కూడ భగవానుని సేవా భాగ్యమే కోరాలి. అటువంటి స్థితి మనం పొందగలిగినపుడే, మన కోరికలు తప్పక భగవంతుడు నెరవేర్చుతుంటారు".



శ్రీ గులాబ్ బాబాజీ ఇలా చెబుతారు "గజేంద్రుడు భక్తి శ్రద్ధలతో పుష్పమొకదాన్ని సమర్పింపగా స్మృతిమాత్ర ప్రసన్నుడైన భగవానుడు సంతోషించి ఆపదసమయంలో గజేంద్రుని రక్షించాడు. శబరి ప్రేమతో ఎంగిలి చేసిన పండ్లు తిన్న శ్రీరామునికి కడుపునిండింది. సుధాముడు ప్రేమతో పెట్టిన అటుకులు తిని సంతృప్తి చెందిన శ్రీ కృష్ణభగవానుడు అతనికి అష్టైశ్వర్యాలు ప్రసాదించాడు. అలానే విదురుడు ఇచ్చిన బియ్యపు గింజలు తిని కడుపునిండిందని తృప్తి చెందాడు శ్రీ కృష్ణుడు.

భగవంతుడు మననుండి భక్తి శ్రద్ధలు, ప్రేమ ఆశిస్తాడుగాని, మనమిచ్చే ద్రవ్యముపై ఆయనకు ఆపేక్షలేదు. ప్రతిఒక్కరు ప్రతిఫలమాశించక హృదయపూర్వకంగా భగవంతుని సేవకు అంకితమైనచో అట్టివారు తప్పక కృతార్థులవుతారు. మూగజీవులైన పశుపక్ష్యాదులు, జీవించియున్నప్పుడు, మరణించినపుడు కూడా మానవజాతి మనుగడకు ఎంతో సహకరిస్తున్నాయి. ఆవులు, గేదెలు పచ్చిగడ్డి మేసి అమృతములాంటి పాలను, తద్వారా పెరుగు, వెన్న, నెయ్యి వంటి పాల ఉత్పత్తులను అందించి మానవుల ఓజస్సుకు, మేధస్సుకు, బలానికి దోహదపడుతాయి. తాము విసర్జించిన పేడద్వారా పంటపొలాలను సస్యశ్యామలం చేస్తున్నాయి. దాంతోపాటు వ్యవసాయోత్పత్తులు అధికం కావడానికి ఇతోధికముగా తోడ్పడుతున్నాయి. చివరికు వాటి పేడను ఇండ్లను అలకడానికి, కళ్ళాపుచల్లుకొనేందుకు ఉపయోగిస్తున్నాము. అవి మరణించి కూడా తమ మాంసాన్ని ఆహారంగా మనకు అందిస్తున్నాయి. వాటి చర్మముతో చెప్పులు, తదితర వస్తువులు తయారు చేయబడుతున్నాయి. జడ పదార్థాలైన జీపులు, లారీలు కార్లు సంఘసేవకు తోడ్పడుతున్నాయి. అవి శిథిలమైనా వాటి విడిభాగాలు అమ్ముకోవడానికి వీలపడుతుంది. అడవుల్లోని వృక్షాలు వర్షాలు పడడానికి, భూమిని చల్లబరచడానికి, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు దోహదం చేస్తున్నాయి. వంటచెరకు, గృహోపకరణాలు, అనేక ఓషధులు మొదలగు వాటిని కూడా మనకు అందిస్తున్నాయి. పంచమహాభూతాలకు యజమానియైన ఆ పరమాత్మ ఆజ్ఞమేరకు అవి మనకు చేస్తున్న సేవ నిరుపమానమైంది. మనకొరకు భగవంతుడు సృష్టించిన వాటి ద్వారా పొందుచున్న లాభాలు అపరిమితం. భగవంతునిచే సృష్టించబడిన యావత్ ప్రకృతి మనకెంతో సహకారమందిస్తున్నా మనము దీన్ని గమనించే స్థితిలో లేము. మనము ఎవరికైనా సహకారం చేస్తున్నామా? ఇతరుల నుండి సహాయం పొందటమేనా మన పని? సాటి మానవుల క్షేమం కోసం చేసిన సత్కర్మలను గూర్చి జీవించియున్నపుడు, మరణించిన తర్వాత కూడా అంతా చెప్పుకుంటారు. పశుపక్ష్యాదులైన సాటి జీవులు ఉపయోగపడినట్లు మనం ఉపయోగపడలేకపోతున్నాము. కనుక మనము జీవించి ఉండగానే ఇతరులకు ఉపయోగపడాలి.

లోకంలో సహజంగా ఎవరికైనా పదవుల్లో ఉన్నపుడిచ్చే గౌరవమర్యాదలు ఆ తర్వాత ఇవ్వరు కదా! అంతేకాదు, విలువలేదని తలుస్తున్న జంతువుల యొక్క మృత శరీరాలకు విలువ కట్టవచ్చు. కాని మానవుల మృతదేహాలకు గడ్డిపోచకున్నంత విలువ కూడా లేదు. అందుకే ప్రతి మానవుడు తన జీవితకాలంలో సాటి జీవుల శ్రేయస్సుకు కృషి చేస్తే లోక కళ్యాణం చేకూరుతుంది. వారి కీర్తి ప్రతిష్టలు చిరకాలం నిలుస్తాయి.

పిల్లలు రోజంతా ఆడుకుంటారు. తల్లిదండ్రులు సాయంత్రం వేళకాగానే బిడ్డలను పిలుచుకుంటారు. అట్లే భగవంతుడు మనలను ఆడుకునేందుకు ఈ జీవిత రంగంలోనికి పంపుతుంటారు. మన జీవితకాలం పూర్తికాగానే మనల్ని తన నిజవాసానికి పిలిపించుకుంటారు, ఇది మానవ జీవితం.


మనం అనేక జన్మలలో చేసిన పాపాల సంపుటి, కొండలు కొండలుగా పెరిగి వున్నాయి. ఈ పాపాలే మన సుఖః దుఃఖాలకు కారణాలు. భగవన్నామాన్ని జపిస్తే మీ పాపాల కొండలు పిండికాకమానవు. అట్లే నామస్మరణతో పాపాలను దహింప చేయవచ్చు. అలా చేసిన నాడే మన హృదయాలు నిర్మలమవుతాయి. అట్టి నిర్మల మనస్సుతో నడిచేవారికి సకల శ్రేయస్సులు సమకూరుతాయి. **(జూలై 1వ తేదీ శ్రీ గులాబ్ బాబా జయంతి సందర్భముగా సమర్పణ)**

సౌజన్యం : **గులాబ్ బాబా లీలాతరంగిణి**

రచన : **శ్రీ బి.పిచ్చయ్య మాస్టారు**, ఒంగోలు

# జగద్గురువు శ్రీశిరిడీసాయిబాబా

సద్గురువుగా శ్రీసాయి ప్రకటితము కావటము, భక్తులలో భగవంతుని మీద స్థిరమైన విశ్వాసము కలిగించటానికే. మనకు అనుభవముకాని ఎన్నో విషయాలను మనము నమ్ముతున్నాము. ఉదాహరణకి భూమి తన అక్షంపై తాను తిరుగుతూ, సూర్యునిచుట్టూ తిరిగుతున్నదని చదువుకున్నాము. కాని ప్రత్యక్షానుభూతి లేకపోయిన, విశ్వచైతన్యమువలన ఆత్మానుభూతి పొందకనే సద్గురువులుగా చలామణి అయ్యే అవకాశము ఎక్కువగా ఉంటుందని, అట్టి వారిని గూర్చి భవిష్యత్ పురాణము, సిద్ధయోగి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి లాంటివారు ముందుగానే హెచ్చరించారు. "పౌండ్రకవాసుదేవుని కథ" ఇట్టి విషయానికి ఒక చక్కని ఉదాహరణ. శ్రీసాయి కూడా "సద్గురువును తెలుసుకోవాలి" అని చెప్పారు.



అయితే ఆయన సద్గురువు లేక భగవత్ స్వరూపుడు అన్న విశ్వాసము మనకు ఏర్పడేదెలా? అంటే అట్టి మహాత్ముల చరిత్రలను సదా పఠనము లేక శ్రవణము చేస్తూవుంటే, వారి నిర్దుష్ట ఆచరణ, దివ్యత్వము సదా మననమై అట్టివారిని దర్శించినప్పుడు ఆనందమయమైన అనుభూతి కలిగి (ఉదా:– శ్రీ గురుని దర్శనమునకై పరితపించిన నామధారకునికి సిద్ధయోగి లభించినట్లు) సద్గురువు మీద విశ్వాసము పటిష్టమై ఆయన అనుగ్రహము కోసము మనస్సు పరితపిస్తుంది. ఇది ఆచార్యవాణి.

శ్రీసాయి తాను సద్గురువును అనలేదు. కనుకనే ఆయన జగద్గురువు. సద్గురువును తెలుసుకోవాలి అని హెచ్చరిస్తూనే సద్గురువు ఎలా వుంటాడో, వాచా బోధించకుండా, ఆచరణద్వారా చూపించారు. నన్ను చూడు, నావలె జీవించు, అన్న మాటలలోని అంతరార్థము తనలోని దివ్యత్వమును సదా దర్శించుకోమని, అట్టి మహనీయుల ఆచరణ సదా మనస్సునందు ఉంచుకోమన్న హెచ్చరికగా మనము చెప్పుకోవచ్చు.

శ్రీసాయి ఫకీరు. ఆ సాంప్రదాయాన్ని అనుసరించి మశీదులో నివశించారు. బాబా నైష్ఠిక బ్రహ్మచారి ఎల్లప్పుడు తెల్లని బట్టలనే ధరించేవారు. పళ్ళుకూడా తోముకునేవారు కారు, నోరు మాత్రము పుక్కిలించేవారు. ఆయనకు బుద్ధి పుట్టినప్పుడు స్నానము చేసేవారు. సన్యాసికి స్నానము చేయాలనే నియమము కాని, చేయకూడదనే నిషేధము కాని లేవని శాస్త్రాలు చెపుతున్నాయి. ఆయన లెండీకి వెళ్ళేటప్పుడు మాత్రమే చెప్పులు ధరించేవారు. ఫకీరు ధర్మాన్ని అనుసరించి 5 యిళ్ళలో మాత్రమే భిక్ష చేసేవారు. తనకు సమర్పించబడిన దక్షిణను సాయంత్రానికల్లా పేదలకు పంచియిచ్చేవారు. అందరిని ''భావూ'' లేక సోదరా అని సంబోధించేవారు. భేషజాలకు, ఆడంబరాలకు ఆయన ఏనాడు లోనుకాలేదు. పల్లకి ఉత్సవములో ఒక్కనాడు కూడా దానిని అధిరోహించక, పాదచారులై మాత్రమే అనుసరించేవారు. మశీదు మరమ్మత్తులకు కూడా ఆయన యిష్టపడలేదు. తనకు రాణిగారు బహుమానముగా పంపిన బంగారు నాణెముల బిందెను, వెనక్కి తిరిగి పంపేశారు. అధికారులు, ధనవంతుల మెప్పుకోసము ఆయన ప్రాకులాడలేదు. పండితులను, పామరులను సమదృష్టితో చూశారు. స్త్రీలకు రాత్రిపూట మశీదులో ప్రవేశములేదు. తనకు వాహనముగా సమర్పించిన ''శ్యామకర్ణ''ను బిడ్డలాగా చూచుకున్నారు. ఎప్పుడు నిరంతరం యోగానందమగ్నుడై, అరమోడ్పు కన్నులతో ఉండేవారు. తనవద్దకు వచ్చిన భక్తులకు శాస్త్ర పాండిత్యాన్ని ఆయన ప్రదర్శించలేదు. మాయ, బ్రహ్మము, మొదలైన మాటలు చెప్పలేదు, భక్తులకు వారి వారి సహజ సంస్కారాన్ని అనుసరించి, గ్రంథపఠనము చెప్పేవారు. ఎప్పుడు "అల్లా" అన్న నామాన్ని అంటుండేవారు. ''యాదేహక్'' అనే అరబ్బీ పదాన్ని ధునిచుట్టు తిరుగుతూ నెమ్మదిగా అనేవారు. విరామ సమయములో పిండి విసురుతూనో, ప్రసాదము వండుతూనో, కఫ్నీ చిరుగులు కుట్టుకుంటూనో, పూలమొక్కలకు నీళ్ళు పోస్తూనో, పసిపిల్లలతో కలిసి ఆడుకుంటూనో గడిపేవారు. శ్రీమతి ప్రధాన్ చెప్పినట్లు ఆయన సన్నిధిలో చింతకు తావేలేదు. నోటివెంట ఏమి చెప్పేవారు కాదు కాని, చిత్తము దానికై అదే శాంతించేది. ఇట్టి తత్వాన్నే ఆదిశంకరులు దక్షిణామూర్తి తత్వమని కీర్తించారు. తాను జగన్నియంత అయివుండికూడా, మొహిద్దీన్ తంబూలీతో కుస్తీపట్టి ఓడిపోయినారే కాని. తన దివ్యశక్తిని ప్రయోగించి గెలవలేదు. సహజమైన కరుణ ఆయన హృదయములోనుంచి ఎప్పుడూ ప్రవహిస్తుండేది. తన దర్శనార్థము వచ్చిన భక్తులు భోజనము చేయలేదని తల్లడిల్లె ఆయన హృదయవేదన చూస్తే, జగత్ప్రభువుగా తన బిడ్డలపై ఎంత ప్రేమో తెలుస్తుంది. తాను వెలిగించిన ధుని కూడా మీ అందరి పాపాలు దహించటానికే అన్నారు. తన గురువు ప్రసాదించిన ఇటుకను ఎంతో ప్రాణప్రదముగా చూచుకునేవారు. తన ఈ ప్రతిభకంతా తన గురువే అని అన్నారు. కాని ఆ ఆధిక్యతను తనకు ఆపాదించుకోలేదు. గత జన్మల సంస్కారాలవలన బాధపడుతూ తనను దర్శించటానికి వచ్చినవారిని, మొదట కోపించినా, ఆర్తితో శరణు వేడగానే, కరుణించిన దయామయుడు. శాస్త్రముల సరిఅయిన అర్థము మనకు తెలియదనే ఆయన శాస్త్రం

జోలికి పోలేదు, శాస్త్ర చర్చలు చేయలేదు. తన జీవితకాలములో ఎట్టి సేవను ఆయన ఉచితముగా పొందలేదు. తన భక్తులను ఆకట్టుకొనటానికి ఎట్టి చిల్లర మహిమలను ప్రదర్శించలేదు. పైగా దానిని "వేశ్యతో ముద్దులాటగా" అభివర్ణించారు. అవసరమైనప్పుడు ఆయన ప్రదర్శించిన దైవలీలలు, "నభూతో నభవిష్యతి" ఉదా:– పంచభూతాలను శాసించటము, కర్మానుభవాన్ని మార్చటము, మృత్యువును శాసించటము మొదలగునవి. ఒక్క దైవస్వరూపుడు మాత్రమే అట్టివి చేయగలడు.

భక్తుల బాధలను, కష్టాలను స్వీకరించి, వారికి ధన, ధాన్య సంపదలను అనుగ్రహించటమేగాక, వారికి శుభ్రమార్గాన్ని, ధర్మమార్గాన్ని, సత్యమార్గాన్ని బోధించారు. ఆధ్యాత్మికతకు సద్గురు సేవ ఎంతముఖ్యమో, సద్గురువును తెలుసుకోవటము కూడా అంతే ముఖ్యమని సూచించారు. దానికి హేమాద్రిపంత్ మనస్సులో అశాంతిరేపినా, సాఠేకు స్వప్నదర్శనమిచ్చి సూచించినా, కుశాభావుని పాపరహితుని చేయటానికి ఆదేశించినా, "శ్రీగురుచరిత్ర"ను సాధనముగా సూచించారు. పూజ్యశ్రీ ఆచార్య భరద్వాజగారి మాటలలో భగవంతుడు, సద్గురుసాయి అనే దివ్యజ్యోతిగా శిరిడీలో అవతరించినది ఈ సత్యాన్ని తెలియచెప్పటానికే, కాని కలి "జవహర్ ఆలీ" అనే బుట్టను తయారుచేసి దానిపైన బోర్లించాలని, ఆ జ్యోతి వెలుగు మనకు కనబడకుండా చేయాలని ప్రయత్నించాడు కాని "దేవిదాసు" అనే సత్య పురుషుడు, కలిమాయను, భగవంతుని ప్రేరణపై జవహర్ ఆలీ మోసపు ఆటకట్టించాడు. అందువల్ల సత్యమైన సద్గురుతత్వము, ఆ శుభ్రమార్గము మనకు అందించటానికే శ్రీసాయి యీ లీలావిలాసము జరిపించారు.

రచన : **శ్రీ కె.వి. రంగారావు**, ఒంగోలు

సేకరణ : **శ్రీమతి ఆర్. సాయి సృజన,** బెంగుళూరు

## పండుగలు - పర్వదినాలు

### జూలై - 2022

1. శ్రీ గులాబ్‌బాబా జయంతి (తేదీప్రకారం) కాటేల్
1. పూరీ జగన్నాథుని రథయాత్ర
10. తొలి (శయన) ఏకాదశి
12,13,14 గురుపూర్ణిమ మహోత్సవాలు – పవర్‌సిటీ, విశాఖపట్నం
13. గురుపూర్ణిమ – వ్యాసపూర్ణిమ
17. కర్కాటక సంక్రమణం – దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభం
23. ఆడి కృత్తిక

### ఆగష్టు- 2022

7. సాయిభక్త స్వామి కేశవయ్యస్వామి ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
7. విశ్వకవి శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి
9. మొహరం
11. కులపతి శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్య జయంతి
12. హయగ్రీవ జయంతి, రాఖీపండుగ, శ్రావణపౌర్ణమి, సద్గురువుల పాదుకామహోత్సవము, పాకలపాడు గురువుగారి ఆశ్రమము, నర్సీపట్నం
13. రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవము (తిథిప్రకారం)
13. శ్రీ వాసుదేవానంద సరస్వతిస్వామి జయంతి
13,14,15 తేదీలు 28వ సద్గురువుల పాదుకామహోత్సవము, పవర్‌సిటీ, విశాఖపట్నం
15. స్వాతంత్ర్యదినోత్సవం
17. హజరత్ శ్రీ తాజుద్దీన్‌బాబా ఆరాధనోత్సవం
19. కృష్ణాష్టమి
24. అవధూత శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవము, (తేదీప్రకారం)
27. పోలాల అమావాస్య
29. తెలుగు భాషాదినోత్సవం, గిడుగు వేంకటశ్రీరామమూర్తి జయంతి
31. వినాయక చవితి
31. శ్రీ శ్రీపాద శ్రీవల్లభుల జయంతి

### సెప్టెంబరు - 2022

1. శ్రీ పంచమి, శ్రీ గజానన్ మహరాజ్ ఆరాధనోత్సవం, షేగాం
3. అవధూత శ్రీ చీరాలస్వామి ఆరాధనోత్సవం (తిథిప్రకారం)
3. భేట్‌గామ్ శ్రీ నారాయణ మహరాజ్ జయంతి
5. ఉపాధ్యాయ దినోత్సవం
5. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి
8. ఓనం పండుగ
9. అనంతపద్మనాభ చతుర్దశి
11. మహాలయ పక్షాలు ప్రారంభం
17. విశ్వకర్మ జయంతి
25. మహాలయ అమావాస్య
26. దేవీ నవరాత్రులు ప్రారంభం


### అక్టోబరు - 2022

2. గాంధీజయంతి
2. సరస్వతీ పూజ
3. దుర్గాష్టమి
4. మహర్నవమి
5. విజయదశమి
   శ్రీ శిరిడీసాయిబాబా 104వ మహాసమాధిమహోత్సవం
24. నరక చతుర్దశి
25. దీపావళి
26. ఆకాశదీపం (కార్తీకమాసం) ప్రారంభం
27. భగినీ హస్తభోజనం
28. సాయిదీక్షలు (మండలం) ప్రారంభం, పవర్‌సిటీ
29. నాగులచవితి
30. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతోత్సవం (తేదీప్రకారం)
31. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతోత్సవం (తిథిప్రకారం)

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

“సిద్ధ యోగీంద్రులు”

“ప్రస్తుతము ఆ దృశ్యము, ఆ కాలము గడిచిపోయినయ్యి, కాని, ఇక ముందుకూడ అటువంటి దృశ్యాన్ని చూడలేము. అయినను ఆలనాటి ఆ దృశ్యం జ్ఞప్తికివచ్చి మదిలో మెదిలితే చాలు మనస్సంతా శాంతి, తృప్తితో ఆనంద డోలికలలో మునిగి పారవశ్యం చెందుతుంది” అంటారు శ్రీ సాయిబాబా చరిత్రకారకుడు అయిన హేమాద్రిపంత్‌గా ప్రసిద్ధికెక్కిన అన్నాసాహెబ్ ధబోల్కర్. ఇంతకీ అంతగా భక్తి పారవశ్యంలో ముంచెత్తే ఆ దశ్యమేమిటి? అదే అలనాడు శిరిడీలో రోజు విడచి రోజు అత్యంత వైభవంగా జరిగి నేడు ప్రతి గురువారము నయన మనోహరంగా జరుపబడుతున్న, పల్లకీ ఉత్సవముగా ప్రసిద్ధి కెక్కిన చావడి ఉత్సవం.




శ్రీసాయి స్వప్నాదేశముతో, శిరిడీ సాయినాథుడే తన పరమ గురువని నమ్మి సాయిసేవలో నిమగ్నమైన శ్రీ రఘువీర పురందరే శ్రీసాయి పలు విధాల పరీక్షించినా, పరిణితి చెందాడేగాని, పల్లెత్తు మాట్లాడలేదు. క్రమేపీ అతనికి తను చేసే ప్రతి చర్య, భావన సాయి తలంపుకు లోబడే జరుగుతుందని, శ్రీసాయి తనను నిరంతరము వెంటనుండి నడిపిస్తున్నారని, బలీయముగా నమ్మేవాడు పురందరే. అందుకు తగ్గట్లుగా అనేక సంఘటనల ద్వారా అది అతనికి అనుభవమయ్యేది.అంతేకాక అతని మనస్సు నిరంతరము బాబాపై లగ్నమవ్వటంతో ప్రతి క్షణము తాను ఎక్కడఉన్నా సాయి సన్నిధిని అనుభవించేవాడు. ఒకసారి తన భార్య బిడ్డలు, తల్లితో కలసి తన భార్య పుట్టింటికి బయలుదేరి రైల్వేస్టేషనుకు వచ్చాడు పురందరే, సరిగ్గా రైలు ఫ్లాట్‌ఫామ్ మీదకు వచ్చేసమయంలో “సాయి నన్ను శిరిడీ రమ్మని పిలుస్తున్నారని అనిపిస్తున్నది, నేను వెంటనే శిరిడీ వెళ్ళాలి కనుక, మీరు ఇంటికి తిరిగి వెళ్ళండి, ఊరు తరువాత వెళదాము” అని భార్య, తల్లితో చెప్పి, వారు ఎంత వారిస్తున్నా వినక అప్పుడే వచ్చిన రైలు ఎక్కి మన్మాడు మీదుగా శిరిడీ చేరి, పురందరే ద్వారకామాయిలోకి అడుగిడేసరికి అది భక్తులతో నిండిపోయిఉంది. వారి మధ్యలో ఆశీనుడైన బాబా ఉబ్బసంతో బాధ పడుతూ రొప్పుతూ ఉన్నారు. మాట మాత్రంచేత, చేతి ఊదితో అందరి రోగాలను, బాధలను తొలగించే బాబా అట్లా అస్వస్థతతో ఉండటము చూసి, ఏమీ చేయలేని తన అసహాయతను తలచుకుని కన్నీటి పర్యంతమైనాడు పురందరే. “ఎందుకు ఏడుస్తావు, ఏమికాదులే, అల్లా ప్రసాదించారు కనుక అల్లానే నివారిస్తారు, నాలుగు రోజులలో తగ్గిపోతుంది, అయినా మూడు రోజుల నుండి నీ గురించే అనుకుంటున్నాను, నిన్ను రమ్మని జాబు వ్రాయమని కాకాసాహెబ్‌తో చెప్పేను” అన్నారు బాబా. “నేను ఊరు ప్రయాణంలో ఉన్నాను, కాకా వ్రాసిన జాబు ఇంకా నాకు చేరలేదు, అయినా తగుప్రేరణ కలిగించి మీరేనన్ను ఇక్కడకు లాగేరు” అన్నాడు పురందరే. “నిజానికి బాబా మాటపై కాకాసాహెబ్, పురందరేకు జాబు వ్రాయబోతుంటే, అతనిని వారించి, వద్దులే అతనే ఇక్కడికి వస్తున్నాడు” అన్నారు సాయి. ఆవిషయం కాకాసాహెబ్ పురందరేకు తెలియజేయగా, తనపై బాబాకు గల అవాజ్యమైన ప్రేమకు పరవసించిపోయాడు పురందరే. అటుపిమ్మట మరింతగా సాయితో సన్నిహితంగా మెలగసాగేడు పురందరే. తద్వారా, సాయి సన్నిధిలో జరిగే అద్భుతము, అనిర్వచనీయము అయిన చావడి ఉత్సవ వైభవానికి కారణభూతుడయ్యాడు పురందరే.

ఒకసారి శిరిడీలో కురిసిన కుంభవృష్టికి మశీదు పైకప్పు కూలిపోగా, దాని మరమ్మత్తు నిమిత్తము బాబాను భక్తులు బలవంతంగా ఒప్పించి, తాత్కాలికముగా బాబాకు చావడిలో వసతి ఏర్పాటు చేశారు. మశీదు మరమ్మత్తులు పూర్తి అయిన పిమ్మట బాబాను, మేళతాళాలతో మశీదుకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అప్పటినుండి బాబా రోజు విడచి రోజు చావడిలో నిద్రించసాగేరు. ఇది గమనించిన భక్తులు దానిని ఉత్సవముగా ఎందుకు నిర్వహించుకోకూడదు అని భావించి, బాబా మశీదునుంచి చావడికి బయలుదేరిన రోజు ఊరేగింపుగా జరుపుకునేవారు. అయితే కొన్నిరోజుల తరువాత బాబా పూర్తిగా మశీదులోనే నిద్రించటము ప్రారంభించారు. నయనానందకరమైన ఆ ఉత్సవాన్ని కొనసాగించాలని భావించిన హార్దా గ్రామములోని భక్తులు కొందరు ఒక పల్లకిని తయారుచేయించి, ఒక చెక్కపెట్టెలో భద్రంగా బిగించి శిరిడీకి పంపేరు. ఆపెట్టె చాలారోజులు ద్వారకామాయి ముంగిట బాబాకూర్చునే రాతిబండ మరియు తులసీ బృందావనం మధ్య ఉండిపోయింది. దానిని తెరవాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా బాబా అందుకు సమ్మతించలేదు. దాదాపు రెండు, మూడు మాసాలు అది అక్కడే ఉంది. పెట్టెలోని ఆ పల్లకిని బయటకు తీసి, ఉత్సవం నిర్వహించాలని భక్తుల మనోభీష్టము. చివరకు ఒకరోజు శ్రీసాయిపై అవాజ్యమైన గౌరవాభిమానాలతో పాటు, సాయితో సన్నిహిత్యము కలిగిన పురందరే “ఈరోజు మీరు

భక్తుల అభీష్టము అంగీకరించవలసిందే, ఎంతకాలము దానిని అట్లా వృథాగా ఉంచుతాము, దానిని బయటకు తీసి, పూలతో సుందరముగా అలంకరించి దైవమైన మిమ్ములను దానిలో ఊరేగింపుగా చావడికి తీసుకువెళ్ళి ఉత్సవం జరుపుకుంటాము మీరు మా విన్నపాన్ని మన్నించవలసిందే" అంటూ, పార్సిల్ విప్పటానికి సమాయుక్తమయ్యాడు పురందరే. శ్రీసాయి అందుకు అంగీకరించనని చెబుతున్నా, పార్సిల్ ఊడదీయటం ప్రారంభించాడు పురందరే. శ్రీసాయి రెండు మూడు సార్లు చాలా తీవ్రంగా పురందరేని వద్దని వారించారు, అయినా పురందరే తన పని మానలేదు. కోపోద్రిక్తులైన శ్రీసాయి పురందరేను తిడుతూ "చెప్పిన మాట వినకపోతే చంపేస్తానని" అంటూ సటకా తీసుకుని అతనిని కొట్టటానికి మశీదు మెట్లు దిగి వడివడిగా వచ్చారు. అంతవరకు సాయి మందహాసము మాత్రమే చూసిన భక్తులు, సాయి ఆవేశాన్ని చూసి భయభ్రాంతులతో మశీదు బయటకు పరుగులు తీశారు. సాయికోపం చూసి సటకాదెబ్బలతో పురందరే వీపు చీరిపోవటం ఖాయమనుకున్నారు భక్తులు. పురందరే మాత్రము అదేమి తనకు సంబంధంలేనట్టుగా తనపని కొనసాగించాడు. కోపావేశాలతో మశీదు మెట్లు దిగి పురందరే దగ్గరకు వచ్చిన శ్రీసాయి, పదిమంది, శ్రేయస్సు, సంతోషం కోసం తాను ఏమయినా పరవాలేదు అంటూ ఒళ్ళప్పగించి, మనస్సు పనిమీద లగ్నం చేసిన పురందరేను క్షణకాలం పరికించిచూసి, శాంతించి, "వీడు చెప్పినమాట వినడు" అంటూ కేకలు వేస్తూ తిరిగి వెళ్ళి మశీదులో యథాస్థానములో ఆశీనులయినారు. (ఆ సమయంలో పురందరే స్థానంలో మనము ఉంటే ఏమిచేసేవారలము?) చివరకు పార్సిల్‌విప్పి పల్లకీని బయటకు తీసిన పురందరే దానిని పూలతో అలంకరించాడు. అప్పటికి బాబా పూర్తిగా శాంత పడ్డారు అని నిర్ణయించుకున్న పురందరే, నెమ్మదిగా సాయి చెంత చేరి "బాబా ఈరోజు చావడి ఉత్సవం, మీమీద ఎంతో భక్తిశ్రద్ధలతో హర్దా గ్రామస్తులు ఆ పల్లకీ పంపేరు. దానిని మా శక్తిమేర సుందరముగా అలంకరించటానికి ప్రయత్నం చేశాము. అందులో మా దైవమైన నిన్ను సాయంత్రం ఊరేగింపుగా తీసుకువెళ్ళాలని మాఅందరి మనోరథం. ఎక్కడెక్కడి వారి మనోరథాలు తీర్చే మీరు, ఇక్కడ మాఅందరి ప్రార్థనను మన్నించి, పల్లకి అధిరోహించండి" అని వేడుకున్నాడు. అతను ఎంతగా వేడినా శ్రీసాయి అందుకు సుతారాము అంగీకరించలేదు. తాను ఎట్టి పరిస్థితులలోను పల్లకీ ఎక్కే ప్రసక్తేలేదని నిశ్చయముగా చెప్పేరు, "పల్లకీని ఖాళీగా తీసుకుపోవటం వలన ఉపయోగమేమిటి? కనుక మీరు పల్లకీ ఎక్కవలసిందే" అంటూ మొండిగా వాదన చేస్తున్న పురందరేను వారిస్తూ ఉగ్రులైన సాయి, "ముందు నువ్వు ఇక్కడనుంచి వెళతావా లేదా, నేను చెప్పిన మాట వినకపోతే ఏం చేస్తానో తెలుసా" అంటూ సటకా పైకెత్తి తీవ్రంగా తిడుతూ, పురందరేను బెదిరించారు బాబా. అలంకరణ పూర్తయిన పల్లకీని మరొకసారి పరికించి చూసి శ్రీసాయికి నమస్కరించి, "సాయంత్రం పల్లకీ ఉత్సవానికి వస్తాను" అంటూ ఇంటికి వెళ్ళిపోయాడు పురందరే.

సాయంత్రమయింది, శ్రీమాన్‌బూటీ,బాపూసాహెబ్, జోగ్, ఇంకా అనేకులు మశీదుకు చేరేరు. మొట్టమొదటిసారిగా పల్లకీతో జరిగే చావడి ఉత్సవం తిలకించటానికి భక్తులు కూడ అధిక సంఖ్యలో మశీదు ముంగిట చేరేరు. బాబాను పల్లకీలో కూర్చోమని భక్తులు ప్రాధేయపడ్డారు. అందుకు బాబా ససేమిర ఒప్పుకోలేదు. సాయంత్రం గడిచిపోతున్నది, సరిగ్గా సమయానికి మశీదు చేరిన పురందరే, మరల తన పాత మాటే మొదలుపెట్టేడు, "పల్లకీలేకుండా చావడి ఉత్సవం జరగదు, కనుక ఈరోజు పల్లకీలో శ్రీసాయి ఆశీనుడవ్వాలి" అని జోగ్, బూటీలతో కలసి శ్రీసాయిని ప్రార్థించాడు పురందరే. సాయి అందుకు అంగీకరించలేదు అయితే తాను ఈరోజు చావడి ఉత్సవంలో పాల్గొనబోవటం లేదని, తన గ్రామం తిరిగి వెళ్ళిపోతానని పట్టుపట్టేడు పురందరే. అసలు ఈరోజు ఉత్సవం జరుగుతుందా లేదా అన్న సంశయంలో పడిపోయారు భక్తులు. "బాబా కోపావేశాలకు బలి అవుతూనే ఎన్నో నెలలుగా మూలపడి ఉన్న పల్లకీని బయటకుతీసి అలంకరించిన పురందరే, ఈనాటి ఉత్సవంలో ఉండకపోగా సాయి ఆశీనుడవ్వని పల్లకీని ఊరేగింపు జరిపితే ప్రయోజనమేమి! అని తలచిన జోగ్, బూటీ తదితర భక్తులు బాబా పాదాలచెంత చేరి భక్తుల అభీష్టాన్ని మన్నించమని వేడుకున్న మీదట తన ప్రతి రూపంగా పల్లకీలో పాదుకలు మాత్రమే ఉంచటానికి, తాను పాదచారియై ఊరేగింపుతో నడుస్తానని అందుకు మాత్రమే తాను అంగీకరిస్తానని శ్రీసాయి చెప్పటంతో, ఉభయతారకమైనదిగా భావించిన భక్తులు నాటి చావడి ఉత్సవాన్ని మొట్టమొదటి సారిగా పల్లకీతో జరపటానికి సమాయుక్తమైనారు. అలకవీడిన పురందరే బాబా వద్దకు వచ్చి వారి పాదాలపై పడి నమస్కరించాడు. అనునయనంగా అతని మనోభావాన్ని ఎరిగిన శ్రీసాయి అతని తలను నిమిరేరు, "బాబా పల్లకీని నేను భుజంపై ఎత్తుకునేదా" అని అడిగేడు పురందరే. "నీవు ఆ పని చేయవద్దు 125 వత్తులతో వెలిగించిన దివిటీని పట్టుకొని, పల్లకీ వెంట నడువు" అని ఆదేశించారు బాబా. శ్రీసాయి మాటను శిరసావహించాడు పురందరే. పల్లకీ ఉత్సవానికి అంతగా శ్రమించి, నాంది పలికిన పురందరేని పల్లకీ మోయక, పల్లకీ వెనుక 125 వత్తుల దివిటీని పట్టుకొని నడువమన్న శ్రీసాయి ఆదేశములోని అంతర్యము ఏమిటో, అటుపిమ్మట జరిగిన అద్భుతమైన సంఘటన విషయ విశేషాలను వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.



# శ్రీ గురు చరిత్రామృతము

వివరణ : వి.వి. పూర్ణచంద్రరావు

"నాకు అర్పించకుండా ఎవరు ఏమి తినరో వారికి నేను బానిస" అన్నారు ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తి అయిన శ్రీ శిరిడీసాయినాధుడు. మధ్యాహ్న సమయంలో భిక్షకై వచ్చిన వారిని ఆదరించటము గృహస్తు ధర్మము. రిక్త హస్తముతో తిరిగి వెడలే భిక్షువు, గృహస్తు పుణ్యాన్ని తీసుకుని వెళతాడని శాస్త్రం, కనుక, ఎవరైనా భిక్షను అడిగితే వారికి చేతనయినంతగా భిక్షను ఇవ్వటమో, లేకుంటే కనీసం అటుకులు, బెల్లం ముక్కనైన ఇచ్చి పంపటం ద్వారా గృహస్తు తన ధర్మం నెరవేర్చిన వారవుతారని శాస్త్రవాక్యం. "ఇవ్వలేని పరిస్థితి ఉంటే ఇవ్వలేనని చెప్పు, అంతేకాని అవహేళన చేయటం గాని, విదిలించటము కాని, చేయవద్దని" శ్రీసాయినాధుడు మనలను హెచ్చరించారు. ఆ ధర్మ సూక్ష్మాన్ని ఋషులు తమ ఆచరణ ద్వారా మనకు తెలియజేశారు. అలనాడు అనసూయామాత త్రిమూర్తులకు భిక్షనిచ్చి, శ్రీ దత్తాత్రేయుడినే పుత్రునిగా పొందింది. 13వ శతాబ్దములో, సుమతి మధ్యాహ్న సమయములో భిక్షువు రూపంలోని శ్రీదత్తాత్రేయుడికి భిక్షనిచ్చి పొందిన వరము వలన, కలియుగములో మొట్టమొదటి దత్తావతారుడైన శ్రీపాద శ్రీవల్లభుడిని పుత్రుడిగా పొందింది. భిక్షకుడైన పరమేశ్వరుడు, మధ్యాహ్న సమయంలో అనేక రూపాలలో, భిక్షస్వీకరిస్తాడు. మన పాపాలను వారి జోలెలో వేసి, పుణ్యం పొందమనే జగద్గురువు బోధ. భగవంతుడు ప్రసాదించిన దానిని కృతజ్ఞతతో కొంత వారికే సమర్పించటము ద్వారా, తిరిగి వారి కృపకు పాత్రులవ్వటమే కాకుండా, అందించినది అక్షయమై తిరిగి పొందగలము. భూమి సారవంతమైన కొలది, పొదివిన విత్తు అధిక ఫలసాయమిచ్చినట్లు, చేసే దానము, విధానము, భావన ననుసరించి మరియు గ్రహీత స్థాయి, స్థితిననుసరించి ఫలితం ఆధారపడి ఉంటుంది. ఆ విషయాన్ని చాలా ప్రస్ఫుటంగా తెలియజేస్తుంది త్రియాకాండ రూపమైన శ్రీగురుచరిత్రలోని జ్ఞానకాండలో అంతర్గతమైన 18వ అధ్యాయము.

కలియుగములో రెండవ దత్తావతారమైన శ్రీగురుడు తన తీర్థయాత్రలో భాగముగా కృష్ణ-పంచగంగ సంగమ క్షేత్రము చేరి, సంగమ క్షేత్రమైన నర్సోబావాడిలోని కృష్ణా సంగమ తీరమునకల ఔదుంబర వృక్షఛాయలో నివసిస్తూ, తన అనుష్టానము కొనసాగించసాగేరు. మధ్యాహ్న సమయములో భిక్షార్ధమై సమీపములోని అమరపురం గ్రామం వెళుతూ ఉండేవారు శ్రీగురుడు. ఆ గ్రామములో, వేదాధ్యాయన పరుడైన ఒక బ్రాహ్మణుడు నివసించేవాడు. నిరుపేద అయిన ఆ బ్రాహ్మణుడు తన శక్తి మేరకు పంచ మహాయజ్ఞాలను (బ్రహ్మయజ్ఞం, దేవయజ్ఞం, పితృయజ్ఞం, భూతయజ్ఞం, మనుష్యయజ్ఞం) తన సహధర్మచారిణి సహకారముతో, తన కుమార్తె, కుమారుడితో కూడి తన శక్తి మేరకు పాటించేవాడు. ఉదర పోషణకై యాయవార (భిక్షాటన) వృత్తితో తన కుటుంబపోషణ చేసుకుంటూ, త్రికరణ శుద్ధిగా తన ధర్మాన్ని నిర్వర్తించేవాడు. ఒకరోజు యాయవార వృత్తికై వెడలి, నిండుకున్న పాత్రతో, రిక్త హస్తాలతో, ఉసూరుమంటూ మధ్యాహ్న సమయానికి ఇంటికి తిరిగి వచ్చాడు ఆ బ్రాహ్మణుడు. ఇంట్లో దినుసులు పూర్తిగా నిండుకున్న తరుణంలో తన భార్య, పిల్లల ఆకలి నాడు ఎట్లా తీర్చాలి అని ఆలోచిస్తూండగా, వాకిలి ముంగిట భిక్షకై నిలచిన శ్రీగురుడిని చూసి లిప్తపాటు స్థాణువై, మరుక్షణం ఆశ్చర్య ఆనందాలలో మునిగిపోయాడా బ్రాహ్మణుడు. తామే మధ్యాహ్న భోజనము కొరకై ఆలోచిస్తున్న తరుణంలో త్రిమూర్తి స్వరూపుడుగా భాసిస్తూ, మేడిచెట్టు మూలములో, తన తపోధనముతో ఆర్తుల, అర్ధార్ధుల బాధలను తీర్చే స్వామి, నేడు భిక్షకుడై తమ వాకిలి ముంగిట నిలచినారు. క్షణకాలం ఆలోచనా తరంగుడైన ఆ బ్రాహ్మణుడు మరుక్షణమే తేరుకుని, తన భార్యతోకూడి స్వామికి అర్ఘ్యపాద్యాదులు సమర్పించి, గృహములోనికి సాదరంగా ఆహ్వానించి, పీటవేసి స్వామిని ఆశీనులను చేసి, సకుటుంబ సపరివారముగా స్వామిని యథాశక్తి పూజించాడు. అనంతరం తమ వాకిట విరగకాసిన తమ్మపాదులోని కాయలను కోసి కూరవండి స్వామి ముందు ఉంచి, "స్వామీ! సర్వులకు సర్వము ప్రసాదించే మీ ఆకలిని సంపూర్ణముగా తీర్చలేని అశక్తత, నేడు నాయింట నెలకొన్నది. అలనాడు శ్రీకృష్ణుడు ధనవంతుల భవనాలకు వెళ్ళక విదురుని ఇంటికి వెళ్ళి, ఆప్యాయంగా ప్రేమతో ఆ ఇంటి ఇల్లాలు అందించిన అరటిపండు పైభాగాన్నే ఆహారముగా స్వీకరించారని చదివేను. కాని ఇది నాకు వరమో, శాపమో తెలియదు గాని, కనీసం 'పండు'నైనా సమర్పించలేని స్థితిలో, నేడు మాయింటి పంట అయిన తమ్మకాయలు కూరనే మీకు నేను భిక్షగా సమర్పించ గలుగుతున్నాను, అక్షేపణ చేయక, ఆహారముగా స్వీకరించమని" ముకుళిత హస్తాలతో విన్నవించుకుంటున్న

ఆబ్రాహ్మణుడిని, అనుసరించిన ఆఇల్లాలిని, వారి కుమార్తె, కుమారుడిని మందహాసముతో పరికించి చూసి, ఆకూరనే కడుపారా ఆరగించి, కొద్ది సేపు అక్కడనే విశ్రాంతి తీసుకొని, బయలుదేరుతూ, "ఓ బ్రాహ్మణుడా, నేడు నీయింట ప్రేమతో మీరు వండి వడ్డించిన ఒక్క కూరతోనే విందుభోజనం ఆరగించినట్లయింది. మీ ఆతిధ్యానికి మేమెంతో సంతోషించాము, ఉన్న దానితో సంతృప్తిపడుతూ, స్వధర్మాన్ని పాటిస్తూ, నీవు అందించిన ఆతిధ్యము మమ్ములను పరవసింపచేసింది. నేటితో నీ దారిద్ర్యం తీరిపోయింది, సుఖంగా భోగభాగ్యాలతో తులతూగుతూ ఉండండి" అంటూ బయలుదేరి వెళుతూ నిండుగా విరగకాసిన ఆ తమ్మపాదును ఒక్కసారి తేరిపారచూసి, లిప్తపాటుకాలంలో ఆ పాదును పీకివేసి, దాని తీగలను త్రుంచివేస్తూ, త్వరితగతిన ఆప్రదేశము వీడి వడివడిగా వెళ్ళిపోయారు శ్రీగురుడు.


శ్రీగురుడి చర్యకు క్షణకాలము స్థాణువై పోయారా దంపతులు, తాము చేసిన అపరాధమేమి, ఆహ్వానములోగాని, పూజలో గాని, ఆతిధ్యసేవలో గాని, తెలియక ఏమైనా లోపం చేశామా? ఆహారములో తమ అశక్తతను వెల్లడిచేసే కదా స్వామికి కూర వడ్డన చేసింది, ఉన్న ఆ ఒక్కపాదును కూడ తమకు లేకుండా చేశారేమిటి! అని క్షణకాలం అంతర్మధనుడైన ఆ బ్రాహ్మణుడు వెంటనే తేరుకొని "త్రికరణ శుద్ధిగా మనము ఆచరించిన దానిలో తెలియక చేసిన దోషము ఏమయినా ఉంటే తొలగించటానికి, స్వామి చర్యలోని భావమేమో, లేకుంటే సర్వులను పోషించే స్వామి, మన ఆకలి తీర్చే ఆ పాదును ఎందుకు పెరికివేస్తారు? **"ప్రయత్నం చేయాలి గాని ఫలితం ఆశించరాదు, ఆశించి, అనుకున్నది జరగలేదని దూషిస్తే, పొందిన పుణ్యంకూడ క్షయమైపోతుంది, కనుక సృష్టిలో జరిగే ప్రతిచర్య భగవంతుడి ఆధీనమై జరుగుతుంది, దానిని అనుసరించాలే గాని ప్రశ్నించరాదు. భావం సరిచేసుకోవాలే గాని, సంశయించరాదు"** అని తనను తాను సమన్వయ పరచుకోవటమే కాకుండా భార్య, కుమారులకు కూడ బోధ పరచి, "శ్రీగురుడు వెళుతూ మన దారిద్ర్యం తీరిపోయింది అన్నారు, తద్వారా మనలోని దుష్కర్మను పెరికివేసి ఉన్నతులను చేయటానికి ప్రతీకగా శ్రీగురుడి చర్యలోని భావమేమో. దానిని మనస్ఫూర్తిగా అంగీకరించటమే మన విధి" అంటూ మొక్కను తిరిగి నాటటానికై పాదు మొదట్లో కొంచెం లోతుగా తవ్వసాగేడు ఆ బ్రాహ్మణుడు, గడ్డపారకు అడ్డుతగలగా మరింత లోతు తవ్విచూడగా, ఒక రాగిబిందె కనబడింది, దానిని వెలికి తీసి చూడగా, నిండుగా బంగారు నాణేలు ఉన్నాయి. అది చూసిన ఆ దంపతులు అమితమైన ఆశ్చర్య ఆనందాలలో మునిగిపోయారు. "నేటితో మీ దారిద్ర్యం తీరిపోయిందని", శ్రీగురుడి అభయంలోని ఆంతర్యం బోధపడింది, ఆ పాదు పీకివేయటం ద్వారా, ఇంతవరకు దానిని పోషించినందుకు బదులుగా అంతకు మించిన ఐశ్వర్యము, మీకు ఆ పాదు అందించబోతున్నదని తెలియజేయటానికే స్వామి దానిని పెరికి వేశారని గ్రహించి, స్వామి కృపానుగ్రహానికి పరవశమెందిన ఆదంపతులు తక్షణమే శ్రీగురుడి చెంతకు చేరి, ఆనందాశ్రువులతో విషయమంతా శ్రీగురుడికి విన్నవించారు. మందహాస వదనారవిందముతో ఆలకించిన శ్రీగురుడు వారికి అభయమిస్తూ, "జ్ఞానసంపన్నుడవైన నీ ధర్మాచరణకు సంతసించి, నీకా సంపద ప్రసాదించాము. నేటినుంచి లభించిన దానితో సుఖముగా జీవించండి, అయితే సంపద విషయం మాత్రము ఎవరితోను ప్రస్తావించవద్దు, తద్వారా అది నశించిపోతుంది. జ్ఞానముతో కూడిన సంపదే ఎప్పుడూ శాశ్వతముగా నిలుస్తుంది. జ్ఞానసంపదతో కూడి, లౌకిక సంపద ఉంటుందిగాని, లౌకిక సంపద ఒంటరిగా మనలేదు (జ్ఞాన సరస్వతితో కూడిన లక్ష్మి స్థిరమవుతుంది గాని, ఒంటరియైన లక్ష్మి చంచలమై కదలిపోతుంది). అదిమరచి, జనులు ఆశతో ఆశ్రయించటానికి ప్రయత్నం చేస్తారు. అందుకే వెళ్ళడి చేయవద్దు. నీస్వధర్మాన్ని వీడక చరించు, భోగభాగ్యాలు అనుభవించి, చివరకు నిరామయులై ముక్తిపొందుతారు" అని శ్రీగురుడు ఆ దంపతులను ఆశీర్వదించి పంపేరు. అటుపిమ్మట జరిగిన విషయ విశేషాలు వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.




## భార్యని గౌరవించేవాడు

లోకంలో సహజంగా వినిపించేమాట పురుషుడే అధికుడని. శంకరుని విషయంలో అది సరికాదు. శంకరుడు తన భార్య పార్వతిని నిరంతరం గౌరవిస్తూనే వుంటాడు. పార్వతితో తనకి వివాహం కాకముందు తానే స్వయంగా మారురూపంలో ఓ బ్రహ్మచారివేషంలో ఆమె వద్దకి వెళ్ళి – శంకరునికి తల్లిదండ్రులెవరో ఎవరికీ తెలియదనీ, బూడిదమాత్రమే ఒంటికి పూసుకుంటాడనీ– ఇల్లులేని కారణంగా శ్మశానంలోనే ఉంటాడనీ, నిత్యం భిక్షకోసం తిరుగుతూ ఉంటాడనీ, భిక్షాపాత్ర కూడా లేని కారణంగా పుర్రెని భిక్షాపాత్రగా ధరిస్తాడనీ... ఇలా ఉన్న దున్నట్లుగా తన కాబోయే భార్యకి నిజాన్ని చెప్పిన ఒకే ఒక్క ప్రియుడు శంకరుడు. లోకంలో ప్రేమికులందరికీ ఒక తీరుగా మార్గదర్శకుడు కూడా.

తనకంటె తన భార్య పార్వతి బాగా ఆలోచించగలదని తెలిసి తన కంటె జ్ఞానవతిగా ఆమెని గుర్తించి నిరంతరం ఆమె వద్దకి వెళ్ళి భిక్షని యాచిస్తాడు శంకరుడు. ఆయన చేతిలోని పుర్రె మన తలమీది పైభాగానికి సంకేతం ఆమె పెట్టే అన్నం జ్ఞానానికి సంకేతం. కాబట్టి ఆయన ఆ అన్నపూర్ణనుండి గ్రహించేది 'జ్ఞాన(అన్న) భిక్ష' తప్ప మనలా అన్నం మాత్రం కానేకాదు, అందుకే – "అన్నపూర్ణే సదాపూర్ణే శంకరప్రాణవల్లభే జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం, భిక్షాం దేహి చ పార్వతి" అంటుంది శ్లోకం.




# ఒక్క క్షణం !

ఒకసారి బొమ్మలవాడు మూడు బొమ్మలను అక్బర్ చక్రవర్తికి బహుమతిగా ఇచ్చాడు. ఆ మూడు బొమ్మలు ఒకే రకమైన ఆకారంలో వున్నాయి. ఎక్కడ ఏ భేదం లేదు. వాటిని చూసిన అక్బర్ బొమ్మలవాడి పనితనానికి సంతోషించి, అతడిని ఘనంగా సన్మానించాలనుకున్నాడు. కానీ అతడు "మహారాజా! ఒక్క మనవి. ఈ మూడు బొమ్మలు ఒకే విధంగా వుండవచ్చు. వీటి తయారీ అత్యద్భుతంగానూ వుండి వుండవచ్చు. కానీ ఈ మూడు బొమ్మలు మూడు ప్రత్యేకమైన లక్షణాలను కలిగివున్నాయి. ఆ లక్షణాలు మన సమాజంలోని మూడు వర్గాల వ్యక్తుల గుణాలకు ప్రతీకలు. అవేమిటో నాకు చెబితేనేగాని మీ సత్కారాన్ని నేను అంగీకరించలేను. ఇది నా మనవి" అన్నాడు వినయంగా.



అక్బర్ చక్రవర్తి అతడి మాటలకు అంగీకరించాడు. వెంటనే సభలోని వారంతా ఆ బొమ్మలను జాగ్రత్తగా గమనించసాగారు. కానీ ఎవ్వరికీ ఆ మూడిటిలోని తేడాలు అర్థం కాలేదు. అంతా మూడు బొమ్మలు ఒకేలా వున్నాయని ఎక్కడా ఏ బేధం లేదని చెప్పారు.

అప్పుడు అక్బర్ బీర్బల్‌వైపు చూశాడు. బీర్బల్ వెంటనే ఆ మూడు బొమ్మలను పరీక్షగా చూశాడు. పైకి ఆ మూడు ఒకే రకంగా వున్నాయి. అయితే తప్పకుండా వీటి లోపలే ఏదో తేడా వుండాలనుకున్నాడు. బీర్బల్ వెంటనే మూడు బొమ్మల్లో ఒక బొమ్మను తన చేతిలోకి తీసుకొని దానిని అటుఇటు వూపుతూ చెవిదగ్గర నోటిని వుంచి, "వుఫ్" మన్నాడు. అప్పుడు దాని చెవిలోనుండి గాలి బయటకు వచ్చింది. వెంటనే ఏదో అర్థమైనవాడిలా రెండో దానిని కూడా తీసుకుని దాని కుడి చెవిలో గాలి వూదాడు. ఆ గాలి ఎడమ చెవి నుండి బయటకు వచ్చేసింది. రెండవ బొమ్మను తీసుకొని గాలి వూదాడు. ఆ రెండో బొమ్మకు నోటి నుండి గాలి బయటకు వచ్చేసింది. మూడవ బొమ్మను తీసుకొని గాలిని వూదితే ఆగాలి చెవిలోనుండి గాని, నోటిలో నుండి గాని బయటికి రాలేదు.

అందరూ బీర్బల్ చర్యలను ఎంతో ఆసక్తితో చూస్తున్నారు. బీర్బల్ తన పనిని ముగించి, అక్బర్‌వైపు తిరిగి 'మహారాజా! ఈ బొమ్మలు అతడు చెప్పినట్లుగానే మన సమాజంలో నివసించే మూడు రకాల వ్యక్తుల గుణాలకు ప్రతీకలే. అదేలాగంటే మొదటి బొమ్మకు కుడిచెవిలో గాలి వూదితే ఆ గాలి ఎడమచెవి నుండి బయటకు వచ్చింది. అంటే మొదటిరకం వ్యక్తులు తాము విన్న మాటలను ఈ చెవితో విని ఆ చెవితో వదిలేస్తారు. వాటి గురించి పట్టించుకోరు. రెండవదానికి గాలి నోటినుండి బయటకు వచ్చేసింది. అంటే ఇది రెండోగుణం గల వ్యక్తుల స్వభావాన్ని చెబుతుంది. వీరు ఆలకిస్తారు అయితే వినినదానిని వీలయినంతగా తమ అభిప్రాయాలు జోడించి దానిని అందరికి అందించటానికి ప్రయిత్నిస్తారు, కాని ఆచరణకు ఉపక్రమించరు. ఇక మూడవ బొమ్మకు గాలి ఎటువైపునుండి బయటకు రాలేదు. అంటే ఇది మూడవ రకం వ్యక్తుల లక్షణాలకు ప్రతీక. ఈ రకం వ్యక్తులు తమకు తెలిసిన విషయాన్ని ఆలోచించి, దానిలోని మంచిని గ్రహించి, ఆచరణకు ఉపక్రమిస్తారు అని అన్నాడు.

వెంటనే ఆస్థానమంతా చప్పట్లతో మార్మోగిపోయింది. బొమ్మలవాడు ఆనందంతో బీర్బల్‌ను కౌగలించుకొని ఆనందబాష్పాలు రాల్చాడు. అక్బర్‌కు బీర్బల్‌ను ప్రశంసించడానికి మాటలే దొరకలేదు. బొమ్మలవాడు బీర్బల్‌ను ఎంతో ప్రశంసించాడు. అతడి తెలివితేటలకు, సమయస్పూర్తికి, నిశిత పరిశీలనా దృష్టికి జోహార్లన్నాడు. సభికులంతా బీర్బల్ తమ ఆస్థానంలో ఉండడం గర్వంగా భావించారు. ఆ తర్వాత అక్బర్ చేసిన సత్కార్యాన్ని బొమ్మలవాడు మనస్పూర్తిగా గ్రహించి, బీర్బల్‌ను అందరూ పొగుడుతుండగా, అతడు సంతృప్తితో వెళ్ళిపోయాడు.

ఒకరోజు తాను నిద్రలేచేసరికి ఉదయం హారతి సమయం మీరిపోవడంతో దీక్షిత్ తాపీగా కాలకృత్యాలు తీర్చుకొని, బంధువులకు జాబులు వ్రాసి, నెమ్మదిగా మసీదుకువచ్చాడు. ఆలస్యానికి కారణం అడిగిన బాబాతో స్నేహితులకు ఉత్తరాలు వ్రాసి వచ్చాను అన్నాడు. అందుకు బాబా 'పోనీలే, శిరిడీ వచ్చి ఈ రోజు కనీసం చేయి అయినా కదిల్చేవు' అని వ్యంగ్యంగా అన్నారు.

ఒకసారి బాబా లెండి తోట నుండి వస్తూ తనకు ఎదురైన వ్యక్తితో ఇంతవరకు ఎక్కడ ఉన్నావు ఏం చేశావు అని అడిగేరు. "సత్రంలో స్నేహితులతో ముచ్చటించి వస్తున్నాను" అన్నాడు, వెంటనే బాబా రోడ్డు ప్రక్కన గల మలాన్ని ఎంతో ప్రీతితో తింటున్న పందిని చూపి. "ఇంతవరకు సత్రంలో నీవు చేసిన పని అదే, అందుకేనా శిరిడి వచ్చింది" అన్నారు. సత్రంలో ఇతరులగురించి చెడుగా మాట్లాడిన వ్యక్తి ఆ మాటకు అవాక్కయ్యాడు.

ఒకరోజు తన చుట్టూ చేరి ఉన్న భక్తులతో సాయి సాధన గురించి మాట్లాడుతూ "పని చేయి, దేవుని నామం ఉచ్చరించు సద్గ్రంధాలు చదువు, పోటీలు, వంతులు, కీచులాటలు మానితే భగవంతుడు కాపాడుతాడు. ఋణానుబంధాల్ని విశ్వసించి గుర్తుంచుకో. ప్రాణులన్నింటిలోనూ నేనే సంచరిస్తుంటాను.

ఎవరెవరిపైన కోపించినా, దూషించినా నాకు చాలా బాధ కలుగుతుంది ఎవడు ధైర్యంగా నిందను, దూషణను సహిస్తాడో వాడు నాకెంతో ఇష్టుడు. నిన్నెవరైనా బాధించినా, వాడితో పోట్లాడవద్దు సహించలేకపోతే ఒకటి రెండు మాటలలో ఓర్పుగా సమాధానం చెప్పు, లేకుంటే నా నామం స్మరించి అక్కడ నుండి వెళ్ళిపో, పోరాడి, యుద్ధం చేసి దెబ్బకు దెబ్బ తీయవద్దు, నీవెవరితోనైనా పోట్లాడితే నాకు చాలా ఏహ్యం కలుగుతుంది, ఎవ్వరిగురించి తప్పుగా మాట్లాడవద్దు, నీ గురించి ఎవరైనా మాట్లాడినా చలించకు వాడి మాటలు నీకేమి గుచ్చుకోవు కదా. ఇతరులు చేసే పనికి ఫలితం వారే అనుభవిస్తారు, నీవు చేసిన పనుల ఫలితమే నీకు ఉంటుంది. తక్కిన ప్రపంచం తల్లక్రిందులు కానివ్వు, దానిని లక్ష్య పెట్టక బుద్ధిమార్గంలో నీవు వెళ్ళు శాశ్వతమైన ఆనందానికి దారి అదే, అరిషడ్వర్గాలలో అసూయను జయించడం చాలా సులువు. దానివలన మనకేలాభములేదు, అవతలి వారికి ఏ నష్టమూలేదు, అసూయ అంటే ఇతరుల బాగును సహించలేకపోవడమే. ఓర్చుకోలేక అపవాదులు కల్పిస్తాము, వారు నష్టపోతేనో, బాధపడితేనో సంతోషిస్తాము. దానివలన మనకేమి నష్టం. యిది ఎవరూ ఆలోచించరు. శరీరంలో ఒక హీనజాతి వాడున్నాడు, వాడిని వెళ్ళగొట్టాలి అందుకోసం మన చుట్టూ లోపల ఉన్నవారందరినీ తెలుసుకోవాలి, ఎవ్వరితోనూ వాదించవద్దు, పదిమాటలకు ఒకమాటతో సమాధానమివ్వాలి. అందరు ఒకరికొకరువేరు అనే భావనలో ఉన్నారు. కాని అదే పొరపాటు. నేను నీలోను, వారిలోను అంతటా ఉన్నాను. ఇట్టి భావనచేస్తుండు” అని అన్నారు.

ఆధ్యాత్మిక ప్రపంచానికి రాజాధి రాజైన సాయిని ఆరాధించము ద్వారా కోరికలు, కష్టాలు తీర్చుకుంటూ దానికి ప్రతిగా సాయి చరిత్ర పారాయణ చేస్తూ, అనుభవాలను అందరితో పంచుకోవాలని సత్సంగాలు ఏర్పాటు చేసుకొని, ఆ స్ఫూర్తితో యాత్రలు చేస్తూ, పండుగలు, పర్వదినాలు చేస్తూ, సాయి భక్తులుగా ఎంతో ఎదిగేము. పదిమందికి సాయిని అందించగలుగుతున్నాము. సాయి భక్తులము అనిపించుకుంటూ, మెడలో సాయి డాలర్లు, చేతికి సాయి ఉంగరాలు ధరించి తిరుగుతున్న మనలో ఎవరైనా పారాయణ ద్వారా తెలుసుకున్నవి, సత్సంగము ద్వారా విన్న సాయి బోధలను, మొదటి బొమ్మలాగా విని మనకెందుకులే అని వదిలివేస్తున్నామా, లేక విన్నవాటికి మన అభిప్రాయాల్ని జోడించి కేవలం ఇతరులకు చెప్పటానికే సూక్తులు అన్నట్లుగా రెండవ బొమ్మలాగా మిగిలిపోతున్నామా? లేక పారాయణ ద్వారా తెలుసుకుని, సత్సంగాల ద్వారా అనుభవానికి వచ్చిన విషయాన్ని హృదయగతం చేసుకొని ఆచరణకు ఉపక్రమించే మూడవ బొమ్మలాగ మారబోతున్నామా! ఒక్క క్షణం ఆలోచించి గురు చంద్రుడు చూపిన మార్గంలో పయనంచేయటానికి ఉపక్రమిద్దాము.

గురుపూర్ణిమ శుభాకాంక్షలతో...

– పూర్ణచంద్రరావు


ఓం శ్రీ సాయినాథాయనమః

ఆహ్వానము

శ్రీ భరద్వాజ గురవేనమః




# గురుపూర్ణిమ మహోత్సవములు



**వేదిక**

**శ్రీ సద్గురు పాదుకా క్షేత్రం**
**ప్లాట్‌నెం. 13, పవర్‌సిటీ, విశాఖ - 21**

**తేదీలు**

**2022 జూలై 12,13 మరియు 14**
**(మంగళ, బుధ మరియు గురువారములు)**

**గురుపూర్ణిమ మహోత్సవ కార్యక్రమాల సంక్షిప్త వివరములు**

**2022 జూలై 12, 13 మరియు 14 (మంగళ, బుధ మరియు గురువారములు) తేదీలలో జరిగే నిత్య కార్యక్రమములు**

**ప్రతి రోజూ అభిషేకం, భక్తుల గోత్రనామాదులతో పూజ, సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనములతో పాటు, సామూహిక శ్రీ గురుచరిత్ర, సాయిలీలామృతము, సాయిమాస్టర్‌ల పారాయణ, విష్ణుసహస్రనామ పారాయణ, గురుపూజలు మొదలైన అనేక విశేష కార్యక్రమములు నిర్వహించబడును.**

గమనిక : దూరప్రాంతములనుండి విచ్చేసే భక్తులకు మూడురోజులు ఉచిత సామాన్య వసతి, భోజనాదులు ఏర్పాటు చేయుటమైనది.

**నిర్వహణ :**
**శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు (రిజిష్టర్డు)**
**ప్లాట్‌నెం. 13, పవర్‌సిటీ, విశాఖపట్నం-531 021.**
**సెల్ : 9849645224**

# జిజ్ఞాస

**ఆగష్టు 11వ తేదీ శ్రీమాన్ కులపతి ఎక్కిరాల కృష్ణమాచారిగారి జయంతి సందర్భముగా వారందించిన జ్ఞాన గుళికలను మీకు అందిస్తున్నాము. - సంపాదకుడు**

**ప్రశ్న : గురుశిష్యుల సంబంధబాంధవ్యాలను గురించి తెలియజేయగలరు.**



జవాబు : గురు శిష్య సంబంధం చాలా పవిత్రమైనది. దీపము నుండి దీపము వెలిగింపబడునట్లు, గురువునుండి శిష్యుడు ఆత్మజ్యోతి వెలిగించుకొనవలెను. ఇంకను గురువు తన ఉపదేశమును సముద్రము వంటి సమాజమున మేఘము వలె వర్షించును. అందు శ్రద్ధలేని వారియందు వర్షించిన ఉపదేశము, ఉప్పునీటిలో కలిసిపోయిన వర్షబిందువుల వలె నిష్ఫలమగును. శిష్యుడు ముత్యపుచిప్ప వంటివాడు. అనగా విద్యను స్వీకరించుటకు సంసిద్ధుడుగా నుండవలెను. జీవితమును గురువున కర్పించవలెను. తన బుద్ధిని దీపపు ప్రమిదలోని వత్తిగా నిలుపవలెను. తన జన్మమును ప్రమిదను శ్రద్ధయను చమురుతో నింపవలెను. గురువులోనున్న ఆత్మజ్యోతితో వెలిగింపవలెను. ఆ వెలుగుతో స్వతంత్రబుద్ధిని ఉపయోగించవలెను. తన ఇష్టాయిష్టములతో సంబంధము లేకయే, గురువు మాట పాటించవలెను. ఆత్మసమర్పణతో కూడిన వినయ విధేయతలు కలిగి ఉండవలెను. విధేయతలో త్రికరణశుద్ధి ఉండవలెను. శిష్యునిలో సుఖబుద్ధికన్న కర్మాచరణశీలత మిక్కిలిగా ఉండవలెను. గురువు గొప్పదనమును ప్రచారము చేయరాదు, గురువును అనుసరించుట, ఆచరించుటను మించిన ప్రచారములేదు. అక్కరలేనివారికి, సందర్భముకాని చోటులందు తన గురువు యొక్క ప్రవచనములను గూర్చి ఎవ్వరితోను తర్కింపరాదు. అడిగిన వారికి చెప్పక మానరాదు. అడుగని వారికి చెప్పరాదు. ఇతర గురువులను తన గురువుతో పోల్చరాదు. ఇతర సంప్రదాయాల గుణదోష విమర్శనము చేయరాదు. ఇతరులు తన గురువు మార్గము నవలంబింపవలెనని వెంటపడరాదు. తన జీవిత సమస్యలను, బరువు బాధ్యతలను గురువుపై పడవేయరాదు. గురువు కుటుంబమువారు, తన కుటుంబమువారిగా మెలగవలెను. ఆజన్మాంతము తన సామర్థ్యమును అనుసరించి, ఆవశ్యకతను బట్టి గురువు కుటుంబము వారికి, ఇతర శిష్యులకు తోడ్పడుచుండవలెను.

విద్యార్జన సమయమున గురువుతో సమానముగా కూర్చుండరాదు. తనకొరకై దైవము దిగివచ్చిన స్వరూపముగా గురువును తెలిసికొనవలెను. గురువు వలన తాను పొందవలసినది విద్యార్జనము మాత్రమే కాదనియును, సకల బంధ విమోచనమునకు కావలసిన ప్రవర్తనమనియు తెలియవలెను. గురువు మనకన్న వెలుపల నుండు శరీరధారి మాత్రమే కాదనియు, మనలోపల కూడ అంతర్యామియై ఉండుననియు తెలియవలెను.

**ప్రశ్న : దేవుడికి నైవేద్యాలు పెట్టటము, కొబ్బరికాయలు కొట్టటము అవసరమా?**

జవాబు : దేవుడి పేర మానవుడికి అవసరం గనుక దేవుడికి అవసరం అన్నది నిజమే. మానవుడికి దేవుడు కనిపించవలసింది సాటి మానవుడిలోనే. దేవుని దగ్గర టెంకాయ కొట్టటం, టెంకాయ కలవాడికి సమర్పణబుద్ధి అలవడటానికే గాని, దేవుడు పుచ్చుకొనటానికి గాదు. మిగిలిన వస్తువుల మీద కూడా మానవుని దృష్టి ఈ సమర్పణ బుద్ధి వల్ల మారుతుంది. అటుపైన మిగిలిన దానిని తను పుచ్చుకోవచ్చును. గుడిలో టెంకాయ కొట్టి, అందరికీ పంచిపెట్టగా మిగిలిన ముక్కని ప్రసాదము అంటారు. పంచిపెట్టకపోతే దానినే కొబ్బరిచిప్ప అంటారు. కొబ్బరిచిప్పకి, ప్రసాదానికి తేడా ఏమిటి? విద్యుత్తు ప్రవహిస్తూ ఉన్న తీగకి, ప్రవహించని తీగకి తేడా ఎంతో, దీనికీ అంతే. సమర్పణ బుద్ధి అనేది విద్యుత్ ప్రసారము వంటిది. ఇక నైవేద్యాలు, సంతర్పణలు, సమారాధనల వల్ల ఫలితం ఏమిటి అంటారా, పదిమంది అన్నం తినటం. ఎవడికి వాడు అన్నం తినటానికి ఎన్ని వేషాలు వేస్తున్నాడో చూశారా? అలాకాకుండా పూజ్యభావంతో ప్రాణావసరాన్ని ఆరాధించటమే సంతర్పణం. అది ఎవడికి వాడు సొంతంగా మాత్రమే తినటానికి ప్రయత్నిస్తే, ఒకడికి ఒకడు అందనీయడు గనుక, అందరూ మాడి చచ్చిపోతారు. ఒకడికి ఒకడు పెట్టటం అభ్యాసం చేస్తే, అందరూ తింటారు. వండించుకున్నవి, వండుకున్నవి, పాలు, పెరుగు అమ్ముకుని, నోట్లకట్టలు గోడలో దాచుకుంటే ఏమొస్తుంది? ప్రభుత్వంవారి రూపంతో భగవంతుడు తన్ని తీయించవలసి వస్తుంది. అందుకని పదిమందికి అన్నదానం చేయటం భగవంతుడికి తృప్తి. ఇక ఇవన్నీ ఆపత్కాలంలో మొక్కుకోవటం ఎందుకంటారా, మిగిలిన కాలంలో అవసరం రాదు కనుక. జబ్బుగా ఉన్నప్పుడే వైద్యుడు ఫీజు పుచ్చుకొనటం ఎందుకు? జబ్బు తగ్గిన వెనుక రోగి, రోగి కావటం మానేస్తాడు గనుక వైద్యుడికి కనిపించడు. అలాగే, సర్వాంతర్యామి జ్ఞప్తికి వచ్చేది మొదట బాధలో ఉన్నప్పుడే! "ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ, చతుర్విధా భజంతే మాం" అని కదా కృష్ణుడు చెప్పాడు. మొదట బాధలోనున్న వాడికి, ఇతరులతో అవసరం అనే రూపంలో దేవుడు కనిపిస్తాడు. అటుపైన జిజ్ఞాస కలుగుతుంది. అటుపైన ఒకరికొకరు ప్రయోజనాలు తీర్చుకొనటం నేర్చుకుంటారు. చివరికి వైరాగ్యంతో కూడిన జ్ఞానాన్ని పొందుతారు. దీని సోపానక్రమం ఎప్పుడూ ఇలాగే ఉంటుంది. కనుక బాధతోనే దేవుని సర్వాంతర్యామిత్వం అర్థం కావటం ప్రారంభిస్తుంది. ఇక హుండీలో డబ్బులు వేయటం మంచివారికి వైరాగ్యబుద్ధి సాధన అవుతుంది. చెడ్డవారికి పాపం పోతుందేమోననే ఆశతో త్యాగబుద్ధి ప్రారంభం అవుతుంది. హుండీలోని డబ్బుని కూడ ఏదో ఒకరోజున ప్రజాసౌకర్యానికే వినియోగిస్తారు గనుక, ఇందులో చెడిపోయేదేమీలేదు. మధ్యలో దేవుడు కమీషన్ కొట్టేది అంతకన్నా లేదు.



# గురుపూర్ణిమ మహోత్సవము

సాధకులందరూ, భక్తులు, తమ తమ గురువులను పూజించుకునే పర్వదినం గురుపూర్ణిమ. మన సంస్కృతికి మూల పురుషుడయిన వేదవ్యాస భగవానుని, సర్వులు పూజించుకొనే పర్వదినం. వేదాంతసారమైన బ్రహ్మ సూత్రాలను వ్రాయడానికి ఉపక్రమించిన శుభదినం గురుపూర్ణిమ. మన శాస్త్రాలు సూర్యుని ఆత్మ స్వరూపునిగా, చంద్రుని మనః కారకుడుగా వర్ణిస్తాయి. గురు సాంప్రదాయంలో గురువు ఆత్మ స్వరూపుడైవుంటాడు. శిష్యుడు మనః స్వరూపుడు - చంద్రుడు పౌర్ణమి రోజున తాను ప్రకాశము లేనివాడైనా, సూర్యుని ప్రకాశము సంపూర్ణముగా గ్రహించి, షోడశకళలతో విరాజిల్లుతూ జగతికి ఆహ్లాదము కల్గిస్తాడు. అలాగే శిష్యుడు గురు కృపను సంపూర్ణముగా పొంది, తానుతరించటమేకాక, సాటివారికి ఆ ఆనందాన్ని పంచియిస్తాడు. అందుకనే యీ వ్యాస పూర్ణిమను గురుపూర్ణిమ అని పిలుస్తారు. శ్రీ షిరిడీసాయినాథుడు కూడా తననోటిమీదుగా చేసుకోమని చెప్పిన పండుగ ఇదే. అయితే "స్తంభాన్ని పూజించు" అని సెలవిచ్చారు. సద్గురువు నన్ను పూజించు అనడు - భక్తులు, శిష్యులు తమ అనుభవాలను బట్టి శ్రద్ధాభక్తులతో సేవించాలి, పూజించాలి. పైగా "నేను భగవంతుని బానిసను ఆయనే యజమాని" అన్నారు బాబా. నాకు గతం గుర్తుకు వస్తుంది, 30-10-88 ఆచార్య జయంతికి ఒంగోలు ఫ్యాన్సీగూడ్సు మర్చంటు అసోషియేషన్‌లో ఆచార్యులవారి ఉపన్యాసంలో వారు చెప్పిన మాటలు మనస్సులో మెదలుతున్నాయి. "నేను గురువుని అని ఎప్పుడూ చెప్పలేదు. గురువంటే, సాయిలాగా, రమణునిలాగా వుంటారు. అయితే పూర్వపుణ్యంవలన సాయి అనుగ్రహానికి పాత్రుడిని కాగలిగాను. నేను పొందినది అందరూ పొందాలనే నా ఆకాంక్ష. నేను 12 సంవత్సరములు శ్రమించి సాయి తత్వాన్ని జనులకు అందించడానికి ప్రయత్నించాను - అందర్నీ కాచేవాడు శ్రీసాయిబాబాయే. అయితే మీకు సాయిని పరిచయం చేసిన వ్యక్తిగా నామీద అభిమానముంచుకొంటేచాలు!" ఇది వారి సందేశము. శ్రీ ఆచార్యులవారు ఎంత నిగర్వో, ఎంత వినయశీలో, ఎంతటి ప్రేమమూర్తో మనకర్థమవుతుంది. వారు ఎంత కాదన్నా సాయి అనుగ్రహం పొందటము అనే కళ్యాణానికి, సాయికి మనకు మధ్య నిలిచిన పురోహితుడే శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మహరాజ్.

అయితే ఆయనను అనుసరించినవారికి వారేమైనా సూచన చేశారా అని తలిస్తే, వారి మహా సమాధికి ముందు వారి కలము నుండి జాలువారిన వెలలేని రత్నాలు, సాయి సన్నిధి, సాయిలీలామృతము. గురుబోధయొక్క సారం గ్రహించి దాని ప్రకారం మన యోచనను, పనులను సంస్కరించుకున్నప్పుడే మనం నిజంగా గురువును ఆశ్రయించినట్లు లేకుంటే అది మిథ్యాభక్తే. (లీలామృతం 134 పేజీ)

సాయి సన్నిధిలో "ముందుగా ఒక్కమాట"లో ఆచార్యులవారు యిచ్చిద సలహాను యధా తథంగా ఉటంకిస్తున్నాను. "నిత్యము సాయిసన్నిధి మనందరికి సిద్ధించుగాక. అంతటి మహానీయమూర్తి సన్నిధి చవిచూచాక, మనంగూడా గురువులమవుదామన్న గుబులు మనకు కలగకుండుగాక! ఏమారిన భక్తులకు వారి సన్నిధిలో కూడా ఎలాంటి వికారాలు తలెత్తి కొందరిని భ్రష్టులను చేసేయో గమనించి, మనం వాటికి దూరంగా వుందుముగాక! ఈ భూమండలమంతా సాయి సన్నిధిగా మారి భూలోక వైకుంఠమవు గాక!".

బాబా సూక్తులలో, " మనం ఒకరిని ఆశ్రయించాలి, లేక యితరులకు మార్గం చూపాలి. బాబా చెప్పిన సూక్తులు (ఆచరించగలగాలంటే) మనం ఒకరిని ఆశ్రయించాలి, లేక పైవన్నీ మనకి చేతనైతే యితరులకు మార్గం చూపాలి". సాయిబాబా పత్రిక నిర్వహణ విషయంలో కూడా నిర్దుష్టంగా పత్రిక ఎలా వుండాలో వారి సమాధానాలలోనే సూచించారు. సాయిబాబా జీవితము, కళలు, బోధలు గురించి కేవలం వేదాంత పరమైన రచనలుగాక, ఆచరణయోగ్యమైన రచనలు, వివరణలు, చమత్కారాలు, ప్రశ్నలు చెప్పడం, ఉపదేశాలు చేయడంలాంటివి చేయాలి అవధూతల వ్యాసాలు, సైన్సు ఆధ్యాత్మికత కలిపిన వివరణ వ్యాసాలు, చక్కని నీతి కథలు, మానవత్వంతో నిండిన కథలు అని సూచించారు.

పై విషయాలను, నేను మా గురువును అని మాష్టారుగారు అనకపోయినా, మనం వారిని ప్రేమగా ''మాస్టర్'' అని పిలుచుకుంటాము గనుక, గురుబోధసారం, గ్రహించి మన యోచనను సంస్కరించుకోవాలని వారే చెప్పారు గనుక ఆచార్యులవారు గురుపూర్ణిమకు మనందరికి ఇస్తున్న సందేశంగా పై విషయాలను శ్రద్ధగా మననం చేసి, ఈ భూమండలమంతా సాయి సన్నిధిగా మార్పుచెందడానికి మనవంతు కృషి నిర్వర్తించి బాబా, మాష్టారుగారి కృపాశీస్సులు పొందడానికి ప్రయత్నిద్దాం.

(జూలై 13వ తేదీ గురుపూర్ణిమ సందర్భముగా ప్రత్యేక వ్యాసం)

రచన : **"నామధారకుడు"**

"క్షణ క్షణమూ ఆత్మవికాసానికై కృషిచేయటము ఒక్కటే మానవ జీవిత లక్ష్యం కావాలి". **- శ్రీ భరద్వాజ**

# ఓం శ్రీ గం గణేశాయనమః

"శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే"

విఘ్నేశ్వరపూజ చేయకుండా పాల సముద్ర మధనం జరగటం వలన, దానికి విఘ్నం కలిగింది. అప్పుడు శ్రీవిష్ణుమూర్తి స్వయముగా, దేవతలకు, విఘ్నేశ్వరుని మహిమ తెలిపి, వారిచేత పూజ చేయించిన తరువాతనే దేవతలకు అమృతము దొరికినది. అందులకే గణపతి దేవతలకు కూడా ఆరాధ్య దేవుడు.

"త్వం మూలాధారే స్థితోసి" అని గణపతి అధర్వశీర్షము చెప్పుచున్నది. మంత్ర శాస్త్రములో గణపతులు ముప్పది రెండు రూపములతో చెప్పబడినది. అంతేకాక దేశకాల భేదముతో సకల శుభములు కలుగజేయుటకు అష్టైశ్వర్యములతో తులతూగుటకు, ఈతి, దుః ఖబాధలు కలుగ కుండుటకు, విద్య, శక్తి, ధైర్యము మొదలైన సమస్త సుఖములు సంప్రాప్తించుటకు విఘ్నేశ్వరుని వివిధ రూపములలో సేవించుచున్నాము. గణపతి ఆత్మ స్వరూపుడు. సృష్టి కల్పమున 16, ప్రళయ కల్పమున 16 కలిసి 32 కళలు. అందుచేత గణపతి చంధోగణపతియై 32 కళలతో అలరారుచుండును.



గణపతి "హస్తముఖుడు" అని చెప్పబడినస్వామి. గణపతి మూర్తి హస్త నక్షత్రా ముఖమున కనిపించును. హస్తానక్షత్రం చేతి వేళ్ళ వలెను "హస్తా" కారం ఆకారం కల నక్షత్రము. హస్తి అనగా ఏనుగని అర్థం. భాద్రపద మాసమున శుద్ధ చతుర్థినాడు చంద్రోదయం సమయమున ఆకాశమున "హస్తా నక్షత్ర" ముఖమున దర్శన మిచ్చును. అదే సమయమును "వినాయక చవితి"గా ఋషులు నిర్ణయించిరి. ఈ హస్తా నక్షత్రము కన్యారాశి యందుకలదు. కన్య అనగా వివాహము కానిది. అందులకే గణపతి నిత్య బ్రహ్మచారిగా చెప్పబడి వున్నాడు.

కన్యా రాశికి 'బుధుడు' అధిపతి. బుధుని రంగు పచ్చ. అందుచేత గణపతిని ఆకు పచ్చని పత్రితో పూజిస్తారు. బుధునికి అధిష్టాన దేవత విష్ణుమూర్తి. అందువలనే గణపతిని విష్ణు స్వరూపుడని స్తుతించారు. "శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం"

వినాయక చవితి సమయమునకు భూమి అంతా ఆకు పచ్చగా వుంటుంది. మారేడు, వెలగపండ్లు, సీతాఫలములు, జామపండ్లు మొదలైనవి లభించును.

కన్యారాశి రంగు పచ్చ. "దూర్వాశ్యామః" అని వరహ మిహిరుడు బుధుని వర్ణించెను. అంతేకాక గణపతికి ప్రియమైనది, 'దూర్వాంకురము'

ఆకాశంలో "మఖా నక్షత్రము" నకు ఉత్తరముగా సప్తః మండలంలోని మొదట రెండు నక్షత్రాలకు ముందుగా వినాయక మండలం వుంది. ఈ నక్షత్రాలు కూడా భాద్రపద శుద్ధ చవితి నాడు ఉదయిస్తాయి. ఈ నక్షత్రాల ఆకృతిని కలిపితే వినాయకుని రూపం వస్తుంది. ఈ నక్షత్రాలు ఉదయించినప్పుడే వినాయక పూజ చేయాలని "ధర్మసింధు"లో నిర్దేశమయినది. ఈ నక్షత్రాలలోనే మూషిక ఆకృతి గల నక్షత్రాలు కూడా కలవు.

మధ్యలో "ఆశ్లేష" నక్షత్ర మండలం వున్నది. ఆశ్లేష సర్వదైవత్వం కారణం వల్ల వినాయకుడు సర్వయజ్ఞోపవీతమును ధరించును. ఋషి పంచమినాడు కూడా ఈ రెండు నక్షత్రాలు తూర్పున ఉదయించును.

భాద్రపద శుద్ధ చవితినాడు, గణేశ పూజ చేయాలని పెద్దలు, శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు.

బుధ, కుజుల దోష సంయోగ ఫలము వలనే జాతకములో గణపతి దోషంగా చెప్పబడినది. అది నివారించుటకు గణపతిని పూజించవలెను.

విఘ్నేశ్వరుడు మూలాధార నివాసుడు. మూలాధారము శక్తినివాసము. అనగా 'కుండలినీ శక్తి' మూడున్నర చుట్టలు చుట్టుకొని సర్పరూపమున ఉన్నది. యోగకేంద్రము కనుక విఘ్నేశ్వరుడు జగన్మాతయైన శక్తికి కావలి యున్నవాడని పురాణములలో రహస్య సంకేతము. అతడు ఈ కుండలినీ శక్తిని సర్పరూపిణియైన దానిని ధరించి యుండుటచేత, 'నాగయజ్ఞోపవీతము' గలవాడని వ్యాసులవారు అతిగమ్యమైన దేవరహస్యమును తెలిపెను.

పూర్వం ఆశ్రమాలలో విద్యాభ్యాసము వినాయక చవితి మరుచటి దినమున ప్రారంభించేవారు. ఆ రోజున సప్తఋషులు ఆకాశంలో ఉదయిస్తారు. కనుకనే గణపతి "విద్యలకెల్ల నొజ్జయై" విద్యాపతిగా కొలువబడుచున్నాడు.

ఈనాడు కూడా కొందరు చిన్నారులు వినాయక చవితి నాడు పుస్తకములు వినాయక మూర్తి పక్కన పెట్టి పూజ చేసి, తమకు సర్వ విద్యలు ప్రసాదించేలా పూజిస్తారు. ఎందుకంటే అతడు విద్యాప్రదాత, జ్ఞానప్రదాత.

శ్రీ విఘ్నేశ్వరుడు తమ భక్తులను త్వరగా అనుగ్రహించి సుఖసంతోషముల నొసంగును.

శ్రీ విఘ్నేశ్వరుడు మోదక ప్రియుడు. అతని చిత్రము లన్నింటిలోను చేతిలో ఒక గోళం వంటిది ఉంటుంది. ఈ బ్రహ్మాండగోళము ఆయన ఆధీనమనుటకు సంకేతము. కాని కొందరు దానిని ఉండ్రాళ్ళు అని అంటారు.

శ్రీ విఘ్నేశ్వరునకు మోదకములు నైవేద్యముగా అర్పిస్తే కార్య సఫలత కలిగి సంకటములు తొలగునని పురాణములు వక్కాణించుచున్నవి.

విఘ్నేశ్వరునికి పెద్ద చెవులు, గొడ్డలి, చిన్న నోరు, అభయహస్తం, పెద్ద ఉదరం, పెద్దతల, చిన్న కళ్ళు, సర్పముతో కూడిన యజ్ఞోపవీతము కలవు.

ఓంకార స్వరూపుడగు శ్రీ విఘ్నేశ్వరుని ఆకారము బహు విచిత్రముగా నుండును. అతనిని ప్రణవ స్వరూపునిగా వర్ణించారు.

ఓం అను అక్షరము ॐ అని సంస్కృతమున వ్రాయబడును. ॐ లోని కింద భాగము లంబోదరము అన్నారు. లంబోదరము అంటే బొజ్జ, పొట్ట. శక్తికి కారణములైన బీజాక్షరములలో సమస్త దేవతలలోనూ సమస్త ప్రపంచము విఘ్నేశ్వరుని ఉదరమున యిమిడి పోయివుండును. అతడు ఎవరి ఉదరమున నిమడలేడు. అందుచేతనే లంబోదరుడు అందురు. వినాయకుని చెవులు చేట వలె పెద్దవిగా ఉండును. అతడు శ్రవణమునందు ఆశక్తి కలవాడు. ఆ శ్రవణ మందు మంచిని గ్రహించి, అందరికి పంచిపెట్టుచు, పాపపు మాటలను తన చేటలవలెనున్న చెవులతో దూరముగా పాఱవేయును. గణేశుని తల విఘ్నాలను తొలగించేది. చిన్న కండ్లు, సూక్ష్మ దృష్టిని సూచిస్తాయి. ఏనుగు లాంటి తొండము స్వాభిమానాన్ని తెలుపుతుంది. పెద్ద చెవులు ప్రతీచిన్న విషయాన్ని సమానంగా వినాలి. దంతాలు ఎవరికి ఏ విధమైనహాని చేయరాదు. నాలుకతో ఆ పరిశీలనకు, పెద్ద ఉదరము జ్ఞానాన్ని జీర్ణించుకుందుకు చిహ్నాలు. నాలుగు చేతులు, ధర్మ, అర్థ, కామ, మోక్షము సాధించుటకు మార్గాలు.

శ్రీ విఘ్నేశ్వరుని వాహనము ఎలుక. ఎలుక చాలా చిన్నది. అంటే సూక్ష్మజీవులను కూడ నిర్లక్ష్యము చేయకూడదనే భావన. అతడు స్థూలకాయుడు. అతని వాహనము సూక్ష్మదేహము కలది. ఇది మనస్సునకు ప్రతీకము. ఎలుకను వాహనముగా చేసుకొనుట అనగా మనస్సు నియంత్రణ మొనర్చుటమని అర్థము. మనస్సును నియంత్రించిన వాడే గొప్ప మేధావంతుడు. అతడు స్థూలకాయుడై తన వాహనమునకు శ్రమలేకుండా అతను లఘిమా సిద్ధితో బెండువలె తేలికగా నుండును. శ్రీ విష్ణుమూర్తి కైలాసమునకు వెళ్ళగా అతని చేతిలో నున్న సుదర్శన చక్రమును విఘ్నేశ్వరుడు చటుక్కున తీసుకొని తననోటిలో పెట్టుకొనెను. వెంటనే విష్ణుమూర్తి ఏమి చేయవలెనని ఆలోచించి, తన రెండు చేతులతో చెవులు పట్టుకొని గుంజీలు తీసెను.

ఆ వింతచర్యకు బాలుడగు విఘ్నేశ్వరుడు పక పకా నవ్వగా సుదర్శన చక్రము నోటి నుండి జారినది. మరుక్షణమే విష్ణుమూర్తి తన సుదర్శన చక్రమును తీసుకొనెను. శ్రీ విష్ణుమూర్తియే వినాయకుణ్ణి ప్రీతి చేసుకొనుటకు గుంజీలు తీసెను. అందుచేత ఆ దినము నుండి వినాయకునకు గుంజీలు తీయటం ఆచారమైనది.

విఘ్నేశ్వరునికి కొబ్బరి నూనెతో దీపము వెలిగించిన శుభప్రదము. సకల సంపదలు కలుగును. ఆయురారోగ్యములు కలుగజేయును. అతనికి అరటిపళ్ళు, చెఱకు గడలు, కొబ్బరి కాయలు, వెలగపళ్ళు, మాధీఫలములు, సీతాఫలములు, కుడుములు, ఉండ్రాళ్ళు, లడ్లు, అప్పములు, గారెలు చాలా ప్రియమైనవి.

గణేశ్వరుడు సఫలత్వ శక్తికి అధిష్టాన దేవత. కావుననే ప్రతి శుభకార్యం విఘ్నేశ్వరుని పూజతో ప్రారంభం చేయవలెను. అందువలన కార్యములన్నీ జయప్రదములయి, సర్వసౌభాగ్యములు కలుగును.

మహా గణపతికి ప్రియమైనది చతురావృత్తి తర్పణం. దీనిని అనుష్టానం చేయుట వలన ఆయుష్షు, ఆరోగ్యం, ఐశ్వర్యం, బలం, పుష్టి, బుద్ధి, యశస్సు, కవిత్వం, భుక్తి, ముక్తి సమకూరును.

విఘ్నేశ్వరుడి ఆకారము గజముఖము కలిగి లంబోదరము, తొండము చిన్న మారుతి వలె నుండును. కాని అతడు యోగులకు పరబ్రహ్మ, నర్తకులకు నాట్యాచారుడు, భాగవతులకు గానమూర్తి, విద్యార్థులకు విద్యాగణపతి, సామాన్యభక్తులకు సంకట హారకుడు, సర్వ సిద్ధి ప్రదాత. (ఆగష్టు 31వ తేదీ వినాయక చవితి సందర్భముగా ప్రత్యేక వ్యాసం)

**సేకరణ : విరించి**



## గురుభక్తి

సాయి సశరీరులుగా వున్నప్పుడు మాత్రమేగాక అటు తర్వాతకూడ కాకాసాహెబ్ దీక్షిత్ సాయి సంస్థానమే తన ఇల్లుగా, తన బాధ్యతగా సాయి యొక్క ప్రతి రూపంగా తలచి సేవించాడు. ఇదెంతో అరుదైన సంస్కారం. సామాన్యంగా మహాత్ములు సిద్ధిపొందగానే అంతవరకూ వారిని సేవించిన వారుకూడా ఎవరి దారి వారు చూసుకొనడం లోకంలో చూస్తాము "మన గురువు మన చెంతనే వుండలేదా? అని చెప్పి ఆ మాటల మాటున మన బాధ్యత నుండి తప్పుకుంటారు. మన కుటుంబ విషయంలో అయితే అలా చేస్తామా? సాయి తమ గురువు సశరీరులుగా గాక వారు సమాధి చెందినా కూడ ఆగురుస్థానాన్ని, వారు ప్రసాదించిన యిటుకను, తమకు వారనుగ్రహించిన ఆ ప్రదేశాన్ని, వారి ప్రతిరూపమైన అగ్నిహోత్రాన్ని ఎంత శ్రద్ధగా కనిపెట్టుకొని వున్నారో, ఆ సన్నిధిలోనే, ఆసేవలోనే తాము కూడ శరీరం త్యజించాలన్న దీక్షతో ఎన్ని దశాబ్దాలున్నారో! ఇంతటి గురుభక్తి యొక్కలేశం కాకాదీక్షిత్ వంటి ఏ కొద్దిమందికోగాని లభించలేదు.

– పూజ్య ఆచార్య శ్రీఎక్కిరాలభరద్వాజ




"సంస్కారాల మార్పుకోసం చేసే తీవ్రమయిన ప్రయత్నమే సాధన" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. జన్మత:వచ్చిన సంస్కారాలలోని ఉత్తమమయిన వాటిని పెంపొందించుకుంటూ, తనతోపాటు ఇతరుల ఉన్నతికి అవరోధమయ్యే సంస్కారాలను మార్పు చేసుకొనటానికి జరిగే ప్రయత్నమే అసలైన సాధన. అంతేకాని తాను అనుకున్నది పొందటానికి చేసే ప్రతి ప్రయత్నం మాత్రం కాదు సాధన అంటే. లౌకికమైన శ్రేయస్సు కొరకు మాత్రమే ప్రయత్నం చేసేవారు అసలైన సాధకులు కాదు. ఎన్నో జన్మల తరువాత లభించిన మానవ జన్మను కేవలం సుఖ సంతోషాల కొరకు వెచ్చిస్తూ, జీవించటము మానవ జన్మ లక్ష్యం కాకూడదు. "సద్గురువును తెలుసుకోవాలి లేకుంటే మానవ జన్మకు ఎందుకు వచ్చినట్లు, పిడకలు ఏరుకోవటానికా" (జన్మ సార్ధకత కోసం చేయని ప్రయత్నం, అంతిమ యాత్రకు సన్నాహాలు చేసుకోవటమే అవుతుంది) అన్నారు జగద్గురువైన శ్రీ శిరిడీసాయినాధుడు. జన్మించిన దగ్గరనుండి మరణించేవరకు అనేక రూపాలలో గురుబోధ జరుగుతూనే ఉంటుంది. అప్రయత్నముగా మనము దానిని అనుసరిస్తూనే ఉంటాము. ప్రాకటం, నడవటం, పరుగెత్తటం, మాటలు నేర్చుకోవటం దగ్గర నుండి, జీవితంలో ఎదగాలని చేసే ప్రతి ప్రయత్నంలో, అనేక రూపాలలో ఎదురయ్యి మార్గదర్శిగా నిలిచేది గురుతుత్వమే. అది గుర్తెరిగి తగురీతిన జీవిస్తూ, జన్మ సాఫల్యం కొరకు ఆధ్యాత్మిక గురువు చెంతకు చేరటమే నిజమైన సాధన. అంతవరకు ఆర్తులు, అర్ధార్ధులుగా మసలిన జిజ్ఞాసువు సాధకుడై జ్ఞానిగా మారుతాడు. "జ్ఞానికి తనకు బేధం లేదని" గీతాచార్యుడి మాట. అర్జునుడికి మాత్రమే శ్రీకృష్ణుడు గురువై జ్ఞానబోధ చేశాడు. నేటి కలియుగంలో త్రిమూర్త్యాత్మకుడై శ్రీ దత్తాత్రేయుడు, శ్రీ శిరిడీసాయిబాబా రూపంలో మనమధ్య అవతరించి, కులమత, జాతి స్త్రీ, పురుష వయోబేధం లేకుండా సర్వులను ఉద్ధరించటమే తన అవతార లక్ష్యంగా, తాను నివశించిన మశీదుకు ధర్మ, అర్ధ, కామ, మోక్షాలనే నాలుగు పురుషార్ధాలను ప్రసాదించేదే "ద్వారకామాయి" అని పేరుపెట్టి, అనేక మిషలమీద కార్యకారణ సంబంధముగా ప్రతి జీవిని తనచెంతకు లాగి ఉద్ధరిస్తున్నారు జగద్గురువు అయిన శ్రీ శిరిడీసాయిబాబా. ఫకీరు అయిన శ్రీ శిరిడీసాయి బోధలను ఆచరించటము ద్వారా, శ్రీసాయి ప్రసాదించే స్థితిని గృహస్తాశ్రమము ద్వారా పొందవచ్చునని, ప్రత్యక్ష నిరూపణచేసి, మహాత్ముల ముద్దుబిడ్డగా ప్రశంసించబడి, "నీవు ఎక్కడ నమస్కరిస్తే అక్కడ శ్రీసాయి పాదాలు ఉంటాయి" అని మహాత్ములచే కొనియాడబడి, లక్షలాది మందికి మార్గదర్శియై "సాయిమాస్టర్"గా వినుతికెక్కిన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు మార్గదర్శిగా మనకు లభించటమే, సాధన సౌధ సోపానం చెంతకు మనము చేరినట్లు. అయితే అంతటితో సరిపోలేదు. ఒక ఉన్నతమైన విశ్వవిద్యాలయంలో, ప్రవేశ అర్హత సంపాదించిన విద్యార్థి, తగిన గురువు చెంతకు చేరిన తరువాత, వారి బోధను అర్థంచేసుకొని, ఆచరించిన నాడే తన లక్ష్యంకు చేరువయినట్లు, శ్రీ శిరిడీసాయి

విశ్వవిద్యాలయంలో చేరి, శ్రీ భరద్వాజగారు అనే సద్గురువు చెంతచేరిన మనము, ఆచరణ ద్వారా వారందించిన మార్గాన్ని అనుసరించిన నాడే శ్రీసాయిని ఆరాధిస్తున్న దానికి సార్థకత చేకూరుతుంది.

సద్గురువును గుర్తెరిగి, తగురీతిన జీవిత గమనాన్ని నిర్దేశించుకొని జీవించటంతో అసలు సాధన ప్రారంభమవుతుంది. తన దరి చేరిన వారందరికి సద్గురువు ఒకేరకమయిన సాధన బోధించకపోవచ్చు. వారి సంస్కారాలను అనుసరించి సద్గురువు బోధచేసి మార్గనిర్దేశకత్వం చేస్తారు. జ్ఞాన సముపార్జనకై తన చెంతచేరిన అరుణి, బైదుడు, ఉపమన్యువులకు ధౌమ్యమహర్షి ఒకేరకమైన సాధన విధించక, వారి సంస్కారాల ననుసరించి, తగు రీతిన పరీక్షించి, సంస్కరించి, అనుగ్రహించటము శ్రీగురుచరిత్రలో చూడవచ్చు. విశ్వవ్యాపకుడైన, శ్రీసాయి, వారివారి సంస్కారాలననుసరించి సాధనా మార్గము అనుగ్రహించిన విషయాలు శ్రీసాయిచరిత్రలో కలవు. "బోధించే దేముంది చూసి నేర్చుకో" అని తెలిపిన శ్రీసాయి జీవితాచరణను గమనించగలిగిన వారికి అదే ఒక అద్భుతమైన బోధ, సాధన మార్గము. దానిని అనుసరించి మనలోని సంస్కారాల మార్పుకోసం చేసే ప్రయత్నం మనము నిత్యము కొనసాగించాలి. అప్పుడు అవసరమైతే మన సంస్కారాలను అనుసరించి శ్రీసాయి స్వయంగా బోధ చేస్తారు.

సాధన అనగానే తంత్రమో, మంత్రమో, ఉపదేశం పొందటమని భావించే వారికి, "మాసాంప్రదాయమే వేరు నేను చెవిలో ఉపదేశించను" అన్నారు శ్రీసాయి. సామాన్యులు సహితం అసమాన్యులుగా మారటానికి శ్రీసాయి "చెట్టును చూసి నేర్చుకో" అని బోధించారు. చెట్టు ఎదగటానికి ప్రయత్నం చేస్తున్న ప్రతిసారి లోకానికి హితం చేకూరుస్తూనే ఉంటుంది. మండుటెండలో తాను మలమల మాడిపోకుండా, పుడమితల్లి అట్టడుగు పొరల నుంచి, జలాన్ని పొదివి పట్టుకొని, తన చిట్ట చివరి కొమ్మ ఆకు చివరి అంచువరకు ప్రసరింపచేయటం ద్వారా, తన చెంత చేరిన వారికి, చల్లదనాన్ని ప్రసాదిస్తూ తాను జీవిస్తుంది. చెట్టు.

ప్రకృతితోపాటు మానవులను సృష్టిచేసిన, భగవంతుడు తన వలెనే భౌతికరూపం ఇచ్చాడు, తన వలెనే జీవించమని చెప్పేడు. అయితే తన ఉనికినే మరచిన మనిషి, తన సాటివారికి, ప్రకృతికి హితం చేకూర్చగలుగుతున్నాడా! స్వార్థంలో జీవించే మనిషి, తాను భగవంతుడు కావాలనుకోవటం ఎంతటి హాస్యాస్పదం. రాజస, తమోగుణాలతో చేసిన సాధన ఒకవేళ పూర్వజన్మ సుకృతం వలన ఫలించినప్పటికి, అది రాక్షసులు చేసిన తపస్సుతో పోలి, తన వినాశనానికి దారితీస్తుంది. ఎన్నో జన్మల తరువాత లభించిన మానవజన్మ సార్థకతకై గురువును ఆశ్రయించి, సేవించి, వారు సంప్రీతులయ్యే విధముగా జీవించటమే అసలైన సాధన. అప్పుడే వారి అర్హత నెరిగి ఉపదేశం చేస్తారు గురువు.

"జీవితమనే మహామంత్రానికి మూలమైన మానవత్వమనే శక్తి, ప్రకృతి అనే బీజము, నిరహంకారమనే కీలకము కోల్పోయి, మానవులనిపించుకునే అధికార ముద్రనే కోల్పోయిన వారిని, శక్తి, బీజము, కీలకము, ముద్రలతో కూడిన ఏ మంత్రము మాత్రము తరింపచేస్తుంది" అంటారు ఆచార్యులు శ్రీ భరద్వాజ శ్రీ పాకలపాటి గురువుగారి చరిత్రలో. గత జన్మ సంస్కారము వలన ఉపదేశము పొందినా, అహంకార పూరితమైన వ్యక్తి, తాను పొందిన శక్తిని, తనకు, సాటివారికి హాని కలిగించేలా ఉపయోగించటమే జరుగుతుంది. (భస్మాసుర, హిరణ్యకశ్యప, హిరణ్యాక్షులు మొదలైన వారిలా) కనుక ముందు మానవత్వమనే బీజం మన హృదయ క్షేత్రంలో పొదివిన నాడు, దాని ఆలన-పాలన పోషణ చేసి ఫలవంతం చేస్తాడు సద్గురువు. అందుకు హృదయమనే క్షేత్రంలో రాగ, ద్వేష, అసూయ, స్వార్థమనే రాళ్ళు రప్పలను ఏరివేయాలి. అందుకు ఆలంబనగా శ్రీసాయి-మాస్టర్ లు తాము ఆచరించి చూపిన మార్గమే శరణ్యం. అయితే వారు తమ ఆచరణ ద్వారా చూపిన మార్గమేది?

శ్రీసాయి నుండి మంత్రోపదేశం పొందాలని వచ్చిన రాధాభాయి దేశముఖ్ అనే ఆమెతో శ్రీసాయి తనపరం చేసుకొని చెప్పిన గురుసేవా వృత్తాంతమే మనకు ఉపదేశము. "ఒకప్పుడు మిత్రులైన మేము నలుగురం కలసి పవిత్ర గ్రంథాలను చదివి చర్చించుకొంటుండగా మొదటి వాడు ''ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి గాని, ఇతరులపై ఆధారపడి ఉండకూడదు" అన్నాడు. అందుకు రెండవవాడు "సర్వసాక్షి అయిన ఆత్మయే సత్యం, కనుక దానిని గుర్తిస్తూ మనస్సును నిగ్రహించటమే నిజమైన సాధన" అనగా, దానికి బదులిస్తూ "మన దృష్టికి గోచరించే ఈ సృష్టి అంతా అనిత్యమైనది, నిరాకారమై దానిని సత్యమైన దానిని గుర్తిస్తూ వివేకంతో జీవించటము నిజమైన సాధన, అదే ముక్తికి దారితీస్తుంది" అన్నాడు మూడవవాడు. అదంతా ఆలకించిన నేను ''గ్రంథపఠనం ఆవశ్యకమే, అయితే కేవలం అందులోని విషయాలను తెలుసుకోవటం మాత్రమే చేయకుండా, స్వధర్మంతో పాటు గ్రంథ బోధనలను అనుసరిస్తూ సర్వవ్యాపియైన భగవంతుడే గురురూపంలో అవతరించాడని గుర్తించి, అపారమైన విశ్వాసముతో త్రికరణ శుద్ధిగా గురువును సేవిస్తూ, వారి కొరకే జీవించిననాడు మన అన్వేషణ, సాధన సఫలీకృతమయ్యి, సంపూర్ణమైన గురుకృపకు పాత్రులవ్వటం జరుగుతుంది" అని నా అభిప్రాయం చెబుతుండగా, మేము ఒక అడివిలోకి ప్రవేశించాము" అంటారు శ్రీసాయి. సాటివారి భావాలను గౌరవిస్తూ తన అభిప్రాయాలను సరిచేసుకుంటూ, సరిచూసుకుంటూ సాగటము సాధకుని లక్షణము.

"మేము అడవిలోకి ప్రవేశించగానే దారిలో ఒక కట్టెలు కొట్టుకునే కూలివాడు కనిపించి, మా ప్రయాణం గురించి అడిగేడు. మేము బదులివ్వలేదు. "మీరెందుకు అడవిలోకి వెళుతున్నారో నాతో

చెప్పనవసరం లేదు, అయితే దారి తెలిసిన వారితో కలసి ప్రయాణం చేయటము శ్రేయస్కరము, లేకుంటే దారితప్పి క్రూరమృగాల పాలిట పడే అవకాశముంది, మీరు కొంచెం సేపు ఇక్కడ విశ్రమించి నేను ఇచ్చే ఆహారము, నీరు తీసుకుని, మీ ప్రయాణం కొనసాగించవచ్చు" అన్నాడు. అన్వేషకులమైన మాకు, కట్టెలు కొట్టుకుని జీవించే ఒక సామాన్యమైన వ్యక్తి ఇచ్చే ఆహారము, సలహా రుచించలేదు. నిరాకరించి, మిత్రులతో కలసి నేనూ అడవిలోకి ప్రయాణం కొనసాగించేము. ముందుకు సాగిన మేము, దారితప్పి పూర్వ పుణ్యం వలన తిరిగి, తిరిగి చివరకు బయలుదేరిన చోటుకే వచ్చేము, అక్కడ తన పనిలో ఉన్న ఆ కట్టెలు కొట్టుకునే ఆబంజారా మమ్ములను చూసి, "నేను చెబితే వినలేదు, తిరిగి తిరిగి అలసిపోయి మరల ఇక్కడికే వచ్చారు, జీవిత పయణంలో ఏ విషయంలోనైన, అందులో అనుభవం కలవారి సహాయ సహకారాలు తీసుకోవటంలో తప్పులేదు. భగవంతుడి కృపలేకుండా అటువంటి వారు తటస్థించరు. అటువంటి వారు ఎదురై, తోడుంటాను, ఆహారమిస్తాను, నీళ్ళు ఇస్తాను స్వీకరించమని ఆహ్వానించిననాడు అది శుభసూచకంగా భావించి, స్వీకరించాలే కాని తిరస్కరించ కూడదు, అన్వేషకుడు ఓరిమి, శాంతి కలిగి ఉండాలి. ఖాళీ కడుపుతో అన్వేషణ కొనసాగించలేరు. సాగించినా గమ్యం చేరలేరు. కనుక ఇప్పుడైనా నా మాటను మన్నించి నేనిచ్చే ఈ ఆహారం, నీరు స్వీకరించమని" అపారమైన ప్రేమతో అనునయంగా పలికిన ఆ వ్యక్తివైపు చూస్తూ ఉండిపోయాను" అంటారు శ్రీసాయి తన గురుసేవావృత్తాంతములో.

"సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి శిరిడీలోనే ఉన్నాడు అని అనుకునేవాడు నన్నసలు చూడనట్లే. నీవు చూసేదంతా కలసి నేను" అని ప్రత్యక్ష నిరూపణ చేసిన శ్రీసాయి తనపరంగా చేసుకొని మనకు చెప్పిన సాధనా మార్గము అది. "అన్ని దిక్కుల నుంచి మాకు ఉత్తమ భావాలే వచ్చుగాక'' అని అలనాడు నైమిశారణ్యంలో సప్తఋషులు వేడుకున్నారట, ఋషులే ఆమాట అంటే మరి, నేడు కలియుగ వాసులమయిన మన మాట ఏమిటి? జీవితంలో ప్రతి సంఘటనలోనూ, ప్రతి వారిలోనూ, మంచినే గ్రహించే స్థితిని పొందమని ఋషుల బోధ. ప్రతి మంచిలోను చెడును చూసే వారికి ఇది ఎంతటి కంటగింపోకదా! కనీసం మంచిని మంచిగా గుర్తించగలిగిననాడు గురువు మార్గం బోధపడుతుంది. "తన కులము, గోత్రము, చివరకు తన బంధువు కూడ కాదు, మాతో అతనికి, మాకు ఎటువంటి సంబంధ బాంధవ్యాలు లేకున్నా, ఆహారమిచ్చి, నీళ్ళిచ్చి, కీకారణ్యంలో వెంటనుండి దోవచూపుతా" అని పలికిన ఆ వ్యక్తి పలుకులలో వ్యక్తమయిన అవాజ్యమైన ప్రేమ గ్రహించి, ఆకలి దప్పులుగల నేను అతను ఇస్తానన్న ఆహారము, నీళ్ళు తీసుకోవటానికి సంసిద్ధుడయ్యాను. నా మిత్రులు మాత్రం తిరస్కరించి తిరిగి కీకారణ్యంలో ప్రవేశించారు" అంటారు శ్రీసాయి. అవతలి వారు ఏమి చెబుతున్నారో, ఎందుకు చెబుతున్నారో అర్థం చేసుకోకుండా, అహంతో, అసహనంతో, చులకన భావంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తాము అధికులమని భావించే వారికి శ్రీసాయి చేసిన బోధ ఇది. "సర్వజీవుల హితం కోరుకునే వారికి, సర్వజీవుల హితం చేకూరుతుంది" అన్న ఋషివాక్యం మరచి స్వార్థంతో జీవించే వారికి శ్రీసాయి ఆచరణాత్మకంగా చేసిన బోధ అది.

ఇతరులకు మేలు చేయకపోయినా ఫరవాలేదు, త్రికరణ శుద్ధిగా (మనసా, వాచా. కర్మణా) హాని చేయకుండా ఉండాలి. "సత్వగుణ ప్రధానముగా ఉన్న వాళ్ళు చేసే యజ్ఞాది కర్మలు సఫలీకృతమవుతాయి'' అంటారు గీతాచార్యుడు. మనలోని రాగద్వేషాలను దైవీసంపదతో జయించిననాడు, సత్వగుణం బలీయమై, సద్గురువు మార్గం బోధపడి ఆచరణాత్మకమవుతుంది. అందుకు ఆలంబనగా ఇష్టాయిష్టాలను జయించటము, వర్తమానంలో జీవించటమే, కాకుండా ఎలా జీవించాలో తెలిసి జీవించటము ద్వారా జీవితమంతా సాధనగా మారుతుంది" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు.

తీవ్ర అన్వేషణలో మునిగిన తాను, ప్రధమంగా శ్రీసాయి దర్శనానికి విముఖత చూపినా, అంతర్లీనముగా శ్రీసాయి పిలుపుతో వారి చెంతచేరి, బాబా అమృత దృష్టిలో ఓలలాడి, వారి విశ్వచైతన్యంలో తాను భాగమని గుర్తించి, గుర్తెరిగి తగు రీతిన జీవిస్తూ, లక్షలాది మందికి ఆదర్శప్రాయులై, శ్రీసాయిమాస్టర్‌గా వినుతికెక్కేరు పూజ్య ఆచార్య శ్రీ భరద్వాజమాష్టారుగారు. "సాధన అంటే సంస్కారాల మార్పుకోసం చేసే తీవ్రమయిన ప్రయత్నం" అని చెప్పటమే కాకుండా, తాను ఆచరించి ఆచార్యులైనారు శ్రీ భరద్వాజగారు. శ్రీసాయికి వారి గురువు చెవిలో ఏమి ఉపదేశించలేదు "అపారమైన వారి ప్రేమతత్వాన్ని గమనించి వారి వెంట నడిచి, ''బావిలో తల్లక్రిందులుగా వేలాడదీసిన, భూగృహంలోకి వెళ్ళి 12 సంవత్సరాలు ధ్యానస్థులైనా, ఆ ప్రేమమూర్తిని నిరంతరం చూస్తూ ఆనందంలో మునిగిపోయి ఆకలి దప్పులు కూడ మరిచిపోయాను" అంటారు శ్రీసాయి. "నా మనస్సు వారియందే నిలచిపోయింది. అంతకాలము నాకు అన్నవస్త్రాలకు లోటులేదు. వారిపైన నాకుగల ప్రేమ విశ్వాసాలే నా గురువుకు నేను సమర్పించిన మొదటిపైసా, సంతోషము – పట్టుదలతో కూడి సర్వకాల సర్వావస్థలయందు చెదిరిపోని దృఢమైన నమ్మకము నేను సమర్పించిన రెండవపైసా. నిరంతరం వారి సేవలో నిమగ్నమై వారి కృపకై వేచి ఉన్నాను. ఆయన మనోదృష్టితో నన్ను ఉద్ధరించి ఈనాటి ఈ స్థితిని ప్రసాదించారు. ఇందులో నా ప్రయత్నం గాని, వారు నాకు ప్రత్యేకముగా నిర్దేశించిన సాధనగాని, ఉపదేశంగాని ఏమిలేదు" అంటారు శ్రీసాయి తన గురుసేవా వృత్తాంతములో.

శిరిడీలోని వేపచెట్టుక్రింద కూర్చున్నప్పుడు పండో, ఫలమో తెచ్చి ఇచ్చిన దానికి ప్రతిఫలంగా వారికి ఆకుపసరులతో వైద్యంచేసి వారి రోగనివారణ చేసేవారు శ్రీసాయి.

పాడుపడ్డ మశీదు తనకు ఆశ్రయముగా ఇచ్చిన దానికి కృతజ్ఞతగా, అనేక మిషలమీద ప్రజలను తన వద్దకు లాగి, వారి భవరోగాలను కూడ హరింపచేసేవారు, కూలిపోయిన మశీదు బాగుచేసి ఇచ్చినందుకు ప్రతిఫలంగా, అందరూ చెత్తకుప్పగా ఉపయోగించే ప్రదేశాన్ని శుభ్రంచేసి, పుష్పవనంగా మార్చి, రాబోయే కాలంలో వారి హృదయాలలో పుష్పాలు విరబూసే అద్భుత ఆధ్యాత్మిక కేంద్రానికి (సమాధిమందిరం) నాంది పలికేరు శ్రీసాయి. ప్రథమంలో తనకు భిక్ష ఇచ్చిన బయ్యాజిబాయికి ఇచ్చిన మాటను అనుసరించి తన ప్రాణాలు ఫణ్ణంగా పెట్టి, ఆమె బిడ్డడు తాత్యాను కాపాడేరు శ్రీసాయి. కృతజ్ఞతకు మరో రూపంగా నిలిచేరు శ్రీసాయి. కృతజ్ఞత కలిగి ఉంటే మనిషి అవుతాము లేకుంటే రాక్షసులవుతాము. తనకు జన్మ నిచ్చిన వారిపట్ల విద్య నేర్పిన వారిపట్ల, సాటివారిపట్ల, సమాజం పట్ల, దేశముపట్ల, ప్రకృతిపట్ల, దైవంపట్ల ఇలా మన జీవనానికి సహకరించిన ప్రతి వారిపట్ల కృతజ్ఞత కలిగి ఉండటమే నిజమైన సాధన. సాయి ఆచరించి చూపింది అదే. వారు చూపిన మార్గంలో నడచి ఆ స్థితిపొందిన ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు చూపిందే అదే. తీవ్రమయిన అనేవషణలో ఉన్న శ్రీ భరద్వాజగారు శిరిడీలో శ్రీసాయి చెంత విశ్వచైతన్యానుభూతిని పొందిన తరువాత, ఆ అనుభూతిని, అనుభవాన్ని స్థిరం చేసకోవటానికి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి, ఇష్టాఅయిష్కాలను జయిస్తూ శ్రీసాయి స్వరూపులయిన ఎందరో అవధూతలను, మహాత్ములను దర్శించి, వారి సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులై, తిరిగి తన దరిచేరిన వారందరికీ సాయి విశ్వతత్వాన్ని ప్రత్యేకించి అవధూత తత్వాన్ని పరిచయంచేసి, వారి దర్శన ఆశీస్సులు లభించేలా చేశారు. శ్రీసాయి అనుగ్రహం పొందిన తరువాత తానొక గురువునని భావించక, అన్వేషకునిలా జీవిస్తూ, తాను పొందిన అనుగ్రహాన్ని సర్వులూ పొందాలని అహర్నిశలు శ్రమిస్తూ, సత్సంగాల ద్వారా, రచనల ద్వారా భక్తకోటికి నిర్దుష్టమైన సాయి మార్గాన్ని అందించారు శ్రీ భరద్వాజగారు. "మీరున్నచోట సత్సంగం చేయండి అదే నాకు అక్షరలక్షలు ఇచ్చినట్లు" అన్నారు. చివరి క్షణం వరకు శ్రీసాయి సాంద్రాయ ప్రచారయజ్ఞంలో సమిధిగా మారి, చివరిశ్వాస వరకు శ్రమించి, లక్షలాది హృదయాలలో జ్యోతిస్వరూపులై వెలుగొందుతున్నారు "సాయిమాస్టర్" పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారు. "చూసి నేర్చుకోమని" చెప్పిన జగద్గురువు శ్రీసాయి బోధను తాను తప్పకుండా పాటించి, మరల తన ఆచరణతో మనకు తెలియజేస్తూ, "నేను చెప్పదలచింది, చేయదలచింది అంతా రచనల ద్వారా అందించాను" అన్నారు మాష్టారుగారు. వారు పంచిన జ్ఞానామృతాన్ని గ్రోలుతూ, నలుగురితో కలసి పంచుకోవటమే మాష్టారుగారు చూపిన సాయి పథంలో ప్రథమ సోపానం. ఇష్టా అయిష్టాలను వదిలివేసి, సాయివారికి ఇతోధికంగా సహకరించటము రెండవ సోపానం. వారు అడిగే రెండు పైసల దక్షిణ అదే, జన్మదినాలు, ఆరాధనోత్సవాల పేరిట అట్టహాసంగా వేడుకలు జరుపుకోవటం కాకుండా మన జన్మ సార్థకమయ్యేలా, వారికి ఇష్టమైన రీతిలో జీవించటము వారికి మనమిచ్చే నిజమైన కానుక. "నేను చెప్పిన పని చేయని వారితో నాకేమి పని" అన్నారు శ్రీసాయి, "మీ హృదయంలో వెలిగిన సత్సంగ జ్యోతిని, మరింత మంది హృదయాలలో వెలిగేలా చేయాలి. అప్పుడు మీరున్న చోట నేను ఉంటాను" అన్నారు ఆచార్యులవారు. సాధన అనే పుష్పమాలిక, ఇష్టాఅయిష్టాలను జయించటమనే సూత్రం (దారం) మీదనే ఆధారపడి ఉంటుంది.

రాగద్వేషాలను జయిస్తేగాని ఆధ్యాత్మికంగా వికాసం కలగదు. కేవలం నెలల తరబడి ధ్యానం చేసినా, వాటిని జయించకపోతే ఆ సాధన అంతా పునాది లేని భవనంవలె కూలిపోతుంది. అందుకు మొదట ఇష్టాఅయిష్టాలను జయించాలి.

"బయటవర్షం కురుస్తుంటే గొడుగు తీసుకొని, గొడుగు వేసుకొని వర్షంలోకి వెళ్ళి, ఇంకొకరికి సహాయం చేస్తూ కూడ మీరు తడవకుండటము నేర్చుకోవటానికే ఇక్కడకు వచ్చింది. దీని గురించి ఇది ఇలా జరుగుతుంది అని, ఇలా చేస్తారు అనిగాని, లేక ఈవిషయంలో ఇలా జరగాలి అనే భావాలను ఎప్పుడూ పెట్టుకోవద్దు, గురువు చెప్పినట్లు చేసి ఉండిపోవాలి. అలా చేయగలిగితే చేయవల్సింది అంటూ ఏమీఉండదు. వేరొక ఆలోచన లేకుండా మహాత్ములు చెప్పినట్టల్లా చేస్తూ ఉంటే, మనంతట మనమే పరిపూర్ణత పొందుతాము. అందరిలో బాబాను చూస్తూ ఉండాలి, ఒకరి గురించి ఎప్పుడూ చెడుగా ఎవరితో మాట్లాడకూడదు. మనమెలాంటి వారలమో ముందుగా గుర్తించి హృదయపూర్వకంగా పరితాపం చెందాలి. అట్టి తీవ్రమయిన పరితాపం నుండే నిజమైన ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమవుతుంది, ధ్యానం మనోలయం వరకు మాత్రమే తీసుకుపోగలదు, వివేకం లేకుండా నిజమైన పురోగతి ఉండదు కనుక బయట ప్రపంచంలో అందరితో కలసి ఉంటూ, మనలోని వాసనలను గమనిస్తూ తొలగించుకోవాలి. మన ప్రవర్తన ద్వారా మానవులమని నిరూపించుకుందాము. చేసే ప్రతి పని ప్రేమతోనూ, సంతోషంతో చేద్దాము" అంటారు శ్రీసాయి అనుంగు బిడ్డడుగా మహాత్ములచే కీర్తించబడిన ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. ఇదే మాష్టారు మనకు చూపిన సాధనా మార్గం.

ఇలా ఎన్నో విషయాలను మాష్టారుగారు తాను ఆచరించి బోధించారు. ఆచరించి తరించటమా లేదా అన్నది మనవిధి, వారు చూపిన బాటలో నడవటమే చైతన్య స్వరూపులయిన శ్రీ మాష్టారుగారికి గురుపూర్ణిమ సందర్భముగా మనము ఇచ్చే 'గురుదక్షిణ' కావాలి. గురుపూర్ణిమ శుభాకాంక్షలతో...

**మీ... వి.వి. పూర్ణచంద్రరావు**

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం

## (2022 ఏప్రిల్, మే, జూన్ నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా 2022 ఏప్రిల్, మే, జూన్ నెలలలో అనేక ఆధ్యాత్మిక – సామాజిక కార్యక్రమాలు నిర్వహించటము జరిగింది.

ఏప్రిల్ 2వ తేదీ తెలుగు నూతన సంవత్సరాది శ్రీ 'శుభకృత' నామ సంవత్సర ఆగమనాన్ని పురస్కరించుకొని శ్రీ సద్గురుపాదుకాక్షేత్రములో సాయంత్రం ప్రత్యేక సత్సంగము, పంచాంగ శ్రవణ కార్యక్రమము ఏర్పాటు చేయటమైనది. ఆ సందర్భముగా శ్రీ భరద్వాజ సద్గురువాణి ఎడిటర్ వి.వి. పూర్ణచంద్రరావు "సద్గురు సమాశ్రయము – మాష్టారుచూపిన మార్గము" పై ప్రవచనము చేశారు. అనంతరం సామూహిక భోజనాలు ఏర్పాటు చేయటమైనది.

ఉగాది సందర్భముగా శ్రీకాకుళంలోని అమ్మఫౌండేషన్‌లోని అనాథ బాలుర వసతి గృహమునకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, పండుగకు సరిపడా కూరగాయలు అందజేయటమైనది.

ఏప్రిల్ 6వ తేదీ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి ఆరాధనోత్సవము (తిథిప్రకారం) సందర్భముగా ప్రత్యేక సత్సంగమము నిర్వహించి, సమారాధన చేయటమైనది.

ఏప్రిల్ 10వ తేదీ శ్రీరామనవమి పర్వదినం సందర్భముగా మొట్టమొదటిసారిగా శ్రీ సద్గురుపాదుకాక్షేత్రములో లోకకల్యాణార్థము "శ్రీ సీతారామ కళ్యాణమహోత్సవము" నిర్వహించటమైనది. ఆ సందర్భముగా, కళ్యాణ మూర్తులను పవర్‌సిటీ వీధులలో అత్యంత వైభవోపేతంగా ఊరేగించి, అనంతరం చల్లటి సాయంకాలం వేళలో కళ్యాణోత్సవం నిర్వహించటమైనది. కోటా రామశాస్త్రి ఆధ్వర్యములో ట్రస్టుఛైర్మన్ దంపతుల పరివేక్షణలో జరిగిన ఆ కార్యక్రమానికి చుట్టుప్రక్కల నుండి విశేషముగా భక్తులు తరలిరావటంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కళ్యాణము అనంతరం ప్రతి ఒక్కరికి శ్రీరామపట్టాభిషేక చిత్రపటం, కళ్యాణ అక్షింతలు, ప్రసాదము అందజేసి విందు భోజనము ఏర్పాటు చేయటమైనది.

శ్రీరామ నవమి సందర్భముగా, శ్రీకాకుళంలో వృద్ధులకు, దివ్యాంగులకు నిత్యాన్నదానం జరిపే సమితివారికి పర్వదిన భోజన నిమిత్తము, నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేయటమైనది.

ఏప్రిల్ 12వ తేదీ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి ఆరాధనోత్సవము (తేదీప్రకారం) సందర్భముగా శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో లోకకల్యాణార్థము సామూహికముగా "శ్రీసాయిమాస్టర్" పారాయణ చేసి అనంతరము భక్త సమారాధన ఏర్పాటు చేయటమైనది.

సాయంత్రం జరిగిన ఒక కార్యక్రమములో అతినిరుపేద, దివ్యాంగుల, వితంతు 65 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, స్త్రీలకు వస్త్ర బహుకరణ చేయటమైనది. అదే సందర్భముగా శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రిలోని గర్భిణీ స్త్రీలకు, వారి సహాయకులకు, భోజన నిమిత్తము స్థానిక నిత్యాన్నదాన కమిటీ వారికి నిత్యావసర వస్తువులు, కూరగాయలు ట్రస్టు తరపున అందజేయటమైనది.

మే 11, 12 మరియు 13 తేదీలలో గిరిజన గ్రామాలైన, గుంటగన్నెల, ఇసుకగరువు, గేదెలబంద గ్రామాలలోని శ్రీ శిరిడీసాయిబాబా మందిర వార్షికోత్సవాలలో ట్రస్టు ఛైర్మన్ దంపతులతో పాటుగా, 10 మంది ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. ఆ సందర్భముగా శ్రీ సద్గురువుల పాదుకామహోత్సవము నిర్వహించటమైనది.

మే 11వతేదీ అరకు వేలీలో, సత్సంగ నిర్వాహకులు నూతనముగా నిర్మించిన గృహము ట్రస్టు ఛైర్మన్ ప్రారంభించి, పూజాదికాలు నిర్వహించారు. ఆ సందర్భముగా సద్గురువుల పాదుకలను భక్తుల దర్శనార్థమై ఉంచటమైనది. "సాయి అనుగ్రహము" గురించి ట్రస్టుఛైర్మన్ సత్సంగమము నిర్వహించారు. స్థానికముగా వందలాది మంది భక్తులు ఆ కార్యక్రమములో పాల్గొని, పాదుకలను దర్శించుకొని పరవసించారు. అనంతరం అందరికీ సమారాధన, నిర్వాహకులు ఏర్పాటు చేయటమైనది.

సాయంత్రం గుంటగన్నెలలోని శ్రీ సాయిబాబా మందిర వార్షికోత్సవ కార్యక్రమములో పాల్గొని, సత్సంగమము నిర్వహించటమైనది

మే 12వ తేదీ గురువారం డుంబ్రిగుడ మండలంలోని శ్రీ శిరిడీసాయిబాబా మందిర 17వ వార్షికోత్సవములో (16 సంవత్సరాల క్రితం ట్రస్టు ఛైర్మన్ ఆధ్వర్యములో నిర్మితమైన మందిరానికి శ్రీ శిరిడీసాయిబాబా, శ్రీ దత్తాత్రేయుని పాలరాతి విగ్రహాలు బహుకరించి ప్రతిష్ఠించటమైనది) ట్రస్టు ఛైర్మన్ దంపతులతోపాటుగా ట్రస్టు సభ్యులు పాల్గొనటం జరిగింది. కరోనా నేపథ్యములో రెండు సంవత్సరాల అనంతరం జరుగుతున్న వార్షికోత్సవానికి మారుమూల గ్రామాలనుంచి వేలాదిగా భక్తులు, కొండలు, కోనలు దాటి విచ్చేశారు. అంతకు ముందు రాత్రి వరకు తుఫాను కారణంగా వర్షంతో తడిసి ముద్ద అయిన గ్రామాలు వార్షికోత్సవ రోజున సూర్యభగవానుడి రాకతో, అది సాయికృపయేనని పరవసించి, అత్యంత ఉత్సాహముతో వార్షికోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్నారు భక్తులు. ఉదయం సద్గురువుల పాదుకలను గ్రామ వీధులలో ఊరేగించి మందిరములో భక్తుల దర్శనార్థమై ఉంచటమైనది. అనంతరం జరిగిన కార్యక్రమములో

ట్రస్టు ఛైర్మన్, సామూహిక గురుపూజలు నిర్వహింపచేసి "శ్రీసాయి కృపావర్షం" గురించి ప్రవచనం చేశారు. మధ్యాహ్నం వేలాది మందికి ఆలయ కమిటీవారు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమములో "శ్రీసాయి కృపపొందేమార్గము" గురించి ట్రస్టు ఛైర్మన్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం ట్రస్టు తరపున 250 మందికి, మరియు స్థానికుల సహకారంతో 150 మంది స్త్రీలకు చీరలు బహుకరించటమైనది. వార్షికోత్సవ సందర్భముగా సామూహిక నామకరణాలు, అక్షరాభ్యాసాలు ట్రస్టు ఛైర్మన్ చేతులమీదుగా చేయటమైనది. (ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు దంపతులు ఆ మారుమూల గిరిజన గ్రామాలకు రావటమే ఒక శుభముహూర్తము, పెద్ద పండుగగా భావించే అక్కడి ప్రజలు, ట్రస్టు ఛైర్మన్ అక్కడ అడుగిడిన సమయంలోనే అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు, నామకరణాలు చివరకు వివాహాలు కూడా నిర్వహించుకుంటారు. 'గడ్డిపోచనైనా గురువుగాపెట్టుకో! గమ్యం చేరుతావు" అన్న సాయి సూక్తిని తు.చ, తప్పకుండా ఆచరించటము వారిలో గమనించవచ్చు. గురువు పైగల విశ్వాసమే వారిని ఉన్నతపథంలో నడిపిస్తున్నది) అనంతరం మందిర నిర్వాహకులు, స్థానిక పేదలకు వస్త్రాలు బహుకరించారు.

ఆ కార్యక్రమములో ఇసుకగరువు శ్రీసాయిబాబా మందిర నిర్వాహణ కమిటీవారు కూడా పాల్గొన్నారు.

మే 14వ తేదీ ట్రస్టు ఛైర్మన్ మాతృమూర్తి గారి పుణ్యతిథి సందర్భముగా అరసవిల్లి బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రములో అన్నదాన నిమిత్తము నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేయటమైనది.

స్వగృహములో ట్రస్టుఛైర్మన్ తల్లిగారి పుణ్యతిథి కార్యక్రమము ప్రారంభించే సమయానికి కర్ణాటకలోని యానగొండి నుంచి 'శ్రీమాణిక్యేశ్వరి మాత' పాదుకల రూపంలో విచ్చేసి అనుగ్రహించటమైనది.

మే 15వ తేదీ స్థానిక డిజైర్ సొసైటీ (ఎయిడ్స్ బాధితుల చిన్నారుల సంక్షేమసంఘం) ఆధ్వర్యములో జరిగే వేసవి శిక్షణాశిబిరానికి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన విద్యార్థులకు నిర్వాహకుల అభ్యర్ధన మేరకు 20 వేలు ఖరీదుచేసే స్కూలు బ్యాగ్‌లు ట్రస్టు తరపున అందజేయటమైనది.

మే 22వ తేదీ భానుసప్తమి సందర్భముగా శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో లోకకళ్యాణార్ధము "శ్రీ లలితా, విష్ణు, మణిదీప వర్ణన" సామూహిక పారాయణ చేసి, భక్తసమారాధన చేయటమైనది. ఆ కార్యక్రమములో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మే 22వ తేదీ ట్రస్టు ఛైర్మన్ దంపతుల పెళ్ళిరోజు సందర్భముగా అసరవిల్లి, శ్రీకాకుళంలోని నిత్యాన్నదానసత్రమునకు అన్నదాన నిమిత్తము దాదాపు 400 మందికి సరిపడా కూరగాయలు అందజేయటమైనది.

మే 25వ తేదీ హనుమజ్జయంతి సందర్భముగా లోకకళ్యాణార్ధము సామూహిక "సుందరకాండ" వచన కావ్యము పారాయణ చేయటమైనది. అనంతరం భక్త సమారాధన చేయటమైనది. ఈ కార్యక్రమములో సుదూర ప్రాంతాలనుండి ట్రస్టు అనుబంధ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

మే 25వ తేదీ ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు జన్మదినము సందర్భముగా శ్రీకాకుళంలోని వృద్ధులు, దివ్యాంగుల అన్నదాన సమితివారికి నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేయటమైనది.

శ్రీసద్గురు పాదుకాక్షేత్రములో, శ్రీసాయి భరద్వాజ అపన్నహస్తం పేరిట వితంతు, దివ్యాంగుల, వృద్ధులు, అతినిరుపేద 65 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది. ఆ సందర్భముగా వారందరికి విందుభోజనం ఏర్పాటుచేయటమైనది.

జూన్ 6వతేదీ అవధూత శ్రీ చివటం అమ్మ ఆరాధనోత్సవము సందర్భముగా " అవధూత శ్రీ చివటం అమ్మ చరిత్ర" సామూహిక పారాయణ చేసి భక్తసమారాధన చేయటమైనది. శ్రీ సద్గురుక్షేత్రంలోకల శ్రీ చివటం అమ్మ ఉపయోగించిన భిక్షాపాత్రను భక్తులు దర్శించి, స్పృశించి పరవసించారు.

ఆ సందర్భముగా శ్రీకాకుళంలోని నిత్యాన్నదాన సత్రము వారికి కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

జూన్ 12వ తేదీ అరసవిల్లిలోని నిత్యాన్నదాన సత్రములో అన్నదాన నిమిత్తము, నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేయటమైనది.

జూన్ 12వ తేదీ ట్రస్టుఛైర్మన్ తండ్రిగారి పుణ్యతిథి సందర్భముగా శ్రీ సద్గురుపాదుకాక్షేత్రములో కార్యక్రమము నిర్వహించి, బ్రాహ్మణ భోజన సమితి పేదలకు అన్నదానము చేయటమైనది. ఆసందర్భముగా కర్ణాటక రాష్ట్రంలోని హంపి విజయనగరం జిల్లాలోని కిష్కందక్షేత్రము దగ్గరగల ఆదిపరాశక్తి శ్రీ దుర్గామాత ఉపాసకులు అయిన శ్రీశ్రీశ్రీ బ్రహ్మానందస్వామి వారు బహుకరించిన గురు ప్రసాదమైన కమండలు పాత్ర, శ్రీసద్గురుపాదుకాక్షేత్రమునకు ఆరోజే రావటం జరిగింది.

జూన్ 14వ తేదీ యోగిరాజు శ్రీ దామరాజు వేంకటరామయోగీంద్రులు శ్రీ పాకలపాడు గురువుగారి జయంతోత్సవము సందర్భముగా లోకకళ్యాణార్ధము "శ్రీ పాకలపాడు గురువుగారి చరిత్ర" సామూహిక పారాయణ చేయటమైనది. ఆ కార్యక్రమములో విశేషముగా పాల్గొన్న భక్తులు, బాబుగారు స్వయంగా ధరించిన వస్త్రాన్ని దర్శించి, స్పృశించటము ద్వారా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం భక్త సమారాధన ఏర్పాటు చేయటమైనది.

జూన్ 23వ తేదీజ్యేష్ట శుద్ధ బహుళ దశమి గురువారం

రోజున శ్రీ సద్గురుపాదుకాక్షేత్రమునకు అవధూత శ్రీ కాశిరెడ్డి నాయన స్వయంగా తన సేకులకు అనుగ్రహించి, ప్రసాదించిన పాదుకలు, రెండు రూపాయల నాణేము, మరియు పురాతనమైన శంఖు వారి సేవకుల ద్వారా మన శ్రీ సద్గురుపాదుకాక్షేతంనకు అనుగ్రహించబడినవి.

జూన్ 26వ తేదీ శ్రీ మరిడిమాంబ దేవాలయం సెక్టర్–5, ఉక్కునగరం విశాఖపట్నం వారు అతి నిరుపేదలకు, గిరిజనులకు పంపిణీ నిమిత్తం శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు (పవర్‌సిటీ, పరవాడ మండలం) కు అమ్మవారికి ప్రసాదించిన దాదాపు 350 చీరలు ట్రస్టు ఛైర్మన్ దంపతులకు అందజేయటమైనది.

జూన్ 28వ తేదీ శ్రీ సాయి భరద్వాజ అపన్నహస్తం పేరిట 65 అతి నిరుపేద, వితంతు, వృద్ధుల, దివ్యాంగుల కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

స్థలాభావము వలన ఆ యా కార్యక్రమాల వివరాలు సంక్షిప్తముగా తెలియజేయటమైనది.

సమీక్ష : **శ్రీమతి వి. జ్యోతిర్మయి**, విశాఖపట్నం

# మేము సహితం

ఆధ్యాత్మిక సామాజిక సేవలో భాగముగా 2022 ఏప్రిల్, మే, జూన్ నెలలలో శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా అనేక ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటం జరిగింది. వాటిలో కొన్ని ముఖ్యమైన సామాజిక సేవా కార్యక్రమాలు, "శ్రీ సాయిభరద్వాజ అపన్నహస్తం" పేరిట అతి నిరుపేదలు, దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు అయినటువంటి 65 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు ప్రతి నెల అందజేయటము

ఎయిడ్స్ బాధితుల చిన్నారుల సంక్షేమ సొసైటీ డిజైర్ వారి అధ్వర్యములో జరిగిన సమ్మర్ క్యాంప్‌లో పాల్గొని విద్యార్థులకు బ్యాగ్‌లు బహుకరించటమే కాకుండా

రెండు సంవత్సరాల తరువాత డుంబ్రిగూడ మండలములోని గుంటగన్నెల, ఇసుకగరువు, గేదెలబందలలోని శ్రీ సాయిబాబా మందిరాల వార్షికోత్సవాలలో పాల్గొన్న ట్రస్టు ఛైర్మన్ దంపతులు 250 మంది గిరిజన స్త్రీలకు చీరలు బహుకరించటమైనది, మరియు ప్రతి నెల రిమ్స్ ఆసుపత్రిలోని గర్భిణీ స్త్రీలకు, వారి అనుయాయులకు అన్నదాన నిమిత్తము సరుకులు, కూరగాయలు శ్రీకాకుళంలోని నిరుపేదలకు, వృద్ధులకు నిత్యాన్నదానము చేసే సమితివారికి నిత్యావసర వస్తువులు, కూరగాయలు, అరసవిల్లిలోని బ్రాహ్మణ నిత్యాన్న దానసత్రమునకు ఆ యా సందర్భముల ననుసరించి, అవసరమైన నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేయటము మొదలైనవి సేవాకార్యక్రమాలలో కొన్ని, మరిన్ని సేవాకార్యక్రమ వివరాలు ఆధ్యాత్మిక – సామాజిక సేవలో పేజీ నెం – 21లో చూడగలరు.

మేము చేసే సామాజిక సేవాకార్యక్రమాలకు సహృదయముతో ఇతోధికముగా ధన, వస్తు రూపంలో సహాయ సహకారములు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతాభివందనాలు. మీరందించే ప్రతి రూపాయి విలువ పదింతలుగా భావిస్తూ, అర్హులైన వారికి, అందించే సేవాభాగ్యము కొనసాగించగలమని తెలియజేసుకుంటూ, సహాయ సహకారములు అందించిన వారి వివరాలు ఈ క్రింద పొందుపరుస్తున్నము.

## సహాయ సహకారములు అందించిన సహృదయులు

| | |
|---|---|
| కుమారి యస్. హరిష, నల్లపాడు, గుంటూరు | 12,600/- |
| శ్రీ సలాది రామకృష్ణ, కూర్మన్నపాలెం, వైజాగ్ | 10,000/- |
| శ్రీమతి బి. లక్ష్మీదేవి, శ్రీ బి.వి. రెడ్డి, కర్నూలు | 5,000/- |
| శ్రీ కె. రమేష్‌బాబు, శ్రీనగర్, విశాఖపట్నం | 3,000/- |
| శ్రీమతి కె. హైమ అప్పలరాజు, దీపాంజలినగర్,పరవాడ | 2,000/- |
| శ్రీ కె.శరత్‌చంద్రబాబు, పవర్‌సిటీ, విశాఖపట్నం | 2232/- |
| కుమారి కె. ప్రమీల, శ్రీకాకుళం | 1212/- |
| శ్రీ యమ్. రంగారెడ్డి, చెన్నై, తమిళనాడు | 1,116/- |
| శ్రీ ఆర్. సంతోష్ అమరనాథ్, శ్రీకాకుళం | 1,116/- |
| శ్రీ డి. శంకరరావు, జమదాల, పార్వతీపురం | 1,000/- |
| శ్రీ బి.సి. రామ, యల్.బి. కాలనీ, వైజాగ్ | 500/- |
| శ్రీమతి జె. రాజులమ్మ, శ్రీకాకుళం | 500/- |
| శ్రీ బి. కృష్ణారావు, అక్కయ్యపాలెం, విశాఖపట్నం | 306/- |
| శ్రీ యన్. సుబ్రహ్మణ్యశ్రీ | 250/- |
| శ్రీ జి. భిక్షపతి, హైదరాబాదు | 250/- |
| శ్రీమతి బి. వెంకటలక్ష్మి, అక్కయ్యపాలెం వైజాగ్ | 204/- |
| శ్రీ జె. సాయి, శ్రీకాకుళం | 201/- |

**మేము సహితమునకు విరాళములు పంపుటకు చిరునామా మరియు బ్యాంక్ అక్కౌంటు**

**SRI SHIRIDI SAI SEVA TRUST®**
Online A/C No. 095510011006492
IFSC Code: UBIN0809551
Union Bank, Ukkunagaram
(Used for RTGS and NEFT Transactions)

**శ్రీ భరద్వాజ సద్గురువాణి సభ్యత్వము కొరకు విరాళములు పంపుటకు చిరునామా మరియు బ్యాంక్ అక్కౌంటు**

**SRI BHARADWAJA PUBLICATIONS**
Online A/C No. 095510011006491
IFSC Code: UBIN0809551
Union Bank, Ukkunagaram
(Used for RTGS and NEFT Transactions)

**గమనిక :** సేవా కార్యక్రమాలకు, బ్యాంకుఎక్కౌంటులో సొమ్ము జమచేయు వారు, తమ పూర్తి వివరాలుఈ క్రింది నెంబరుకు మెసేజ్ ద్వారాగాని, వాట్సప్ ద్వారాగాని తెలియజేయగలరు
**సెల్ నెం. : 98496 45224** – **మేనేజరు**

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం

## (2022 ఏప్రిల్, మే, జూన్ నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)






పూర్తి వివరములకు 21 పేజీ చూడగలరు.

గురుపూర్ణిమ మరియు వినాయక చవితి శుభాకాంక్షలతో ఈ పేజీ సమర్పించిన వారు :

**శ్రీమతి & శ్రీ ఆర్. రామలక్ష్మి, శ్రీనివాసరావు, చి॥ సాయి సరోజ నిహిత - శ్రీకాకుళం**
**శ్రీ నరసింహ పట్నాయక్, శ్రీమతి స్వర్ణలత - విజయనగరం**

# అవధూత శ్రీ చీరాలస్వామి

"నా 11వ ఏట 1943 ప్రాంతంలో స్వామిని మొదటిసారి చూచినాను. చీరాల ఆసుపత్రివద్ద గంపెనచెట్ల నీడలో సాంబ్రాణి కడ్డీలు వెలిగిస్తున్నారు. స్వామి పెంటకుప్పలపైన మురికి గుంటల వద్ద ఎక్కడపడితే అక్కడ ఉండేవారు. ఆయనకు భిక్షాపాత్రగాని దండకమండలాలుగాని లేవు. చేతుల్లో పెట్టింది తినేవారు. కరతలభిక్ష. ఆయన స్నానం చేస్తుండగా ముఖ ప్రక్షాళనం చేస్తుండగా ఎవ్వరూ చూడలేదు. ఐదారు మాసాలకు ఒకసారి భక్తులు స్నానం చేయించి కొత్త బట్టలు తొడిగేవారు. మరల స్నానం చేసే దాకా అవే మురికి గుడ్డలు ధరించేవారు. అన్నం తిన్ననోరు కడుక్కోరు. ఎడమకాలు బోధ. ఐనా స్వామి వద్ద ఎటువంటి దుర్వాసన రాదు. వైకుంఠపురం చెరువు వద్ద మంటపంలో సూర్యునికి నమస్కరించి అర్ఘ్యం ఇచ్చేవారు. రాత్రి సినిమా రెండోఆట చూచి ఇండ్లకు పోతుంటే త్రోవలో ఎక్కడో మంచి వాసన వస్తే ఆ చుట్టు ప్రక్కల అవధూత స్వామి ఉన్నట్లుగా గుర్తింపు. స్వామి చాలా నెమ్మదిగా మాట్లాడేవారు. తమ కిష్టమైన యింటికి పోయి అడిగి తినేవారు. పప్పులపొడి (కమ్మపొడి) స్వామికిష్టం. ఒకనాడు అర్ధరాత్రి సినిమా చూచి వస్తుంటే ఆర్యవైశ్యవ్యాయామశాల ప్రక్కన రోడ్డుపై స్వామి మొండెం కనబడింది. తలలేదు. నేను మాలకొండయ్య వద్దకు పరుగెత్తి లేపితే ఆయన ఇప్పుడు పోవద్దన్నాడు. తెల్లవారి స్వామి యథాప్రకారం ఉన్నారు. ఒకసారి నాకు తీవ్రమైన జ్వరం వస్తే అర్ధరాత్రి స్వామిచెంతకు వెళ్ళినాను. స్వామి సమాధిస్థితిలో ఉన్నారు. అరటి పండు అగరువత్తులు ముందుంచి స్వామి అంటే 'ఊ' అన్నారు. అరగంట కూర్చున్నాను. జ్వరం తగ్గిపోయింది.



స్వామి తరచుగా మస్తానమ్మ ఇంట్లో కనబడేవారు. హఠాత్తుగా వచ్చి నీళ్ళడిగితే కాళ్ళు కడుక్కుంటారనుకొని బయటి తొట్టిలోని నీళ్ళిచ్చింది. స్వామి ఆ నీళ్ళు త్రాగుతుంటే ఆమె వారించింది. "ఏం చేసేది లోనికి పోయినవి" అన్నారు. నేనిచ్చిన అరటిపండ్లు అందరికీ పంచి తమ జేబులోని చిల్లరతో మామిడిపండ్లు తెప్పించి పంచినాను. స్వామి పడుకుంటే నేను పాదసంవాహనం చేస్తున్నాను. తాము పీల్చే సిగరెట్టు నాకిస్తే ప్రక్కన పెట్టినాను. పడుకున్న స్వామి శరీరం నుండి అటువంటి రూపమే మరొకటి లేచింది. నన్ను సిగరెట్టు త్రాగమన్నారు. నేను త్రాగినాను. ఇన్నాళ్ళు స్వామి ఒక మహాత్ముడని సేవించాను. అంతకంటే మిక్కిలి లేదు. సిగరెట్టు త్రాగిననాటినుండి నాలో తత్త్వవిచారం మొదలైనది.

ఆయన మంచి బలశాలి, దృఢమైన శరీరం, తిండిలేకపోయినా బలిష్ఠంగా ఉండేవారు. అది వారి యోగబలం. రాజుపాలెం కందప్ప ఉపదేశం కోరితే వెంట తీసుకుపోయి బురదగుంటలో నీళ్ళు త్రాగమన్నారు. "ఆ నీళ్ళెట్లా త్రాగేది స్వామీ" అన్నాడతడు. "సరె పోరా" అంటూ స్వామి అతనికి ఉపదేశం చేయలేదు. కోర్టు భవనం రావిచెట్టు క్రింద స్వామి కూర్చుని ఉండగా ఒకాయన వచ్చి మ్రొక్కి గెలిస్తే 100 రూపాయలిస్తానన్నాడు. అతడే గెలిచినాడు. నూరు రూపాయలిచ్చినాడు. స్వామి ఆ మొత్తం అక్కడున్న రిక్షావాళ్ళకు పంచినారు. నేను కొంతకాలం కడప జిల్లాలో ఉన్నాను. ఆ సమయంలో చీరాలస్వామి దేహం చాలించినారు. సమయానికి లేకపోతినని చాలా దుఃఖించినాను. నేను కడపలో ఉండగా అల్లంత దూరాన కనబడి ఆకలౌతుందన్నారు. టిఫిన్ తెచ్చి యిచ్చినాను. ఇంటికిపోయిన తరువాత ఆయన మన బోదకాలు స్వామి అని గుర్తుకు వచ్చింది. చీరాలకు వచ్చిన తరువాత సమాధి దర్శింపబోయినాను. అల్లంత దూరంనుండి సమాధిపై కనబడ్డారు. చేయి చాపితే చిల్లర డబ్బులిచ్చినాను. అప్పుడప్పుడు స్వప్నదర్శనం ఇస్తుంటారు. ఒక నెల క్రిందట వేకువ జామున మెలకువ వచ్చింది. 'అవధూత స్వామీ' అని పిల్చినాను. స్వామి నా యెదురుగా నిల్చినారు. బాగా పండిపోయి ఎరుపురంగులో ఉన్నారు. "ఎంత వరకు తెలుసుకున్నావు? అని ప్రశ్నించినారు. 'గురుబ్రహ్మ శ్లోకం' చదివినాను. "ఇంకా తెలుసుకోవలసింది ఉన్నది" అంటూ బయలుదేరినారు. నేను వెంటబడితే తాను సమాధిలోకి వెళ్ళిపోయినారు.

రచన : **"శ్రీ"**

(సెప్టెంబరు 3వ తేదీన అవధూత శ్రీ చీరాలస్వామి ఆరాధనోత్సవము సందర్భముగా ప్రత్యేకవ్యాసం.)

శ్రీ చీరాలస్వామి ఆశ్రమము చీరాలలోని ఫైర్‌స్టేషన్ ప్రక్కనగల స్వర్ణ రైల్వేగేటు దాటిన తరువాత ఒక ఫర్లాంగు దూరములో కలదు.)

## శ్రీకృష్ణవచనామృతం

మనం బయటి ప్రపంచాన్ని కళ్ళతో చూస్తున్నాము. చర్మంతో తాకుతున్నాము. చెవులతో వింటున్నాము. నాలుకతో రుచి చూస్తున్నాము. మంచి వాసనలు ముక్కుతో ఆస్వాదిస్తున్నాము. ఈ ఐదింటి వలన బయట ప్రపంచం మన లోపలకు వెళుతూ ఉంది. కానీ ఈ ఇంద్రియములు జడములు, వీటి వెనుక మనసు ఉండి నడిపిస్తూ ఉంది. మరణించిన తరువాత కూడా ఈ ఇంద్రియములు ఉంటాయి కానీ, అవి ఆయా పనులను చేయలేవు. కాబట్టి బయట ఉన్న ప్రపంచం అంతా మనయొక్క సృష్టి, మనసు చేసే పనులన్నీ ఆత్మ సాక్షీభూతంగా చూస్తూ ఉంటుంది.

**- భగవద్గీత**

# గురుస్థానము (శిరిడీ)లో 111వ పాదుకాప్రతిష్ఠ మహోత్సవము



శ్రీ సాయిబాబా మొట్టమొదటిసారిగా 1854వ సంవత్సరములో శిరిడీలోని వేపచెట్టు క్రింద 16 సంవత్సరాల వయస్సుగల బాలుడిగా ప్రకటమయ్యి, శీతోష్ణాలను లెక్కచేయకుండా ఆహార పానీయాల నిమిత్తము ఎక్కడకూ వెళ్ళకుండా నిరంతరం ఒక వేపచెట్టు క్రిందే ధ్యానస్థులై ఉంటూ, తన దరి చేరిన వారి శారీరక బాధలను, ఆకు పసరులతో తగ్గించేవారు. కొంత కాలము గడచిన తరువాత ఎవరికి చెప్పకుండా అక్కడనుంచి వెళ్ళిపోయారు. ఆ విచిత్ర బాలుడు ఎక్కడనుంచి వచ్చాడు ఎక్కడికి వెళ్ళేడు అని శిరిడీ గ్రామ దేవత అయిన ఖండోబా ఆలయ పూజారి మహల్సాపతిని అడిగినప్పుడు, ఆయన ఆ బాలుడు ఎక్కడినుంచి వచ్చాడో, ఎక్కడికి వెళ్ళేడో తెలియదు గాని, ఆ బాలుడు కూర్చున్న వేపచెట్టు క్రిందగల భూగృహములో 12 సంవత్సరాలు తపస్సు చేశారని చెప్పగా, భక్తులు త్రవ్వి చూడగా ఒకరాతి పలక క్రింద భూగృహము, అందులో వెలుగుతున్న జ్యోతులను చూసి ఆశ్చర్య ఆనందాలతో అచ్చెరువు పొందేరు. ఆ తరువాత ఆ పలకను మూసి వేశారు. తిరిగి 1856 ప్రాంతములో చాంద్‌భాయ్ పటేల్ వివాహ బృందముతో తిరిగి శిరిడీవచ్చిన సాయి మొదట తాను ప్రకటమైన శిరిడీలోని వేపచెట్టు క్రిందే కూర్చునేవారు. శిరిడీ ప్రజలు అడిగిన అనేక ప్రశ్నలకు బాబా సమాధానము ఒక్కటే. ఆ వేపచెట్టు, దానిమూలములోని భూగృహము తన గురుస్థానమని తాను అక్కడే 12 సంవత్సరాలు తన గురువును సేవించానని అందుకే ఇక్కడ ఉంటున్నానని చెప్పేవారు. ఆతరువాత ఒకసారి మూడు రోజులపాటు పెను తుఫాను రాగా, వేపచెట్టు వద్ద కూర్చున్న బాబా వరదనీటిలో మునిగి ఉండటము చూసిన భక్తులు బలవంతముగా సాయిని మశీదులోకి తీసుకువెళ్ళి కూర్చోబెట్టారు. ఆ తరువాత కొంతకాలము వరకు సాయి తరచూ వేపచెట్టు వద్ద నివశించేవారు. ఆ తరువాత పూర్తి కాలం మశీదులోనే ఉండేవారు. కులమతాలకు అతీతుడై జగద్గురువై బాసిస్తున్న సాయినాథుడు మొట్టమొదట ప్రకటమై, తన గురుస్థానమని చెప్పిన ఆ ప్రదేశాన్ని శిరిడీ ప్రజలు పవిత్రంగా భావించేవారు. బాబా కూర్చున్న వేపచెట్టు కొమ్మలను తాకటానికి కూడ సాహసించేవారు కాదు. పైగా బాబా ఆ ప్రదేశములో ప్రతి గురువారము, శుక్రవారము రోజులలో ధూపమేసి, దీపం వెలిగించటము ద్వారా ఈతిబాధలు తగ్గి, సంపద కలుగుతుంది అని చెప్పటముతో, శిరిడీ ప్రజలు, వేపచెట్టు వద్ద ఒక చిన్న గూటిని నిర్మించి అందులో బాబా ఫోటో ఉంచి ప్రతి గురు, శుక్రవారములలో ధూప, దీపములు సమర్పించేవారు.

నాల్గవ దత్తావతారమైన శ్రీ అక్కల్‌కోట మహరాజ్ భక్తుడైన "భాయి కృష్ణజీ ఆలీ బాగ్‌కర్" ప్రతి రోజు ఇంటిలో అక్కల్‌కోట స్వామి చిత్రపటాన్ని పూజించేవాడు. ఒకసారి అక్కల్‌కోట వెళ్ళి స్వామి వారి పాదుకలను దర్శించి పూజించాలని నిర్ణయించుకొని ప్రయాణమునకు సిద్ధమైనాడు. ఆ ముందటిరోజు రాత్రి కలలో అక్కల్‌కోట స్వామి కనిపించి "ప్రస్తుతము నా నివాసము శిరిడీ, కనుక నీవు అక్కడకు వెళ్ళి పూజించు" అని చెప్పెను. స్వామి ఆజ్ఞమేరకు శిరిడీ చేరి బాబాను దర్శించగానే సాయి అతనితో "స్వామి ఇప్పుడు నా రూపంలో ఇక్కడే ఉన్నారు కనుక నీవు అక్కల్‌కోట వెళ్ళనవసరం లేదు" అని అన్నారు. తన స్వప్న ఉత్తాంతము నిజమైనందుకు భాయి కృష్ణజీ శిరిడీలో కొన్ని నెలలు ఉండి తిరిగి తన స్వగ్రామము చేరెను. ఆ తరువాత తిరిగి 1912వ సంవత్సరము బొంబాయి నుండి డాక్టరు రామారావు కొఠారే, అతని కాంపౌండరు శిరిడీ బయలుదేరుతుండగా, కాంపౌండరు స్నేహితుడైన భాయికృష్ణజీ కూడ వారితోపాటు శిరిడీ వచ్చెను. శిరిడీలో వారికి సగుణ్‌మేరునాయక్, జి.కె. దీక్షిత్ బాగా సన్నిహితులయున్నారు. ఒకసారి మాటల సందర్భములో భాయికృష్ణజీ తాను శిరిడీకి రావటానికి కారణమైన తన స్వప్న వృత్తాంతము తెలియజేయగా, అది విన్న అందరూ బాగా ఆనందించి, పాదుకార్చనకోసం అక్కల్‌కోట వెళ్ళటానికి నిశ్చయించుకొన్న సమయంలోనే సాయి రూపంలో స్వామి శిరిడీలోనే ఉన్నారని అనుభవం కలిగింది కనుక, సాయిసన్నిధిలో ఇక్కడే మనము పాదుకలను ప్రతిష్ఠించి, పూజిస్తే సాయి- స్వామి అభేదస్థితి అందరికీ అనుభవమవుతుంది కనుక రాతి పాదుకలు ప్రతిష్ఠించాలని అందరు నిర్ణయించుకొన్నారు, చివరకు సాయి మొట్టమొదట శిరిడీలో ప్రకటమై, తన గురుస్థానమని చెప్పిన వేపచెట్టు క్రింద పాదుకలు ప్రతిష్ఠించాలని తీర్మానించుకున్నారు. విషయం అప్పటికే బొంబాయి వెళ్ళిన డాక్టర్ రామారావు కొఠారేకు తెలియజేయగా అతను శిరిడీ వచ్చి, పాదుకలు నమూనా గీసి, ఖండోబా ఆలయములో గల ఉపాసనీ బాబా దగ్గరకు తీసుకొని

వెళ్ళేరు. శ్రీ ఉపాసనీ బాబా పాదుకల చిత్రంలో కొన్ని మార్పులు చేసి పాదుకలను నలువైపులా శంక, చక్ర, గద, పద్మము మొదలైన గుర్తులు చేర్చి, బాబా యొక్క యోగశక్తిని కల్పవృక్షము అయినా వేపచెట్టు ఔన్నత్యాన్ని తెలియజేసే విధముగా

సదా నింబ వృక్షస్య మూలాధి వాసాత్
సుధాస్రావిణం తిక్తమప్య ప్రియంతం
తరుం కల్ప వృక్షాధికం సాధయంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాధమ్...

కొన్ని వ్రాసి ఇచ్చి, దానిని కూడ రాతిపై చెక్కించి తీసుకురమ్మన్నారు.

వెంటనే డాక్టరు కొఠారే బొంబాయి వెళ్ళి, పాలరాతిపై పాదుకలను, శ్లోకాన్ని చెక్కించుకొని శ్రీ ఉపాసనీ బాబా వద్దకు తెచ్చారు. అది 1912వ సంవత్సరము శ్రావణ శుద్ధపౌర్ణమి, గురువారం. శ్రీ ఉపాసనీ బాబా ఆ పాదుకలను భక్తులతో కలసి ఊరేగింపుగా ఖండోబా నుండి ద్వారకామాయి వరకు తీసుకొని వెళ్ళి, బాబా ముందు ఉంచి గురుస్థానములో ప్రతిష్ఠించుటకు అనుగ్రహ పూర్వక అనుమతిని వేడేరు. బాబా చిరుమందహాసముతో ఆ పాదుకలపై తన చేతినుంచి, "ఇవి భగవంతుని పాదుకలు వాటిని వేపచెట్టు మూలము వద్ద ప్రతిష్టించండి. అందరికీ మేలు జరుగుతుంది" అని, తన స్పర్శతో పాదుకలను పునీతము, సజీవము చేసి అనుగ్రహ పూర్వక అనుమతి ఇవ్వటంతోపాటు, అంతకు ముందురోజే బొంబాయి నుండి పాస్తాసేట్ అనే పార్సీ భక్తుడు పంపిన 25 రూపాయలు కూడ పాదుకా ప్రతిష్ఠ సందర్భముగా అగు ఖర్చు నిమిత్తము బాబా ఇచ్చిరి. వెంటనే అందరూ ఊరేగింపుగా వాటిని గురుస్థానము దగ్గరకు తీసుకురాగా సరిగ్గా 11గంటలకు శ్రీ ఉపాసనీ మహరాజ్ ఆ పాదుకలను వేపచెట్టు మూలమున ఒక చిన్న దిమ్మెపై ప్రతిష్టించిరి.

బ్రహ్మ కడిగిన పాదము బ్రహ్మము తానైన పాదము అన్నట్లు, జగద్గురువైన శ్రీ శిరిడీ సాయినాధునికి ప్రతిరూపముగా 1912 వ సంవత్సరము శ్రావణ శుద్ధపౌర్ణమి రోజు ఉదయం 11 గంటలకు బాబా పాదుకలు శ్రీ ఉపాసనీ మహరాజ్‌చే ప్రతిష్టించబడి, గురు సంప్రదాయములో పాదుకా విశిష్టతకు నాంది పలికి ఈ సంవత్సరానికి (2022) నూటపది సంవత్సరాలు నిండి 111వ వసంతములోనికి ప్రవేశించటమైనది. నాడు పాదుకా ప్రతిష్ట సందర్భముగా మొత్తము వందరూపాయలు ఖర్చుకాగా, బాబా ఇచ్చిన 25 రూపాయలు పోను మిగిలిన 75 రూపాయలు భక్తుల ద్వారా విరాళముగా సేకరించి ఖర్చు చేసిరి. అప్పటినుంచి జి.కె. దీక్షిత్ నిరంతరం పాదుకలకు పూజ చేస్తూ, గురు–శుక్రవారములలో అక్కడి గూటిలో దీపము వెలిగించి, ధూపము సమర్పించేవాడు. డాక్టర్ కొఠారే దీపపు నూనె ఖర్చుకుగాను నెలకు 2 రూపాయలు దాదాపు 5 సంవత్సరాలపాటు పంపెను. అప్పటి వరకు చిన్న గూటిగా ఉన్న ఆ ప్రదేశము విస్తారము చేయుటకు, పైకప్పు నిర్మించుటకు చుట్టూ కంచెను వేయుటకు సగుణ్‌మేరునాయక్ 7 రూపాయల 8 అణాలు ఖర్చుచేసెను.

గురుస్థానములో వేపచెట్టు, దానికి తూర్పు–దక్షిణ దిక్కులలో రెండు చిన్ని గూడులు దీపము నిమిత్తము నిర్మించారు. వేపచెట్టుకు ముందు పడమర దిశలో పాదుకలు, ఉత్తర దిశలో బాబా చిత్రపటము దాని ముందు మేఘుడుకు బాబా ఇచ్చిన శివలింగము మేఘుడు మరణానంతరం ప్రతిష్టించిరి. ప్రతి శివరాత్రికి అక్కడ మహారుద్రాభిషేకము నిర్వహింతురు.

బాబా మహాసమాధి అనంతరము, 1920లో అంతవరకు చిన్న గూడుగా ఉన్న ఆ ప్రదేశము కొంచెము విస్తారము చేసి, చిన్న దేవాలయము నిర్మించిరి. 1940లో శ్రీ శిరిడీ సాయిబాబా సంస్థాన్‌వారు గురుస్థానములోని మందిరాన్ని మరి కొంత విస్తరించిరి. 1974లో గురుస్థానములో మందిరము పెద్దదిగా విస్తరింపచేసి ఒక అద్భుతమైన మందిరము నిర్మాణము సంస్థానము వారు చేయటమేకాకుండా, సమాధి మందిరములోని బాబా విగ్రహము చెక్కిన తాలిమ్ కుమారుడైన బాలాజీ వసంత తాలిమ్ చేత చెక్కించిన 3 అడుగుల పాలరాతి బాబా విగ్రహము ప్రతిష్టించి, నిరంతరము పూజ చేయుటకు పూజారిని కూడ నియమించిరి. భక్తుల సౌకర్యార్ధము ప్రదక్షిణాల కొరకు క్యూలైను కూడ ఏర్పాటు చేసిరి. గురుస్థానము చుట్టూ సామాన్యులతోపాటు ఎందరో మహాత్ములు కూడ ప్రదక్షిణలు చేస్తూ , అక్కడ నామజపం చేస్తూ ఉండేవారు. అప్పట్లో గురుస్థానముతో ప్రారంభించి, సమాధి మందిరము, ద్వారకామాయి చుట్టూ ప్రదక్షిణ తిరుగుతూ గురుస్థానము వద్దకు చేరటము ఒక మహా ప్రదక్షిణ అని చేసేవారు. శేజ్‌హారతి అనంతరము మరుసటి ఉదయం కాకడ హారతి ముందువరకు రాత్రి సమయంలో ఎందరో యోగులు, తాపసులు గురుస్థానము చెంత తమ జపతపాదులు, అనుష్టానములు కొనసాగిస్తారని ప్రతీతి. 1992 ప్రాంతములో తెల్లవారుజామున 4 గంటలకు మా దంపతులము శిరిడీలోని గురుస్థానమునకు ప్రదక్షిణకు వెళ్ళాము. దాదాపు 11 ప్రదక్షిణలు అయిన తరువాత అంతవరకు అక్కడ కానరాని దండకమండలుధారియైన ఒక యతీశ్వరులు గురుస్థానము ముందటి సిమ్మెంట్ బల్లపై కూర్చుని జపమాల తిప్పుతూ దర్శనమిచ్చారు. వారికి నమస్కరించి దక్షిణ ఇవ్వబోతే, చిరునవ్వుతో రెండు చాలు అంటూ రెండు రూపాయల దక్షిణ తన కమండలములో వేయమని చెప్పి, అందులోని వికసించిన రెండు గులాబీలు మాయిద్దరికీ చెరి ఒకటి ఇచ్చి, ఆశీర్వదించారు. తలపై జటా ముడి, తెల్లటి పొడుగాటి గెడ్డము,

కాషాయ పంచ ధరించి, ఎడమ చేతి దగ్గర కమండలము, దండముపై ఉంచిన కుడిచేతిలో జపమాల, పద్మాసనుడై కూర్చున్న ఆయన అలనాటి మహర్షిలా గోచరిస్తూ, పచ్చటి పసిమి ఛాయతో మెరిసిపోతున్న ఆ స్వామి ఇచ్చిన అలవిరసిన గులాబీలు మహాప్రసాదంగా స్వీకరించి, వారికి నమస్కరించి, అంతటి అదృష్టాన్ని కలుగజేసిన సాయికి కృతజ్ఞతగా గురుస్థానము చుట్టూ మరొక్క ప్రదక్షిణము చేసి చూసేసరికి ఆస్వామి అక్కడలేరు. మాతో ప్రదక్షిణ చేస్తున్న వారిని అడిగితే "ఆ సిమెంట్ బెంచీమీద ఎవరూ లేరే, మీరే ప్రదక్షిణ మధ్యలో వెళ్ళి గులాబీలు తెచ్చారు. బహుశ బాబాకు ఇవ్వటానికి కొనుక్కొచ్చారేమో అని అనుకున్నాము" అన్నారు. అదీ సాయి సన్నిధి – గురుస్థానమహిమ. చాలాసార్లు సాయిభక్త శ్రీ శివనేశన్ స్వామి వారి దర్శనం కూడ నాకు గురుస్థానము వద్దనే జరిగింది.

గురుస్థానము ఎదుట భక్తులు ధూపము వేయుటకు గాను గురు, శుక్రవారములలో సంస్థానము వారు తాత్కాలిక ధుని కూడ ఏర్పాటు చేశారు. క్రమేపి గురుస్థానము ప్రాముఖ్యత తెలిసి వేలాదిగా భక్తులు దానిచుట్టూ ప్రదక్షిణలు చేయసాగేరు. అంతట సంస్థానమువారు గురుస్థానము చుట్టూ ఉన్న కట్టడములను కూల్చివేసి దానిని మరింతగా విస్తరించారు. అయితే ఆ విస్తరణలో కాంక్రీటు ప్రాధాన్యత పెరిగిపోయి చివరికి వేపచెట్టుకు మూలానికి ప్రాణవాయువు, నీరు అందని పరిస్థితి ఏర్పడటంతో బాబాకు, అత్యంత ప్రీతిపాత్రమై, మనపాలిట గురుస్థానమైన, ఆప్రదేశములోని కల్పవృక్షమైన వేపచెట్టును పరిరక్షించదలచిన సంస్థానమువారు, వృక్ష సంరక్షణా విభాగము వారి సలహా, సూచన మేరకు వేపచెట్టు చుట్టూ వున్న సిమెంటు కట్టడములను కూల్చివేసి 2007 సంవత్సరములో వేపచెట్టు ముందు భాగములో నూతన గురుస్థాన మందిరము నిర్మించి, అందులో బాబా చిత్రపటాన్ని, శివలింగాన్ని, పాదుకలను పునఃప్రతిష్ఠించారు. నేడు భక్తులు దర్శించుకుంటున్న గురుస్థానము అదే. పాత గురుస్థానములో ఉన్న 3 అడుగుల బాబా పాలరాతి విగ్రహాన్ని, బాబా వస్తు ప్రదర్శన శాలలో ఉంచిరి.

గురుస్థానము ప్రతి రోజు ఉదయం 4 గంటలకు తెరుస్తారు. 4–35 నిముషములకు గురుస్థానమును శుభ్రపరచి, 4–45, 5–00 గంటల మధ్య గురుస్థానములోని పాదుకలు, శివలింగానికి అభిషేకము చేసి అనంతరం అలంకరిస్తారు. మధ్యాహ్నము 11–45 నిముషములకు మరల గురుస్థానము శుభ్రము చేసి నివేదన సమర్పిస్తారు. తిరిగి సాయంత్రం 4గంటలకు గురుస్థానము శుభ్రపరచి, దీపములలో నూనె పోసి వత్తి సరిచేస్తారు. సమాధి మందిరములో జరిగే సాయంత్రం హారతికి 5 నిముషాలముందు గురుస్థానములో పూజ చేసి, నివేదన సమర్పిస్తారు. రాత్రి 10గంటలకు గురుస్థానము మూసివేస్తారు.

లక్షలాది మందిని శుభ్రమైన మార్గములో నడిపించటానికి మన మధ్య అవతరించిన దత్త స్వరూపుడు, జగద్గురువు అయిన శ్రీ శిరిడీ సాయినాధుడు తన రూపంగా గురుస్థానములో ప్రతిష్ఠింపచేసిన పాదుకల దర్శనము ద్వారా, దాని చుట్టూ ప్రదక్షిణలద్వారా మన నడక, నడత సరియైన పథంలోసాగి జీవిత గమ్యం చేరగలము. 2022 సంవత్సరము శ్రావణపౌర్ణమికి గురుస్థానములో పాదుకలు ప్రతిష్ఠించి నేటికి 111వ సంవత్సరములోనికి అడుగిడుతున్న తరుణంలో గత 27 సంవత్సరాలుగా శ్రీదత్తావతారుల, అవధూతల, మహాత్ముల పాదుకలు, వారి దివ్య వస్త్ర, వస్తు సముదాయము అన్నీ ఒక్కచోట చేర్చి, సద్గురువుల పాదుకామహోత్సవము శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు నిర్వహించగలుగుతున్నది అంటే అది సద్గురువు అనుగ్రహమే. అంతే కాకుండా రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో కూడ పాదుకామహోత్సవాలు నిర్వహించి, అనాది సిద్ధమై, దత్త సంప్రదాయములో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న పాదుకల విశిష్టతను తెలియచేసే మహద్భాగ్యం మాకు కలిగింది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో అనేక ప్రదేశాలలో నిర్వహించిన సద్గురువుల పాదుకామహోత్సవాలకి విచ్చేసిన లక్షలాదిమంది భక్తులు సాయి స్వరూపాలయిన అంతమంది పాదుకలను ఒక్కచోట దర్శించి, స్పర్శించి పునీతులయి పరవశించారు. అదే బాబా మాకు ప్రసాదించిన అద్భుతవరం.


గురుస్థానములో పాదుకలు ప్రతిష్ఠించి నేటికి 110 సంవత్సరాలు పూర్తి అయ్యిన సందర్భముగా, ఆంధ్రదేశములో గత 27 సంవత్సరాలుగా సద్గురువుల పాదుకామహోత్సవము నిర్వహిస్తున్న శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు పవర్‌సిటీలోని 'శ్రీసద్గురుపాదుకాక్షేత్రం'లో ఆగష్టు 13, 14 మరియు 15 తేదీలలో అత్యంత వైభవోపేతంగా 28వ సద్గురువుల పాదుకామహోత్సవము నిర్వహించ తలపెట్టటమయినది. ఆ సందర్భముగా సద్గురువుల చరణ సన్నిధిలో, క్షణ క్షణం ఆధ్యాత్మిక ఆనంద సౌరభాలను ఆస్వాదిస్తూ, సద్గురువు కృపకు పాత్రులవుతూ, జీవితాన్ని సార్ధకత చెందించుకునే విధంగా కార్యక్రమాలు రూపుదిద్దటం జరిగింది. దూర ప్రాంతాలనుంచి విచ్చేసే వారికి మూడు రోజులు ఉచిత భోజన, వసతి కూడ ఏర్పాటుచేయటము జరుగుతున్నది. రండి, తరలిరండి మహాత్ముల చరణ మార్గంలో కలసి సాగుదాము, తరిద్దాము.

**(గురుస్థానములో పాదుకాపతిష్ఠ జరిగి
111వ వసంతములోనికి అడుగిడుతున్న
శుభ సందర్భముగా ప్రత్యేక వ్యాసం)**

రచన, సేకరణ : **వి.వి. పూర్ణచంద్రరావు**

# షేగామ్ - శ్రీ గజానన్ మహరాజ్

"మా సంప్రదాయమే వేరు, మేము చెవిలో ఉపదేశించమని" బోధించటమే కాకుండా, ఆద్యంతాలు లేని ఈ పాదాలు పరమ పవిత్రమైనవి. వాటిని ఆశ్రయించిన వారిని, శరణుజొచ్చిన వారిని నిరంతరము కాపాడుటయే మా కర్తవ్యము" అన్న శ్రీసాయి సూక్తిలోని అంతర్యాన్ని సద్గురువుల భక్తి వాత్సల్యము, వారి స్వప్నాదేశాలు, దత్త సాంప్రదాయములోని పాదుకల ప్రాశస్త్యాన్ని తెలియజేసే, శిరిడీ సాయికి సమకాలికులై, సద్గురువు కూటమికి చెంది మహారాష్ట్రలోని షేగాంలో కొలువైన శ్రీ గజానన్ మహరాజ్ చరిత్రలోని ఒక అద్భుత లీలను ఇక్కడ ప్రస్తావించుకుందాము.



మహరాష్ట్రలో ''ముడ్‌గాంవ్'' అనే ఊరిలో గజానన్ మహరాజ్ పట్ల అచంచల భక్తి విశ్వాసములు కల 'పుండలీకుడు' అనే భక్తుడు ఉండేవాడు. అతని దగ్గరకు ఒకసారి పూజలు, వ్రతాలు మంత్రాలు అంటూ తిరిగే 'భాగాభాయి' అనే కపట భక్తురాలు వచ్చి "ఏమయ్యా నీకు పిచ్చా, ఏమిటి?" ఎప్పుడో ఒకసారి నీకు జ్వరం తగ్గించాడని, గుడ్డలు విడిచేసి 'గిణ గిణ గిణాంత బోతే' అంటూ పిచ్చివాడులా షేగాంలో తిరిగే ఆయన్ని పట్టుకొని గురువు అని వెంటబడి తిరుగుతున్నావు. గురువు అంటే ఎలా వుండాలి? మహజ్ఞాని, శాస్త్ర చింతామణి అయి, ఆచార వ్యవహారాలు తెలిసి, సంకీర్తనాకారుడై, మంత్రోపదేశము చేసే జ్ఞాన ఖనియై ఉండాలి. అంతేకాని 'గిణ గిణ' అంటూ తిరిగే ఆ 'గజానన్' గురువేమిటి. నీ కెప్పుడయినా అసలు మంత్రోపదేశము చేశాడా? మంత్రోపదేశము చేయనివాడు గురువేమిటి, ఉపదేశము పొందనివాడు శిష్యుడేమిటి నీ జన్మ వ్యర్థం చేసుకుంటున్నావు. నామాట విని నాతోరా "అంజనగాం"లో విడిది చేసిన మా గురువు గారు "కోబాజీ యోగి", శిష్యుల చేత నీకు మంత్రోపదేశం చేయిస్తా. రేపు ప్రొద్దునే బయలు దేరుదాము సిద్ధంగా ఉండమని చెప్పి పుండలీకుడి చేత సరేననిపించి వెళ్ళింది భాగాభాయి. వ్యాకులత చెందిన మనస్సుతో మర్నాటి ప్రొద్దున్న పొందే మంత్రోపదేశము గురించి ఆలోచిస్తూ నిద్రపోయిన పుండలీకుడికి తెల్లవారు జామున ఒక కల వచ్చింది. ఆ కలలో శ్రీ గజాననలు కనిపించి "ఏమిటి రేపు "అంజనగాం"లో ఉన్న "కాశీనాథ్" అనే ఆయన దగ్గరకు మంత్రోపదేశం కొరకు వెళుతున్నావా! వెళ్ళు అక్కడికి వెళితే నీ భ్రాంతి తొలగి పోతుందిలే.చెవులో మంత్రం ఊదేసినంత మాత్రాన గురువు అయిపోతారా! ప్రొద్దున లేచిన దగ్గర నుండి ఎంతమంది ఒకరి చెవులలో ఒకరు ఎన్ని చెప్పుకోవటం లేదు. అంతమాత్రాన గురువయి పోతారా! అట్లాంటి వాటికి మోసపోకు పుండలీక! నీకు చెవిలో చెప్పాలా! చెవి ఇటు పడేయి. ఇదిగో మంత్రం "గణ గణ" అంటూ అనేసి, అట్లా చూస్తూ ఉండిపోయారు స్వామి. శ్రీ గజాననల చూపులోని శక్తికి పరవశుడైన పుండలీకుడు స్వామి పాదాలను ఆశ్రయించాడు. "ఇప్పుడు చెప్పు పుండలీక నీకు ఏమి కావాలో అది ఇస్తాను" అన్నారు గజాననలు. "స్వామి మీ పాదసేవే చాలు నాకు నిరంతరము వాటిని విడువక, ఆశ్రయించి ఉండేలా అనుగ్రహించండి. అందుకు ఆలంబనగా నిత్యమూ పూజించుకోవటానికి మీ పాదుకలివ్వండి స్వామి" అని వేడుకున్నాడు పుండలీకుడు. **"ఇదిగో ఈ పాదుకలు తీసుకొని రేపు మధ్యాహ్నము నుంచి పూజ ప్రారంభించు"** అని అంటూ తన పాదుకలు తీసి ఇచ్చారు స్వామి. అందుకోవటానికి చేతులు చాపేడు పుండలీకుడు. వెంటనే మెలకువ వచ్చింది. ఆనంద పారవశ్యంతో తబ్బిబ్బు అయినాడు. ఇక ఎక్కడికీ వెళ్ళనక్కరలేదు. ఏ మంత్రోపదేశము వద్దు స్వామి పాదాలే రక్షనాకు అనుకున్నాడు పుండలీకుడు. తెల్లవారిందాకా పూజకు పాదుకలు ఎక్కడినుంచి తీసుకురావాలా అని ఆలోచిస్తూ గడిపివేశాడు. ఉదయం వచ్చిన భాగాభాయికి తాను 'అంజనగావే' కాదు ఇంక ఎక్కడికీ రానని శ్రీ గజానన్‌లే తన గురువని చెప్పి పంపివేశాడు. ఇక పాదుకల గురించి ఆలోచిస్తూ ఏం చేయాలా అనుకుంటూ బజారులోకి వచ్చేడు పుండలీకుడు.

అదే సమయంలో షేగాం నుంచి ''మేడ్‌గాంవ్''కు బయలుదేరిన "ఝూమసింగ్"అనే వ్యక్తికి స్వామి గజాననలు తన పాదుకలిచ్చి 'ముడ్‌గాంవ్'లోని పుండలీకుడికి పూజ నిమిత్తమై ఇవ్వమని చెప్పి పంపేరు. 'ముండ్‌గాంవ్' వచ్చి పుండలీకుడి గురించి వెతుకుతున్న ఝూమ్‌సింగ్‌కు పుండలీకుడు ఎదురై మీరు షేగాం నుంచి వస్తున్నారు కదా స్వామి నాకేమైనా ఇచ్చారా! అని అడిగేడు. ఎందుకట్లా అడుగుతున్నారు అన్న ఝూమ్‌సింగ్‌తో పుండలీకుడు తన కల వృత్తాంతమంతా వివరించాడు. విని ఆశ్చర్యపోయిన ఝూమ్‌సింగ్, తన సంచిలోంచి, స్వామి పుండలీకుడికి ప్రసాదించిన పాదుకలు తీసి ఇచ్చాడు. అవి చూసి పుండలీకుడి కళ్ళవెంట ఆనందబాష్పాలు కారినయ్యి. అపుడు మధ్యాహ్న సమయమయింది. వాటిని తీసుకున్న వెంటనే ఇంటిలో ఉంచి నిత్యము పూజించసాగేడు పుండలీకుడు. నేటికి అవి "ముడ్‌గాంవ్"లో పుండలీకుడి ఇంట్లో దర్శించవచ్చు. అది స్వామి వారి పాదుకోపదేశము.

''నన్ను ఆశ్రయించిన వారిని శరణుజొచ్చిన వారిని నిరంతరము కాపాడుటయే నా కర్తవ్యము అన్న సాయి సూక్తికి ప్రత్యక్ష నిదర్శనమే కాకుండా, సద్గురువు ప్రసాదించే స్వప్నము ఫలితం ఎలా ఉంటుందో అన్న దానికి ప్రతీక ఈ సంఘటన.

(సెప్టెంబరు 1వ తేదీ (ఋషిపంచమి) శ్రీ గజానన్ మహరాజ్ ఆరాధనోత్సవము మరియు ఆగష్టు 13, 14 మరియు 15 తేదీలలో జరిగే శ్రీ సద్గురువుల పాదుకామహోత్సవము సందర్భముగా ప్రత్యేక వ్యాసము)

రచన : **"శ్రీమతి వి.యస్. లక్ష్మి"**

# సద్గురువుల పాదుకామహోత్సవము - పవర్‌సిటీ

"బ్రహ్మ కడిగిన పాదము, బ్రహ్మము తానైన పాదము అన్నారు అన్నమాచార్యులు".

"పదములే చాలు రామా "నీ పద ధూళియే పదివేలు" అన్నారొక కవి. అయోధ్యా సింహాసనాన్ని అధిరోహించి 14 సంవత్సరాలు పాలించింది రామ పాదుకలే.

కలియుగములో శ్రీదత్తాత్రేయుడి ప్రథమ అవతారము శ్రీపాదశ్రీవల్లభులు 13వ శతాబ్దములో తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురములో జన్మించగా, ఆ విషయము మరచిపోయిన మనలకు గుర్తుచేసి శ్రీ పాద వల్లభుల జన్మస్థానములో స్థానిక కుక్కుటేశ్వరాలయములో పాదుకలను ప్రతిష్ఠించారు, దత్తాంశ సంభూతులైన శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామివారు. శ్రీపాద వల్లభులు, తపో భూమి అయిన కురువపురములో తపస్సు చేసిన ప్రదేశములో ప్రతిష్ఠించినది పాదుకలే. రెండవ దత్తావతారమైన శ్రీ నరసింహ సరస్వతి స్వామి వారి జన్మ స్థానము కరంజా (మహారాష్ట్ర)లో మందిరములోనూ పాదుకలు ప్రతిష్ఠించారు. స్వామి వారు తపస్సు చేసిన నర్సోబావాడిలో మేడిచెట్టు క్రింద శ్రీ గురుడే స్వయంగా పాదుకలను ప్రతిష్ఠించి, అవి నా స్వరూపమని చెప్పేరు. శ్రీ గురుడి లీలా విలాసములకు కేంద్రమైన గాణ్గాపురములో తమ అవతారం పరిసమాప్తి చేయటానికి శ్రీశైలం బయలుదేరే ముందు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తన భక్తులను చూసి, "స్థూల దృష్టికి మాత్రమే మేము శ్రీశైలము వెళుతున్నాను గాని, నిజానికి మా ప్రతి రూపాలుగా ఇక్కడ ప్రతిష్టిస్తున్న పాదుకల రూపంలో ఎప్పుడూ ఇక్కడే ఉంటాము" అని "ఎవరైతే మా పాదుకలను పూజించి, హారతిచ్చి పవిత్రమైన మనస్సుతో, ఏది కోరితే అది తప్పక నెరవేరుతుందని" వాగ్దానము చేసిన శ్రీ గురుడు, నేటికి గాణ్గాపురములో కొలిచిన వారికి కొంగుబంగారమై పాదుకల రూపంలో దర్శనమిస్తున్నారు.

మూడవ అవతారమైన మాణిక్య ప్రభువు సంస్థానములో అర్చన జరిగేది పాదుకలకే. ఇక నాల్గవ దత్తావతారమైన శ్రీ అక్కల్‌కోట స్వామి ఎంతోమందికి స్వయముగా పాదుకలను ప్రసాదించటము వారి చరిత్రలో చూస్తాము. అక్కల్‌కోట స్వామి నోటి నుండి కూడ పాదుకలను తీసి ప్రసాదించిన సంఘటన వారి చరిత్రలో కలదు. స్వామి వారి చర్మ పాదుకలను ఇప్పటికీ నిత్య నీరాజనాలందు కుంటున్నాయి. ఆ పాదుకల రూపంలో తామే అందరినీ అనుగ్రహిస్తామని స్వామి తెలిపేరు. ఆంధ్రదేశములో దత్త సంప్రదాయ ప్రాముఖ్యాన్ని వెల్లడి చేసిన భరద్వాజగారు, సమాధి చెందే కొంత సమయానికి ముందు శ్రీ స్వామివారి ఆజ్ఞ మేరకు స్వామి సేవకులు అయిన శ్రీ చోళప్ప ముని మనమడు, అక్కల్‌కోట స్వామివారి పాదుకలను ఒంగోలు తీసుకొని రావటం ఒక అద్భుతమైన లీల.

ఐదవ దత్తావతారమైన శ్రీ సాయినాధులు, శిరిడీలో మొట్టమొదట ప్రకటమైన గురుస్థానమనే వేపచెట్టు క్రింద పాదుకలను ప్రతిష్ఠించటము జరిగింది. సాయి ఆ పాదుకలను తాకి ప్రతిష్టకు తన అనుమతి ఇవ్వటం జరిగింది. ఏ రాతి బండపై కూర్చుని సాయి తన భక్తులను ఆశీర్వదించారో ఆ రాతి బండపై పాలరాతి పాదుకలు ప్రతిష్ఠించారు. మశీదులో ఉన్న పాదుకలను స్పృశించి పరవశించి పోతాము. సాయి సన్నిధి అత్యంత వైభవంగా నాటి నుండి నేటి వరకు జరుగుతున్న చావడి ఉత్సవంలో పల్లకీలో సటకాతో పాటుగా ఊరేగించేది సాయి చర్మ పాదుకలే. ఇట్లా చెప్పుకుంటూ పోతే ఇంకా ఎన్నో ఎన్నెన్నో. అది చర్మంతో చేసినా, చెక్కతో చేసిన వెండితో చేసినా ఏవయినా అవి ఆయా దత్తావతారుల, మహాత్ముల స్వరూపానికి ప్రతీకలయిన పాదుకలు. అయితే పాదుకలకు ఎందుకంత ప్రాముఖ్యత? మనిషి యావత్ శక్తిని పాదాలను ఆధారముగా చేసుకొని నిలబడతాడు. మనిషిలో ప్రతి అవయవము వాటి వాటి పని చేస్తున్నా, వాటన్నింటిని ఒక చోట నుండి మరొక చోటుకు ఆ శరీరాన్ని మొత్తము ముందుకు నడిపించాంటే పాదాలే ముఖ్యము. జీవితములో స్థిరత్వము కుదిరిన వ్యక్తిని "వాడి కాళ్ళమీద వాడు నిలబడ్డాడు" అంటాము. ఆ కాళ్ళు స్థిరముగా ఉండాలంటే వాటి అడుగు భాగమైన పాదాలే దిక్కు. మనిషి నడక నేర్వాలన్నా పాదాలే ముఖ్యము. మండు వేసవిలో కాళ్ళు కాలకూడదంటే చెప్పులు అవసరము, చలిలో కాళ్ళకు రాళ్ళు గుచ్చుకొని నొప్పిపుట్టకూడదంటే చెప్పులే అవసరము. సర్వకాల సర్వావస్థలయందు తప్పటడుగు వేస్తూ నడిచే మన పాదరక్షలకే అంత ప్రాముఖ్యం ఉన్నప్పుడు "లక్షలాది మందిని శుభ్రమైన మార్గములో నడిపిస్తాను" అనటమే కాక, ప్రపంచాన్నే నడిపిస్తూ ఉత్తమమైన "నడత" నేర్పుతూ ఆధ్యాత్మిక పథంలో మనల్ని ముందుకు నడిపించే సద్గురువు పాదాలకే రక్ష కలిపించే పాదరక్షలకి ఇంకెంత ప్రాముఖ్యం ఉంటుందో ఆలోచించండి. అందుకే దత్త సాంప్రదాయములో పాదుకలకు అంత ప్రాముఖ్యత వచ్చింది. జాలరి వలవేసినప్పుడు అతని పాదాల వద్దనున్న చేపలు తప్ప, దూరముగా విసిరిన ఆ వలకు గల ఎరను ఆశించి చేపలు వలలో చిక్కుబడి మరణిస్తాయి. అయితే జాలరి పాదాల చెంత ఉన్న చేపలు ఆ వలలో పడకపోవటంతో అవి రక్షించబడతాయి. ఎవరయితే సద్గురువు పాదాలను ఆశ్రయించి ఉంటారో వారు "కలి" విసిరే మాయాజాలమనే వలలో చిక్కబడక రక్షింపబడుదురు. అందుకని సద్గురువును ఆరాధించేవారికి, ఆ సద్గురువు పాదాలకే రక్ష కలిగించే పాద రక్షలే (పాదుకలు) శరణ్యము.

మొట్టమొదట సారిగా 1995వ సంవత్సరము శ్రావణ బహుళ విదియ రోజున, పూజ్య ఆచార్య భరద్వాజ గారికి మార్గ నిర్దేశకులై, భరద్వాజగారు వివాహితులై మనందరి మధ్య నిలవటానికి కారణమై, గిరిజనుల పాలిట దైవమైన యోగిరాజు శ్రీ దామరాజు వెంకట్రామ యోగింద్రులు (పాకలపాటి గురువుగారు) పాదుకల రూపంలో విశాఖపట్నంలోగల శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు ప్రాంగణమునకు రావటం జరిగింది. ఆ

సేతు హిమాచల పర్యంతము పర్యటించి, కొండలు కోనలు దాటుతూ దుష్ట శక్తులను అణగ ద్రొక్కి, ఆర్తుల పాలిట ఆరాధ్యదైవమై, నర్సీపట్నములో సమాధిగ్రస్తులైన శ్రీ పాకాలపాటి గురువుగారి పాదుకల రాకను పురస్కరించుకొని ఆనాడు పాదుకా మహోత్సవము నిర్వహించడం జరిగింది. నాటి నుండి ఎందరెందరో మహనీయులు, అవధూతలు, పాదుకల రూపంలోను, బాహ్యముగాను వచ్చి భక్తులను ఆశీర్వదిస్తున్నారు. గత 27 సంవత్సరాలుగా శ్రావణ బహుళ విదియ రోజున (శ్రావణ బహుళ విదియ తిథికి ఇంకొక విశేషముంది. ఆరోజే శ్రీ గురురాఘవేంద్ర ప్రభువుల ఆరాధనోత్సవము) సద్గురువుల పాదుకా మహోత్సవము నిర్వహించబడుతున్నది. దత్త సంప్రదాయములో అత్యంత ప్రాముఖ్యత కలిగిన పాదుకలను పురస్కరించుకొని జరిగే పాదుకామహోత్సవము ఆంధ్రదేశము మొత్తము మీద, గత 27 సంవత్సరాలుగా ఒక్క శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు ఆధ్వర్యములోనే జరుగుతున్నదంటే అతిశయోక్తి కాదు. అది సద్గురువుల కృపానుగ్రహ ప్రతిరూపము. పాదుకామహోత్సవము సందర్భముగా శ్రీ శిరిడీసాయిబాబా పాదుకలు, కఫ్నీ, చిలుము, శ్రీ అక్కల్‌కోట స్వామి, శ్రీ తాజుద్దీన్ బాబా మొదలైన దత్తావతారులు, అవధూతలు, మహాత్ములు పాదుకల రూపంలో విచ్చేసి భక్తులను అనుగ్రహిస్తున్నారు.

ఈ సంవత్సరము (2022) జరిగే పాదుకామహోత్సవమునకు ఒక విశిష్టత ఉన్నది. శ్రీ సాయిబాబా శిరిడీలో మొట్టమొదట ప్రకటమైన గురుస్థానము దగ్గర 1912వ సంవత్సరము శ్రావణ పౌర్ణమి నాడు శ్రీ ఉపాసనీబాబాచే పాదుకలు ప్రతిష్ఠించి నేటికి 110 సంవత్సరాలు పూర్తి అవుతున్నది, అంతేకాకుండా ఈ సంవత్సరము జరిగే పాదుకామహోత్సవమునకు ఒక ప్రాధాన్యత కలదు. గత 27 సంవత్సరాలుగా వసతిగృహము(అద్దె ఇల్లు) కేంద్రముగా చేసుకొని, ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా రాష్ట్రేతర ప్రాంతాలలో కూడ పాదుకా మహోత్సవాలు నిర్వహిస్తున్న శ్రీ శిరిడీసాయిసేవాట్రస్టు 28వ పాదుకా మహోత్సవాన్ని విశాఖపట్నం- పరవాడ మండలంలోని పవర్‌సిటీలోని స్వస్థలములో నూతనముగా నిర్మించబడిన 'శ్రీ సద్గురు పాదుకాక్షేత్రం'లో నిర్వహించబోతున్నది. అంతేకాకుండా 'శ్రీసద్గురుపాదుకాక్షేత్రం ప్రారంభించిన 6 నెలలకే శ్రీ సమర్థ రామదాసు పాదుకలు, శ్రీ గాడీతాతా పాదుకలు (కర్ణాటక) అవధూత శ్రీ కాశిరెడ్డినాయన పాదుకలు, శ్రీ మాణిక్యేశ్వరి మాత పాదుకలు (యానగొండి - కర్ణాటక), సజ్జనఘడ - శ్రీరామస్వామి పాదుకల రూపంలో విచ్చేసి శ్రీపాదుకాక్షేత్రములో కొలువై ఉండటమే కాకుండా, కర్ణాటక హంపి విజయ నగరంలోని కిష్కందక్షేత్రము వద్దగల శ్రీ ఆదిపరాశక్తి శ్రీదుర్గామాత ఉపాసకులైన శ్రీ బ్రహ్మానందస్వామి దేవిపూజకు ఉపయోగించే కమండలుపాత్ర సద్గురుపాదుకాక్షేత్రమునకు బహుకరించటం శ్రీ దత్తసాయి భరద్వాజుల కృపానుగ్రహమునకు నిదర్శనము. 2022 ఆగష్టు 13, 14, 15 తేదీలలో జరిగే అరుదైన, అనిర్వచనీయమైన, క్షణ క్షణమూ సాయి కృపాకటాక్ష వీక్షణాలలో ఓలలాడే శ్రీ సద్గురువులపాదుకా - సమ్మేళనమునకు అందరికీ ఇదే పేరు పేరునా మా హృదయ పూర్వక ఆహ్వానము.

(2022 ఆగష్టు 13, 14 మరియు 15వ తేదీలలో శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు, పవర్‌సిటీ, విశాఖపట్నం వారి ఆధ్వర్యములో జరిగే 28వ సద్గురువుల పాదుకామహోత్సవము సందర్భముగా సమర్పించిన ప్రత్యేక వ్యాసము)

ఇట్లు

**28వ శ్రీ సద్గురువుల పాదుకామహోత్సవ ఆహ్వానకమిటీ**
**పవర్‌సిటీ**

## శ్రావణపూర్ణిమ - ఉపాకర్మ

ఋతువులను అనుసరించి ప్రతి కార్యమును ప్రారంభించుటకు భగవదనుగ్రహముగా ఋషులు శాస్త్ర ప్రమాణములను ఏర్పరచి మనకందించారు. శాస్త్ర ప్రమాణముల ఆధారముగా పూర్వాచార్యులు ఏయే కాలముందు ఏమి జరుపుకోవాలో ఆ కాలమునందు వాటిని నిర్ణయించారు. అందులో భాగంగా విద్యారంభ కాలమునకు శ్రావణ పూర్ణిమ తగినదిగా గుర్తించి వారాచరించి మనల్ని ఆచరింపచేశారు. ఈ రోజునే అధ్యాయోపాకర్మయే ఉపాకర్మ అనిసంగ్రహముగా వ్యవహరిస్తారు. అధ్యాయోపాకర్మ అనగా నేమి? అధ్యాయోపాకర్మ అనగా వేదాధ్యయన ప్రారంభము అధీయతే యః సోద్యాయః వేదః తస్యోపార్మ, ఉపక్రమః అని వ్యుత్పత్తి. ఇది నూతనాధ్యయనమే కాక ధారణాధ్యయనమును (ధారణాధ్యయమనగా ధరణ కోసము ఆవృత్తి చేయుట) ఈ నాడు ప్రాతః కాలమునందు మేల్కొని నిత్యకర్మలైన ప్రాతః సంధ్యావందనమాచరించి అధ్యాయోపాకరణోత్సవర్జనాంగ భూతమైన కామోకార్షీన్ అను మంత్రాన్ని జపించవలయును. "కామోకార్షీన్ మన్యుర కార్షీన్ నమో నమః" అనునది మంత్రము. శ్రావణ పూర్ణిమ నూతనాధ్యాయన కాలము అయినట్లు ఇంతకు పూర్వము గల లోపములకు ప్రాయశ్చిత్తముగా నిర్వర్తించబడుచున్నది, నేను చేసిన లోపములన్నియు కామక్రోధముల వలన చేసినవే, లోపములు కలిగించునది కామమే! నేను చేసెడివాడను కాదు, చేయించెడివాడను కాను, అని ఆత్మ పరిశీలన చేసికొను మంత్రమందురు.

ఈ మంత్రమును 1008 లేదా 108 మార్లు జపించి తదుపరి మధ్యాహ్నకాలమునందు అందరు కలసి నదికి లేదా తటాకమునకు వెళ్ళి స్నానాది కత్యములను ఆచరించి నూతన యజ్ఞోపవీతములను మౌంజ్యినములను ధరించిన తదుపరి కాండఋషి తర్పణము లాచరించి వేదాధ్యన ఉపక్రమమునకు చిహ్నముగా చతుర్వేదములలో ఆద్యంత ఋక్కులను ఉపనిషత్తులలోని ఆద్యంత వాక్యములను పఠించి గృహానికి వచ్చి అధ్యయన హోమమును ఆచరించవలయును. మరునాడు ఉపాకర్మాంగ భూతము 1008 మార్లు గాయత్రి జపము అనుష్ఠించి గాయత్రీ హోమము చేయడం ఉపాకర్మ విధానము.

# హజరత్ బాబా నిజాముద్దీన్ ఔలియా

భారతదేశములో సూఫీ సంప్రదాయములో అత్యుత్తమైన స్థానము పొందిన అరుగురు సూఫీ మహాత్ములలో హజరత్ బాబా నిజాముద్దీన్ ఔలియా ఒకరు. లక్షలాది మంది ఔలియా గారిని ఆశ్రయించి లౌకిక పారలౌకికమైన కోరికలు తీర్చుకునేవారు. వారి భక్త బృందములో సామాన్యులే కాక, దివాన్లు, మహరాజులు, మంత్రులు కూడా ఉండేవారు. లక్షాధికారులు వారి పాదాల చెంత విలువైన కానుకలు ఎన్ని ఉంచినా, తనను ఆశ్రయించిన వారికి, వారి వారి అవసరాలననుసరించి ఉదారంగా పంచిపెట్టి, తాను సామాన్యమైన భిక్షువుగానే ఔలియా గారు జీవించేవారు. సద్గురువు అయిన ఔలియా గారి కృపాదృష్టికోసం ఎందరెందరో పడిగాపులు కాచేవారు, వారి కంటి చూపు తమపై పడిన, వారి అమృతహస్తం తమను తాకిన, జన్మ తరించిపోయింది అని భావించేవారు, ఎందరెందరో ఉండేవారు. అటువంటి సద్గురువు పాదాలకు రక్ష అయినటువంటి పాదరక్షలే లభిస్తే లభించిన వాని భాగ్యము చెప్పతరమా!



"వీళ్ళకు పిచ్చా, వెఱ్ఱా చెప్పులు చేతులతో పట్టుకోవటం, తలపై పెట్టుకోవటమే కాక, పిచ్చి ముదిరి ఆ చెప్పులకు పూజలు కూడ చేస్తున్నారు" అనే వారికి సమాధానముగా "హజరత్ నిజాముద్దీన్ ఔలియా" గారి సన్నిధిలో జరిగిన ఒక అద్భుత సంఘటన ప్రస్తావించుకుందాము.

తనను ఆశ్రయించిన వారి కష్ట నష్టాలు ఎరిగి ఆదుకోవటమే కాక, నిత్యము వేలాదిగా తనకు భక్తులు సమర్పించుకునే వేలాది రూపాయలను మొత్తం పేదలకు పంచిపెట్టే ఔలియా గారి ఔదార్యము గురించి విని, ఒక పేదవాడు ఔలియాగారిని ఆశ్రయించి, వారి పాదాలపై పడి "స్వామి నా కుమార్తెకు పెండ్లి వయస్సు వచ్చింది. చెప్పులు కుట్టుకొని జీవించే నా దగ్గర పెండ్లి చేయటానికి చేతిలో చిల్లిగవ్వ కూడ లేదు. మీరు పేదల పాలిట పెన్నిది, దయార్ధ్ర హృదయులు, ఉదారులని, నిత్యము వేలాది రూపాయలు దానము చేసే మీ ఔదార్యము విని మిమ్మల్ని, మీ పాదాలను ఆశ్రయించాను. వాటిలో ఏ కొద్దిపాటి దక్షిణ అయినా నాకు ప్రసాదించి, నా కుమార్తె వివాహము వైభవోపేతముగా జరిపించి, నా బాధ్యతను సక్రమముగా నెరవేర్చుకునే శక్తిని ప్రసాదించమని" ఆర్తితో వేడుకొన్నాడు.

అతని ఆర్తిని చూసి, దయార్ధ హృదయులైన ఔలియా గారు "పిచ్చి వాడా! నీవేమన్నా నన్ను మేడలు మిద్దెలు అడిగేవా, నీ బాధ్యత నెరవేర్చుకోవటానికి నీ కుమార్తె వివాహమై ఒక రోజున ఇక్కడకు వచ్చే దక్షిణలో కొంత అడిగేవు. అంతేకదా! అంతమాత్రానికి బాధ ఎందుకు. పెళ్ళి వంటి శుభకార్యానికి ఒకరోజు దక్షిణలో కొంత భాగమేమిటి, ఇక్కడ మూడురోజులుండు, ఈ మూడు రోజులలో ఎవరేమి సమర్పించినా నీకే ఇస్తాను. తీసుకొని వెళుదువు గాని సంతోషముగా ఉండు" అని అన్నారు నిజాముద్దీన్ ఔలియా గారు. ఆ మాటలకు మహదానంద పడిపోయినాడు అతడు. మర్నాడు తెల్లవారింది నిరంతరము ఔలియాగారి దర్శనార్ధము వచ్చే భక్తులతో, వారు సమర్పించుకునే కానుకలతో నిండి ఉండే నిజాముద్దీన్ ఔలియా గారి సన్నిధికి, అదేమి చిత్రమోగాని ఒక్కరు కూడ రాలేదు. గంటలు రోజులుగా మారి, మూడవరోజు కూడ గడుస్తున్నది. ఔలియా గారి దర్శనానికి ఎవరూ రాలేదు. కానుకలు అసలే రాలేదు. ఆ మూడు రోజులు ఆ పేదవాడిలో స్వామిపై నమ్మకం వీసమెత్తు కూడా సడలక ఔలియాగారి పాదాలపై దృష్టిని నిలిపి నిరంతరము వాటిని ధ్యానిస్తూ ఉండిపోయాడు. మూడవరోజు సాయంత్రం అవుతున్నది అప్పుడు అతను స్వామి పాదాలపై పడి "స్వామి నేనెంత దురదృష్ట జాతకుడిని కాకపోతే నిరంతరము అసంఖ్యాకముగా మిమ్ములను దర్శించుకునే భక్తులు ఒక్కరు కూడ రాకపోవటమే కాకుండా, వేలాది రూపాయలు కానుకలు పంచిపెట్టే మీ చేతి ద్వారా కొద్దిపాటి కానుకలు కూడా నేను అందుకోలేకపోయినాను. నా వంటి దురదృష్టమంతుడు మరొకడుండడు. నాబోటివాటు ఇక్కడ ఉండటము వల్లనేమో ఒక్క భక్తుడు కూడా మీ దర్శనాన్ని నోచుకోలేక పోయినాడు. నేను ఎంత నష్ట జాతకుడినో అర్ధమవుతున్నది, అయినా స్వామి, నావంటి అదృష్టశాలి మరొకరుండరు అని అనిపిస్తున్నది, మూడు రోజులపాటు ఏకాంతముగా మీ సన్నిధిలో అనుభవించిన ప్రశాంతత, పొందిన ఆనందము చెప్పనలవి కానిది. ఇది మరెవరికి లభించని అరుదైన అద్భుతమైన అదృష్టం, నాపాలిట మహావరం. స్వామి నేనెక్కడున్నా ఏమి చేస్తున్నా, మీ కృపాదృష్టి అలా నిరంతరము నాపై నిలిపి ఉంచండి చాలు'' అని బయలుదేరటానికి సెలవడిగిన అతనితో ఔలియాగారు "పిచ్చివాడా! మూడు రోజులపాటు ఏకాంతముగా లభించిన నా సన్నిధే–పెన్నిధి అని నీవు సంతోషపడుతున్నా, మూడు రోజుల పాటు ఇక్కడ ఉంచి, నీకు ఏమి ఇవ్వలేదని నేను బాధపడుతున్నాను. ఇక్కడకు వచ్చిన

వారికి ఏమీ ప్రసాదించకుండా ఇంతవరకు ఎవ్వరినీ పంపలేదు. నిన్ను మాత్రము ఒట్టి చేతులతో పంపుతానా? ఇదుగో నా దగ్గర మిగిలి ఉన్నది, నేను వాడగా వాడగా అరిగిపోయి పాతపడిన ఈ పాదరక్షలే. ఇవి నా సర్వస్వము, ప్రపంచములోని నా యావదాస్తి ఇవే, వీటిని నీకు ప్రసాదిస్తున్నాను. ఎక్కడైనా అమ్ముకుంటే కనీసం కొంతయినా ప్రతిఫలము రాకపోదు" అని తన చెప్పులు తీసి ఆ పేదవాడికి ఇచ్చారు ఔలియాగారు. స్వామి వారి ఔదార్యానికి, ప్రేమకు కరిగిపోయిన అతను స్వామి వారి పాదాలకు నమస్కరించుకొని, స్వామి ప్రేమతో ఇచ్చిన పాదరక్షలను కండువాలో మూటకట్టుకొని తలమీద పెట్టుకొని తన ఊరు బయలుదేరేడు. మార్గమధ్యములో ఎడారి దాటుతూ ఉండగా, ఒంటెలబారు కనిపించింది. ముందు ఒంటెపై ఆ ప్రాంతానికి గవర్నరుగారైన అమీరు ఖుస్రూ గారు, వారి వెనుక ఒంటెలపై అవి మొయ్యలేనంత బరువుతో బంగారపు ధనరాసులతో ఖుస్రూగారి పరివారము వస్తున్నారు. వాటిని అలా చూస్తూ ముందుకు సాగుతున్నాడు అతను. ఆ పేదవానిని దాటి కొంచెము ముందుకు వెళ్ళిన "ఖుస్రూ" గారు వెంటనే ఒంటెను దిగి పరుగెత్తుకుంటూ ఆ పేదవాని దగ్గరకు వచ్చి, అతనిని ఆపి "అల్లంత దూరాన్నించి నిన్ను చూస్తున్నాను నీ చుట్టు ఒక వెలుగు రేఖను చూసాను, అది నా భ్రాంతేమో అనుకున్నాను. అయినా నిన్ను దాటినప్పుడు వచ్చిన అద్భుతమైన పరిమళము నేనెన్నటికి మరవలేనిది. నీవెవరివి, ఎక్కడి నుంచి వస్తున్నావు ముందు నాకు చెప్పు" అని అడిగేరు అమీర్ ఖుస్రూగారు అంతటి గవర్నరు చిన్న పిల్లవాడిలాగా, ఆతృతగా, ఆరాటముగా అట్లా అడగటము చూసి ముందు బెదరినా ఆ తరువాత ధైర్యం కూడగట్టుకొని తనెవరో ఎక్కడినుంచి వస్తున్నారో చెప్పి, చూడండి అంటూ "ఔలియాగారు ఇచ్చిన పాదరక్షలు తప్ప ఇంకేమీ లేవూ" అంటూ మూటలోని వాటిని చూపించాడు ఖుస్రూగారికి. వాటిని చూస్తూనే తన్మయుడైపోయి ఆనంద బాష్పాలు కారుస్తూ ఆ పాదరక్షలను పదే పదే కళ్ళకద్దుకొని, తలమీద పెట్టుకొని తబ్బిబ్బు అవుతున్నారు ఖుస్రూగారు. చెప్పులు చూసి, పరవసించి పోతున్న ఖుస్రూగారిని చూసి ఆశ్చర్యపోయాడు ఆ పేదవాడు. ఇక ఉండబట్టలేక ఖుస్రూగారు అన్నారు "అహా! ఎంతటి అదృష్టవంతుడివి. అమూల్యమైన పాదరక్షలు సంపాదించి వెళుతున్నావు. ఎంతకాలము నుంచో నేను ఎదురు చూస్తున్నవి నీ దగ్గర ఉన్నాయి. ఇవి నీవు తీసుకెళ్ళి ఏమి చేసుకుంటావు నాకియ్యి, నీ కుమార్తె పెళ్ళికి కావలసినంత ధనము ఇస్తాను" అన్నారు ఖుస్రూగారు. అది విని విస్తుబోయాడా పేదవాడు. ఇంటికి తీసుకెళ్ళి బాగుచేసి ఏ పదో పరకో సంపాదిద్దామనుకుంటే పెళ్ళికి కావలసినంత ధనము ఇస్తానంటున్నాడు, ఏమిటి ఈయనకు పిచ్చా ఏమిటి అని ఆలోచనలో పడ్డాడు. అతని ఆలోచనలు చూసి ఖుస్రూగారు వెంటనే "నీకెంత ధనము కావాలో చెప్పు. అదుగో ఆ ఒంటెల బారు చూడు వాటిపై నేను కాబూల్‌ను జయించి, ఇనాముగా తీసుకు వస్తున్న బంగారపు మణుల రాశులున్నాయి. ముందు ఒంటె మీద ఉన్న నా జీవితావసరాలకు కావలసిన సామాన్లు, నావస్త్రాలు ఉన్నాయి అవి మినహా, మిగిలిన అన్ని ఒంటెలు, వాటిపైన ఉన్న ధనపురాసులు, పరివారము కూడ నువ్వే తీసుకుపో. ఆపాద రక్షలు మాత్రం నాకు ఇవ్వు అని, ఖుస్రూగారు చేతులు చాపటం, ఆ పేదవాడు ఆ పాదరక్షలు వారి చేతులలో ఉంచటము, ధనపురాశులతో తరలిపోవటము తృటిలో జరిగింది. వెంటనే ఆ పాదరక్షలు తలపై ఉంచుకొని వడివడిగా అమితానందముతో తన గురువైన నిజాముద్దీన్ ఔలియా సన్నిధి చేరిన ఖుస్రూగారు "ప్రభూ! ఇన్నాళ్ళకి నా జన్మ ధన్యమయింది. ప్రపంచమంతా జయించినంత ఆనందముగా ఉంది" అన్నాడు. "ఏమిటా విషయం ఎందుకా ఆనందము" అన్నారు ఔలియాగారు.

"ఏ గురువు నిరంతరము ఈ ప్రపంచాన్ని కాపాడుతూ పాలిస్తున్నాడో, ఏ ప్రభువు పాద స్పర్శకోసం రాజాధిరాజులు ఎదురు చూస్తుంటారో, ఎవరు నిరంతరము వెంటనుండి ఉన్నత పథంవైపుకు నడిపిస్తుంటారో, అటువంటి సద్గురువయిన మీ పాదాలకు రక్షణ కలిగిస్తూ మీ పాదాల స్పర్శ తగిలి పునీతమయిన ఆ పాదరక్షలు నేను సంపాదించాను స్వామి" అని బ్రహ్మానందముతో తాను పేదవాడి దగ్గర తీసుకున్న పాదరక్షలు ఔలియా గారికి చూపించాడు. అవి చూసి ఔలియాగారు చిరునవ్వు నవ్వి, "అవి సంపాదించటానికి ఎంత ధనము వెచ్చించావు" అని అడిగేరు. "ఈ ప్రపంచములో ఇంతవరకు నేను సంపాదించిన సర్వ సంపదలు సమర్పించి, అమూల్యమైన ఈ పాదరక్షలు సంపాదించుకున్నాను ప్రభూ" అన్నాడు ఖుస్రూ. "ఈ ఆధ్యాత్మిక ప్రపంచాన్ని నడిపించే ప్రభువులైన వారి పాదాలను ఒక్కసారి తాకితేనే జన్మధన్యమైపోతుందే! అటువంటి ఆ పాదాలను నిరంతరం అంటిపెట్టుకున్న పాదరక్షలను పొందటానికి ఈ ప్రపంచములోని సంపదంతా కూడ సరిపోదే, అటువంటిది నీ ఒక్కడి సంపాదనంతా వెచ్చించి పాదరక్షలను సంపాదించావు అంటే చాలా చౌకబేరమే చేశావు. అయినా అది నీ గొప్ప తనమనకుంటున్నావా! నా సంకల్పము వల్లనే అవి నీకు లభించాయి. నిష్కలంక భక్తితో, అచంచలమైన విశ్వాసముతో ఉండినందుకు ఆ పేదవాడికి అతను కోరిన ధనము లభించింది. నిష్కామంగా సేవిస్తున్న నీకు నీవు కోరిన పాదరక్షలు దొరికినయ్యి" అని చిరునవ్వు నవ్వేరు హజరత్ బాబా నిజాముద్దీన్ ఔలియా గారు. (శిరిడీలోని గురుస్థానములో పాదుకలు ప్రతిష్టించి 111వ వసంతములోనికి అడుగిడుతున్న శుభ సందర్భముగా మరియు 2022 ఆగష్టు 13, 14, 15 తేదీలలో పవర్‌సిటీ, విశాఖపట్నంలో జరిగే 28వ సద్గురువుల పాదుకామహోత్సవము సందర్భముగా సమర్పణ)

రచన, సేకరణ : **శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**

# చెప్పులయ్యా! చెప్పులు!!

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారు తమ మహాసమాధికి ముందు సుమారు రెండున్నర సంవత్సరముల పాటు తన పర్యటనలు మాని గొలగమూడి పూరిపాకలో నివసించసాగారు. రాత్రింబవళ్లు అంతు తెలియని భాషలో పెద్దగా అరుస్తూ తాను చెప్పే మాటలను తన సేవకులను తిరిగి పెద్దగా చెప్పమనేవారు. మహాసమాధికి కొన్నాళ్లు ముందు స్వామివారు వారి దుప్పట్లు, గోచీ గుడ్డలు, అన్నీ లెక్కపెట్టి గురవయ్య కిచ్చి, "ఇవన్నీ జాగ్రత్తగా దాచి పెట్టయ్యా" అన్నారు. "సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురుసేవ" అని పదే పదే అరిచేవారు.



మహాసమాధికి ఒక సంవత్సరం ముందు నుండీ "చెప్పులయ్యా చెప్పులు" అని పదే పదే అడిగేవారు శ్రీ వెంకయ్యస్వామి వారు. చెక్క పలకలు వగైరా ఇస్తే "ఇవి కాదయ్యా అసలు చెప్పులు కావాలయ్యా" అన్నారు. గంధపుచెక్కతో పాదుకలు తయారు చేయించాలంటే భక్తులకు వీలుకాలేదు. ఒకరోజు రోశిరెడ్డి కుమారుడు పావుకోళ్లు చేయించి స్వామికి సమర్పించాలని తెస్తున్నాడు. స్వామివారు ఆశ్రమంలో "చెప్పులు చెప్పులు" అని అరుస్తున్నారు. వారు తెచ్చిన పాదుకలు స్వామికిస్తే వాటిని గట్టిగా కౌగలించుకున్నట్లు గుండెలకేసి అదుముకొని చాలాసేపు ఇవ్వలేదు. <u>ఆ పవిత్ర పాదుకలే స్వామి నిర్యాణం చెందిన పూరిపాకలో నేడు ప్రతిష్ఠంచబడి ఉన్నవి.</u>

అలనాడు శ్రీరాముడు తన ప్రతినిధిగా తన పాదుకలను భరతునకు ప్రసాదించారు. దత్త క్షేత్రాలైన గంధర్వపురంలో, నరసోబావాడిలోను నృసింహ సరస్వతిలాంటి మహనీయులు తమ ప్రతి రూపాలుగా వారి పాదుకలే ప్రతిష్ఠించారు. అక్కల్‌కోట స్వామి తన శిష్యులకు తన పాదుకలనే ప్రసాదించారు.

అట్టి మహనీయుల సంప్రదాయమునకు చెందిన మన వెంకయ్యస్వామి వారు కూడా మనకు వారి దివ్యశక్తిని నిక్షిప్తముచేసి ఈ పాదుకలను తన ప్రతిరూపంగా మనకు ప్రసాదించారు. ఈ పాదుకలను మనం తగుశ్రద్ధా భక్తులతో పూజించి వారి అనుగ్రహానికి పాత్రులగుదుము గాక!

మహా సమాధికి ముందు రోజులలో, ''ప్రొద్దు గ్రుంకుతుందయ్యా!" అని పదే పదే అరచేవారు స్వామి. ఒకవంక తమ అవతారలీల కాలం సమాప్తమౌతుందని, మరొకవంక భక్తుల ఆయుష్షుకూడా క్షీణిస్తాందని, కనుక త్వరపడి కాలాన్ని సద్వినియోగం చేసుకోమని వారి భావం.

స్వామి మహాసమాధికి ముందు రోజులలో పాకలోని అన్ని పటాలకు పూజచేసి స్వామివారికి హారతివ్వడం, తరువాత మిగిలిన అన్ని పటములకు హారతివ్వడం బుజ్జయ్యగారి అలవాటు. ఆగష్టు 24, 1982 మధ్యాహ్నం స్వామి ఒక ప్రక్కకు వత్తిగిలి పడుకొని యున్నారు. బుజ్జన్నగారు హారతిస్తుంటే చివుక్కున బుజ్జన్నవైపు తిరిగి తన కుడిచేత్తో హారతికి అభయహస్తం చూపించి పడుకున్నారు స్వామి. స్వామి శరీరంతో ఉండగా వారికి భక్తులిచ్చిన చివరి హారతి ఇదే. ఆనాడే వారు కొద్ది సేపట్లో మహాసమాధి చెందారు.

స్వామి ఆగష్టు 24, 1982న సమాధి చెందారు. భక్తులు సేవకులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. స్వామివారి దేహాన్ని ఐదవ రోజు అనగా 28-8-82 తేదీన సమాధి చేయబడుతుందని ఈలోగా భక్తులందరూ అంతిమ దర్శనం చేసుకోవచ్చని ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక మొదలైన దిన పత్రికలలో ప్రకటించారు.


శ్రీ స్వామివారు స్వహస్తాలతో శంకుస్థాపన చేయగా, వారి ఆశీస్సులతో అంతకు ముందుగానే నిర్మించబడియున్న సమాధి మందిరంలో 4 అడుగుల పొడవు 4 అడుగుల వెడల్పు, 6 అడుగుల లోతుగల గుంటను త్రవ్వి, గుంట ప్రక్కలకు సిమెంటుతో నాపరాళ్ళతికించి తొట్టివలె చేసి అందులో స్వామివారి పాన్పు అమర్చి వారిని తూర్పు ముఖంగా కూర్చోబెట్టి పట్టు వస్త్రం కప్పారు. తొట్టిలోని ఖాళీని మంచి గంధపుపొడి, కర్పూరము, ఉప్పు, పూలమాలలతో కంఠము వరకు నింపారు. ఆపైన కొద్దిగా మట్టిపోసి దానిపై అత్తరు, పన్నీరు, మొదలగు సుగంధ ద్రవ్యములు పోశారు. వారి ముఖం దివ్యకాంతులతో మెరిసిపోతూ ఉండగా ఎంతో బాధతో భక్తులు ఆ తొట్టిని నాపరాళ్ళతో మూసివేశారు. నాపరాళ్ళపై స్వామివారు వాడుకున్న దుప్పటి పరచి వారి మట్టిముంత ఉంచి ఇటుకతో భూమిపై అరుగు నిర్మించి పాలరాళ్ళతో తాపడం చేశారు.

అన్నదానము, భజన కార్యక్రమములు 40వ రోజు మండలారాధన వరకు నిరాటంకముగా జరుగుతూనే ఉన్నాయి. మండలారాధనకు సుమారు పదివేల మంది భక్తులు హాజరై స్వామికి తమ నివాళులు అర్పించారు. ఆనాడు అనేక గ్రామముల నుండి హరిదాసులు, భగద్గీతా ప్రవచనకారులు, భజన బృందాలవారు, పండరి భజనవారు ఎవరికివారు తమ కార్యక్రమములు నిర్వహించుకొన్నారు. ఈ వచ్చిన భక్తాదులందరికీ శ్రీ స్వామి కృపవలన షడ్రసోపేతమైన అన్న సంతర్పణ ఎలా జరిగిందో శ్రీస్వామికే ఎరుక. అది మొదలుకొని ప్రతినిత్యం ఉదయం 4 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంకాలం 6 గంటలకు పూజ నైవేద్యము రాత్రి 9గంటలకు భజన నిర్విఘ్నంగా కొనసాగుతున్నవి. శ్రీ స్వామివారు స్వహస్తాలతో వెలిగించిన అగ్నిహోత్రము నేటికి నిర్విఘ్నంగా కొనసాగుతున్నది.

(ఆగష్టు 13, 14, 15 తేదీలలో జరిగే 28వ పాదుకామహోత్సవము మరియు ఆగష్టు 24వ తేదీ అవధూత శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **"అవధూత లీల"**

రచన : **శ్రీ పెసల సుబ్బరామయ్య**, గొలగమూడి




## కృష్ణనామం

రామనామ జపం ఎంతగొప్పదో కృష్ణనామం కూడా అంతే గొప్పది. దశావతారాలలో మానవ గుణానికి అత్యంత సమీపంగా కనిపించేది కృష్ణావతారం, శ్రీ కృష్ణుడు సామాన్య బాలునిగా అల్లరి చేసాడు, చిలిపి కృష్ణునిగా వెన్న దొంగిలించాడు, యవ్వనంలో గోపికలతో రసికత ప్రదర్శించాడు, యాదవులలో నాయకుడుగా నిలిచాడు, మంత్రిగా పాండవులను నడిపించాడు, తన భక్తులు తలిచినదే తడువుగా ప్రత్యక్షమయ్యాడు, ద్రౌపదిని కృష్ణుడు ఎన్నోసార్లు ఆదుకున్నాడు, అందులో వస్త్రాపహరణ ఘటన మచ్చుకు ఒక్కటి, తాను రథసారధిగా అర్జునుడిని నడిపించాడు, మహాయోధులను సంహరించే మర్మం బోధించాడు, ఇలా తన భక్తులుగా పాండవులు అడిగినవన్నీ అందించాడు, రామనామం ఎంత గొప్పదో కృష్ణనామం కూడా అంత గొప్పది, అందుకే హరేరామ హరేరామ, రామరామ హరేహరే, హరేకృష్ణ హరేకృష్ణ, కృష్ణకృష్ణ హరేహరే అన్నారు.

(ఆగష్టు 19వ తేదీ శుక్రవారము శ్రీకృష్ణాష్టమి సందర్భముగా సమర్పణ)

## సర్వేపల్లి రాధాకృష్ణన్

భారత దేశపు రెండవ రాష్ట్రపతి, భారత దేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతి మరియు 1946లో ఏర్పడిన భారత రాజ్యాంగ పరిషత్‌కు సభ్యులు, 1949లో భారతదేశంలో ఉన్నత విద్యాసంస్కరణలు ప్రవేశపెట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటికి అధ్యక్షుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్.

1952–62 వరకు భారత ఉపరాష్ట్రపతి... 1962–67 వరకు భారత రాష్ట్రపతి. భారత రాష్ట్రపతి అయిన తరువాత కొందరు శిష్యులు మరియు మిత్రులు, పుట్టినరోజు జరపటానికి శ్రీ రాధాకృష్ణన్ వద్దకు వచ్చినప్పుడు, "నా పుట్టిన రోజును వేరుగా జరిపేబదులు, దానిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తే నేను ఎంతో గర్విస్తాను" అని చెప్పి ఉపాధ్యాయ వృత్తి పట్ల తన ప్రేమను చాటారు. అప్పటినుండి ఆయన పుట్టినరోజును భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

(సెప్టెంబరు 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భముగా శుభాకాంక్షలతో)

## గురుపూర్ణిమ (వ్యాసపూర్ణిమ)

గురుపూర్ణిమ గురించి ఈ క్రింది విషయం "బ్రహ్మాండపురాణం"లోను "స్వధర్మసిందు" అనే గ్రంథములోనూ వివరముగా చెప్పబడినది.

ఏకరాశిగా ఉన్న వేదాన్ని నాలుగు భాగాలుగా సులభ గ్రాహ్యం చేసి, వ్యాసుడు "వేదవ్యాసుడు" అయ్యారు. వీరు ఇంకా 18 పురాణాలను, 18 ఉపపురాణాలను, విజ్ఞాన సర్వస్వమైన మహాభారతాన్ని, బ్రహ్మసూత్రాలను, కలియుగ మానవాళికి కర్మ, భక్తి, జ్ఞాన మార్గాలను ఉపదేశించారు. ప్రాపంచిక, ఆధ్యాత్మిక జీవన విధానాలను సమన్వయము చేసుకోవడంలోనే మానవ జీవిత వికాసం ఉందని వ్యాసమహర్షి బోధించారు. వీరి జన్మదిన సందర్భంగా మనం "వ్యాస పౌర్ణమి"ని "గురుపౌర్ణమి"గా జరుపుకుంటున్నాం.

## వినాయకుని ఆకారం – తత్వం

వినాయకుని ఆకారం పై ఎన్నో చర్చలు, అభిప్రాయాలు తత్వార్థ వివరణలు, కథలు ఉన్నాయి. ఏనుగు తొండం, పెద్ద బొజ్జ, ఎలుకవాహనం – ఇవి ప్రధానంగా కనిపించే స్వరూప విశేషాలు. వినాయకుని ఆకారం దేవనాగరి లిపిలో "ఓం" (ప్రణవం)ను పోలి ఉన్నదని చెబుతారు. ఇది చిత్రకారులకు చాలా ప్రియమైన విషయం. ఓంకారంలో వినాయకుడిని చూపిస్తూ ఎన్ని బొమ్మలు గీయబడ్డాయో చెప్పలేము. ఎందరో చిత్రకారులు ఈ విషయంలో తమ సృజనాత్మకతను ప్రదర్శించారు.

వినాయకుని తొండము "ఓం"కారానికి సంకేతమని చెబుతారు.

ఏనుగు తల – జ్ఞానానికి, యోగానికి చిహ్నము

మనిషి శరీరము – మాయకూ, ప్రకృతికి చిహ్నము

చేతిలో పరశువు – అజ్ఞానమును ఖండించడానికి సంకేతము

చేతిలో పాశము – విఘ్నాలు కట్టిపడవేసే సాధనము

విరిగిన దంతము – త్యాగానికి చిహ్నము

మాల – జ్ఞాన సముపార్జన

పెద్ద చెవులు – మొక్కులు వినే కరుణామయుడు

పొట్టపై నాగ బంధము – శక్తికి, కుండలినికి సంకేతము

ఎలుక వాహనం – జ్ఞానికి అన్ని జీవుల పట్ల సమభావము ఉండాలి.

# బాలవికాసం - బహుముఖ ప్రజ్ఞాశాలి గిడుగు

బహుభాషావేత్త, చరిత్రకారుడు, మానసిక శాస్త్రవేత్త, ఉపాధ్యాయుడు, సంఘ సంస్కర్త, మానవతావాది, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన గిడుగు శ్రీరామమూర్తి "శ్రీకాకుళం జిల్లా పర్వతాల పేట గ్రామంలో 1863 ఆగష్టు 29వ తేదీన జన్మించారు. ఆయన తండ్రి వీరరాజు, తల్లి వెంకటమ్మ. శ్రీరామమూర్తికి అక్షరాభ్యాసం అయిన తరువాత గున్నయ్య అనే పంతులుగారు ఇంటికి వచ్చి సంస్కృతం, తెలుగు, గణితం నేర్పేవారు. సూక్ష్మగ్రాహి, అసాధారణ ప్రజ్ఞ కలిగిన శ్రీరామమూర్తి శబ్దమంజరిని ఎనిమిది సంవత్సరాలకే నేర్చుకున్నారు. శ్రీరామమూర్తి తండ్రి చిన్న తనంలోనే మరణించాడు.



విజయనగరంలో మేనమామగారి ఇంట్లో ఉంటూ శ్రీరామమూర్తి మహారాజువారి ఇంగ్లీషు పాఠశాలలో ప్రవేశించి 1875 మొదలు 1880 వరకు విజయనగరంలో గడిపేరు. 1879లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. ఆ రోజుల్లో గురజాడ అప్పారావు శ్రీరామమూర్తికి సహాధ్యాయి. ఆ ఏడే శ్రీరామమూర్తికి పెండ్లి అయింది. 1880లో ముప్పై రూపాయల జీతం మీద పర్లాకిమిడి రాజావారి స్కూల్లో ఫస్టుఫారంలో చరిత్ర బోధించే అధ్యాపకులైనారు, శ్రీరామమూర్తి. సంసారబాధ్యత (తల్లి, ఇద్దరు చెల్లెళ్ళు) శ్రీరామమూర్తి గారిపై పడింది. ప్రైవేటుగా చదివి 1886లో ఎఫ్.ఏ, 1894లో బి.ఏ మొదటి రెండు భాగాలు (చరిత్ర తప్ప) పాసయ్యారు. 1896లో మూడోభాగం పాసై పట్టం పుచ్చుకున్నారు. ఇంగ్లీషు, సంస్కృతాలే కాకుండా, ప్రధాన పాఠ్యాంశంగా చరిత్ర తీసుకుని రాష్ట్రంలో రెండోర్యాంకులో ఉత్తీర్ణులయ్యారు. రాజావారి ఉన్నత పాఠశాల కళాశాలగా మారింది, శ్రీరామమూర్తి గారికి కళాశాల తరగతులకు పాఠాలు చెప్పే యోగ్యత వచ్చింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశంలో వ్యవహారిక భాషోద్యమ మూల పురుషుడు శ్రీగిడుగు శ్రీరామమూర్తి ఆయన కృషి మూలంగా వ్యవహారిక భాష అమలులోనికి రావడంతో చదువుకునే వాళ్ళ సంఖ్య పెరిగింది. చాలా మంది నూతన రచయితలు ఆవిర్భవించారు. అక్షరాస్యులు పెరిగారు. శ్రీరామమూర్తి శ్రీగురజాడ అప్పారావు సహోపాధ్యాయులు. వారి ఇరువురి స్నేహం జీవితాంతం కొనసాగింది.

శ్రీ గిడుగు రామమూర్తి పర్లాకిమిడిలో పనిచేస్తున్నప్పుడు చుట్టుప్రక్కల ఉన్న గిరిజనులతో పరిచయం ఏర్పడింది. అనంతరం గిరిజనుల కోసం ఒక భాషను రూపొందించాలన్న ఉద్దేశ్యం ఆయనకు ఏర్పడింది. దీంతో సవర భాష లిపిని ఆయన స్వయంగా తయారుచేశారు. గిడుగుకు కావ్య భాషలో ప్రవేశం ఉంది గానీ పాండిత్యం లేదు.

ఈ పండితుల్ని ఎదుర్కోవాలంటే బాగా కృషి చేయాలని నిర్ణయించుకుని 1911 నుంచి 1914 వరకు రోజుకు 16 గంటలపాటు శ్రమించి తెలుగు భాషలోని అన్ని కావ్యాలను ప్రబంధాలను క్షుణ్ణంగా చదివేరు. వ్యాకరణాలను అధ్యయనం చేశారు. అప్పటినుంచి వారి శైలిలోనే పండితులతో యుద్ధానికి సిద్ధమయ్యారు. గురజాడ మిత్రుడికి అండగా నిలిచాడు.

ఆంధ్రదేశం నుంచి వెలువడుతున్న పత్రికలు కొన్ని గ్రాంథిక భాషను సమర్ధిస్తే, తెలుగు వెలుగులు కొన్ని వ్యవహారిక భాషను సమర్థించాయి. మొదట గ్రాంథిక వాదాన్ని బలపరచిన కందుకూరి వీరేశలింగం పంతులు గారు గిడుగు వాదనలో నిజాన్ని గ్రహించారు. పత్రికలు ప్రజలకు ఉపయోగపడాలంటే వ్యవహారిక భాషలో ఉండాలని తను నిర్వహించే పత్రికల్ని వ్యవహారిక భాషలో వెలువరించడం ప్రారంభించారు శ్రీరామమూర్తి. అసమాన ప్రతిభావంతుడైన శ్రీ గురజాడ అప్పారావుగారు వ్యవహారిక భాషలో రచనలు చేసి గిడుగుకు అండగా నిలిచారు.

శ్రీరామమూర్తి సంపాదకత్వంలో వెలువడిన 'తెలుగుపత్రిక' పూర్తిగా వ్యవహారిక భాషలో నడిచింది. ఒక్క సంవత్సరమే అయినా శ్రీరామమూర్తి పంతులు భాషా వాదానికి ఈ పత్రిక అద్దం పట్టింది. యువ రచయితలకు కొత్త ఒరవడి దిద్దింది. రాజమండ్రి నుండి వెలువడిన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి 'ప్రబుద్ధాంధ్ర' పత్రిక శ్రీరామమూర్తి పంతులు వ్యవహారిక భాషావాదానికి ఎంతగానో సహాయపడింది.

గుంటూరు నుంచి వెలువడిన 'ప్రతిభ' అనే త్రైమాసిక పత్రిక, తెలప్రోలు నుంచి వెలువడిన 'వీణ' అనే పత్రిక వ్యవహారిక భాషలో నడిచి గిడుగు ఆశయాన్ని ముందుకు తీసుకువెళ్లాయి. అలాగే కొందరు నూతన రచయితలు 'సాహితీసమితి'గా ఏర్పడి 'సాహితి' అనే పత్రికను వ్యవహారిక భాషలో ప్రారంభించారు. రామమూర్తి వ్యవహారిక భాషా ఉద్యమంలో నిజాన్ని గ్రహించిన 'ఆంధ్రపత్రిక' దినపత్రికలో కూడా వార్తలు క్రమంగా వ్యవహారిక భాషలో రావడం మొదలైంది. చివరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విశ్వవిద్యాలయాల వారు కూడా వ్యవహారిక భాషను ఆమోదించారు.

పాఠ్య గ్రంథాలు వ్యవహారిక భాషలో రావడం మొదలైంది. గిడుగు ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన 'చదువు' అందరికీ అందుబాటులోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మక శక్తి ఉన్న ప్రతీ ఒక్కరికీ వీలైంది. తెలుగు నాట వాడుక భాషా వ్యాప్తికి కృషి చేసిన గిడుగు శ్రీరామమూర్తి పంతులు 1940 జనవరి 15వ తేదీన మరణించాడు.

గిడుగు శ్రీరామమూర్తి పంతులుగారి పుట్టినరోజు అయిన ఆగష్టు 29వ తేదీని 'తెలుగు భాషా దినోత్సవము'గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము పరిగణిస్తున్నది. తండ్రికి తగ్గ తనయుడిగా వారి కుమారుడు శ్రీ గిడుగుసీతాపతి కీర్తి గడించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ 'కళాప్రపూర్ణ' బిరుదు పొందిన తండ్రీ కొడుకులు వీళ్ళిద్దరే!

శ్రీ రామమూర్తి గారిని

1934లో ప్రభుత్వం కైజర్ ఎ హింద్ బిరుదు ఇచ్చి గౌరవించింది.

1913లో ప్రభుత్వం వారు "సాహెబ్" బిరుదు ఇచ్చింది.

1938లో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు "కళాప్రపూర్ణ"తో గౌరవించింది. ప్రతి రోజు మనం మాట్లాడుకునే వ్యవహారిక భాషలోనే తెలుగుగ్రంథాలు ముద్రించబడటమే కాకుండా, పాఠ్య పుస్తకాలు కూడ వ్యవహారిక భాషలో ముద్రించబడి నాటి, నేటి, భావతరానికి సరళమైన మార్గాన్ని గిడుగు శ్రీరామమూర్తిగారు ప్రతి తెలుగు వారికి ప్రాతఃస్మరణీయులు, ప్రత్యేకించి విద్యార్ధులకు పూజ్యనీయుడు. ఏమంటారు బాలలు?

ఆగష్టు 29వ తేదీ తెలుగు భాషాదినోత్సవము మరియు గిడుగు శ్రీరామమూర్తిగారి జయంతి సందర్భముగా సమర్పణ

సౌజన్యం : అంతర్జాలంలోని వివిద వ్యాసాలు    సేకరణ, కూర్పు : "సత్యేంద్ర"

# జ్ఞాన, విద్య, విజయ ప్రదాత హయగ్రీవుడు

శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమిని భారతీయులంతా రాఖీ పండుగగా ఘనంగా జరుపుకొంటారు. కానీ ఆరోజుకు మరో ప్రత్యేకత కూడా ఉంది. అదే హయగ్రీవ జయంతి.

యుగయుగాలలో లోక పాలనకై, ధర్మ సంస్థాపనకై విష్ణువు అనేక అవతారాలను దాల్చాడు. ఆ అవతారాల్లో దశావతారాలు ప్రసిద్ధి, అయితే తన భక్తుల కోసం విష్ణువు దాల్చిన అవతారలలో ఒకటి 'హయగ్రీవావతారం'. పూర్వం హయగ్రీవుడు అనే రాక్షసుడు ఉండేవాడు. గుర్రం తలను కలిగిన హయగ్రీవుడు బ్రహ్మదేవుడి గురించి కఠోర తపస్సు చేశాడు. తన ఆకారంతో ఉన్నవారి చేతిలో మాత్రమే తనకి మరణం సంభవించేలా వరాన్ని పొందాడు. వర గర్వంతో హయగ్రీవుడు సాధు సత్పురుషులను హింసించసాగాడు. దీంతో దేవతలంతా ఆది దంపతులను శరణువేడారు,



యోగ నిద్రలో వున్న విష్ణువును మేల్కొలిపితే ఆయనే హయగ్రీవుడిని సంహరిస్తాడని పార్వతీదేవి వారితో చెప్పింది. శ్రీమహావిష్ణువు తన విల్లు చివరి భాగాన్ని గెడ్డంకింద పెట్టుకొని నిద్రిస్తున్నాడు.అయనను మేల్కొల్పడం కోసం శివుడు చెద పురుగుగా మారి వింటి తాడును తెంపేడు. వింటితాడు తెగిన కారణంగా విల్లు పైకి ఎగదన్నడంతో శ్రీ మహావిష్ణువు తల శరీరం నుంచి వేరైపోయింది. ఆయన ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న ఆది దంపతులు, గుర్రం తలను తెప్పించి శ్రీ మహావిష్ణువు దేహానికి అమర్చారు. అమ్మవారితో సహా దేవాధి దేవతలు తమ జ్ఞానాన్ని, శక్తి సామర్థ్యాలను గుర్రం తల గల శ్రీ మహావిష్ణువుకి ధారపోశారు.

ఈ కారణంగానే హయగ్రీవ స్వామి విద్యలకు అధిపతి, జ్ఞానప్రదాతగా పూజలు అందుకుంటున్నాడు. హయగ్రీవ రాక్షసుడిని సంహరించి తన అవతార కార్యాన్ని నెరవేర్చిన స్వామి, లక్ష్మీ సమేతుడై దేవతలకు దర్శనమిచ్చాడు. స్వామివారు ఈ అవతారాన్ని ధరించిన రోజు శ్రావణ పౌర్ణమి. ఈ రోజున లక్ష్మీ సమేత హయగ్రీవ స్వామిని పూజించడం వలన జ్ఞానము - విద్య - విజ్ఞానం - సంపద లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. రాక్షసులు దొంగిలించిన వేదాలను బ్రహ్మదేవుడికి హయగ్రీవుడే తిరిగి ఇచ్చినట్లు విష్ణుధర్మోత్తరం చెబుతున్నది.

హయగ్రీవుడు విష్ణుమూర్తి అవతారమే అయినప్పటికీ, ఆయనలో సకల దేవతలూ కొలువై ఉన్నారని పురాణాలు పేర్కొంటున్నాయి. సూర్య చంద్రులు కళ్ళుగా, దేవతలు ఎముకలుగా, అష్టవసువులు పాదాలుగా, అగ్ని నాలుకగా, సత్యం వాక్కుగా, బ్రహ్మ హృదయంగా, ఇలా అయనలోని అణువణువూ దేవతామయమని అంటారు. మరి అలాంటి హయగ్రీవుని ఆరాధిస్తే సకల దేవతలను ఆరాధించిన ఫలితం దక్కుతుంది కదా!

హయగ్రీవుని ఆరాధన ఇంత విశిష్టమైనది కనుకే కొందరు ప్రత్యేకించి హయగ్రీవుని ఉపాసిస్తారు. అత్యంత నిష్టతో కూడుకున్న హయగ్రీవ ఉపాసన అందరికీ సాధ్యం కాదు కాబట్టి, కనీసం హయగ్రీవ జయంతి రోజున అయినా ఆయనను ఆరాధించాలి. హయగ్రీవుడు లేదా విష్ణుమూర్తి ఉన్న పటాన్ని పూజగదిలో ఉంచి హయగ్రీవ స్తోత్రాన్ని కానీ, హయగ్రీవ అష్టోత్తర శతనామావళిని కానీ పఠించాలి. ఏదీ కుదరకపోతే కనీసం

**"జ్ఞానానంద మయమ్ దేవమ్ నిర్మల స్ఫటికాకృతిమ్ ।**
**ఆధారామ్ సర్వవిద్యానామ్ హయగ్రీవ ముపాస్మహే ॥"**

"జ్ఞానం, ఆనందం, మూర్తీభవించిన దైవస్వరూపం హయగ్రీవుడు. నిర్మలమైన స్ఫటికాకృతి కలిగి, సర్వవిద్యలకు ఆధారభూతమైన విద్యాధిదేవత హయగ్రీవునకు నమస్కారం".


అనే మంత్రాన్ని పఠించాలి. ప్రత్యేకించి విద్యార్థులు ప్రతి రోజు కనీసం 11సార్లయినా పై శ్లోకాన్ని ప్రాతః కాలములో పఠించటము ద్వారా జ్ఞాపకశక్తి పెరిగి, విద్యాశక్తి కలిగి, ఉన్నతస్థితిని పొందుతారు. హయగ్రీవుడిని పూజించిన భక్తులకు విద్యనే కాదు అన్యాయం జరిగినవారికి న్యాయం జరుగుతుంది. భూవివాదాలు ఏమైనా ఉంటే అవి త్వరలో పరిష్కరించ బడుతాయి. శత్రు వినాశనం కూడా జరుగుతుంది. ఇలా ప్రతి సమస్యను పరిష్కరించి హయగ్రీవుడు మానవులందరినీ చల్లగా చూస్తాడు అని ప్రతీతి. హయగ్రీవునికి తెలుపురంగు పూలు, యాలుకలతో చేసిన మాల, గుగ్గిళ్ల నైవేద్యం చాలా ఇష్టమని చెబుతారు. శ్రావణపౌర్ణమి - హయగ్రీవ జయంతినాడు వాటిని స్వామికి అర్పించి హయగ్రీవ అనుగ్రహాన్ని పొందే ప్రయత్నం చేద్దాము.

(శ్రావణపౌర్ణమి ఆగష్టు 12వ తేదీ శుక్రవారము హయగ్రీవ జయంతి సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీమతి ఆర్. సృజన ప్రసాదు**, బెంగుళూరు

# స్ఫూర్తిప్రదాత 'శ్రీ బి.వి. నరసింహస్వామి'

శ్రీ బి.వి. నరసింహ స్వామీజీ మొట్టమొదటి సారిగా 1936లో శిరిడీ వెళ్ళినపుడు సాయి పాదాలనాశ్రయించిన భక్తులు కొంతమంది మాత్రమే ఉండేవారు. బాబా భౌతికంగా శిరిడీలో ఉండగా వేల సంఖ్యలో భక్తులు ఆయనను దర్శించినప్పటికీ, ఆయన మహాసమాధి అనంతరం ఆ భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. బాబాకు బాగా సన్నిహితులైన భక్తులు సైతం మిగిలిన మహాత్ములందరి వలెనే శ్రీసాయి దేహత్యాగం చేయడంతోనే వారి ప్రభావం క్షీణించిందని, వారు శరీరంతో ఉండగా అది అత్యున్నత స్థాయిలో ఉండేదనీ భావించే వారు. కేవలం 1936 తరువాత శ్రీ నరసింహస్వామి ఆధ్వర్యంలో నడిచిన "సాయిఉద్యమం" దేశ వ్యాప్తంగా విస్తరించి అనేక మందిని శ్రీసాయి పాదాల చెంతకు చేర్చింది. ఈ ఉద్యమం దేశ పరిధులు దాటి విదేశాలకు కూడా విస్తరించింది. ఈ నాడు వందలలో కాదు కోట్ల సంఖ్యలో భక్తులు శిరిడీ వచ్చి బాబాను దర్శించి తరిస్తున్నారు.



అయితే అది అంత సులభంగా సాధ్యపడలేదు. శ్రీ నరసింహస్వామీజీ సాయిబాబాను గురించి దేశంలో వాడవాడలా వ్యాపింప చేయాలని హృదయ పూర్వకంగా ప్రయత్నిస్తున్నప్పటికీ ఆయన కొన్ని అడ్డంకులను ఎదుర్కొన వలసి వచ్చేది. అనేక మంది ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తుండేవారు. "ఈ వ్యక్తి మనలను ఒక ముస్లిం ఫకీరును పూజించమంటున్నాడు" అని ఆయనను ఎగతాళి చేసేవారు. "ఆల్ ఇండియా సాయి సమాజ్" లాకెట్లు, ఉంగరాలు మొదలైనవాటి అమ్మకాల ద్వారా అధికంగా ఆదాయం లభిస్తుండడంతో చివరకు శిరిడీ సంస్థానంలో సభ్యులైన వారు కొందరు కూడా శ్రీ నరసింహస్వామి పట్ల అసూయ చెందారు. వారు ప్రెస్ రిలీజులు, వార్తా పత్రికలలో నోటీసులు పంపే దాకా కూడా వెళ్ళారు. 'ఈ మద్రాసీ సాధువు ఇదంతా డబ్బు సంపాదించడం కోసమే చేస్తున్నాడు. ఎవ్వరూ ఆయనను నమ్మవద్దు" అని ప్రకటించే వారు.

అతి త్వరలోనే కొందరు ప్రముఖ వ్యక్తులు శ్రీ నరసింహస్వామీజీ యొక్క సేవలు హృదయ పూర్వకమైనవి, నిస్వార్థమైనవి అని గుర్తించారు. వారు సాయి ఉద్యమాన్ని మరింత ప్రోత్సహించారు. ఈ ప్రతికూల పరిస్థితులన్నింటిలోను చెక్కు చెదరక శ్రీ నరసింహస్వామి "సాయిబాబా నాతో ఉండగా నేను దేని గురించీ భయపడవలసిన పనిలేదు" అని దృఢంగా నమ్మి సాయి ప్రచారాన్ని కొనసాగించారు. శ్రీనరసింహస్వామి గురించిన దుష్ప్రచారాలు, వ్యతిరేక భావాలకు త్వరలోనే తెరపడింది. అలా చేసిన వారే తదనంతర కాలంలో ఆయనకు సహకరించి 'సాయిబాబాను శిరిడీ నుంచి ప్రపంచమంతా విస్తరింపచేయాలి' అనే నిస్వార్థ లక్ష్యానికి పాటు పడ్డారు.

శ్రీ నరసింహస్వామీజీ మాత్రం ఈ ప్రతికూలాలు, వ్యతిరేక భావాలు కేవలం తన విశ్వాసాన్ని, లక్ష్య సాధన పట్ల ఆయనకున్న దీక్షను పరీక్షించే నిమిత్తమే ఎదురైనవిగా గ్రహించే వారు. సాయిబాబా తన ఉద్యమాన్ని ఆమోదించినట్లు ఆయనకు సుస్పష్టంగా తెలుసు. ఆయన సాయి ప్రచార కార్యక్రమంలో అనేక సందర్భాలలో ఈ విషయం గురించి ప్రస్తావించే వారు. ఆ క్రమంలో ఎదురైన అసంఖ్యాకమైన అద్భుతాల గురించి కూడా ఆయన తన ఉపన్యాసాలలో, వ్యాసాలలో వివరంగా తెలియ చేసేవారు.

శ్రీ నరసింహస్వామి చేసిన తీవ్రమైన, అసాధారణమైన కృషి వలన **"శ్రీసాయి ఈ విశ్వమంతటికీ రక్షకులనీ, హృదయంలో ఆయనను ప్రతిష్టించుకోవడం ద్వారా ఆపదలు, భయాల నుంచి విముక్తులం అవ్వగలమని"** తెలుసుకోగలిగేరు. కొంత స్థాయి వరకు సాయి భక్తి వలన సాధించే లౌకిక ప్రయోజనాల ద్వారా సాయి తత్వ ప్రచారం వేగవంతమైందన్నది సత్యమే.

**"భగవంతుడు తన భక్తులకు లౌకిక ప్రయోజనాలు చేకూర్చడం ద్వారా తన వద్దకు లాగుకుని వారి ప్రేమ, భక్తి విశ్వాసాలకు పాత్రుడై అప్పుడు వారిని లౌకిక, ఆధ్యాత్మిక మార్గాలలో ప్రగతి పథంలో నడిపించే దారిలోకి తీసుకు వస్తాడు".** ఆయన మనకు లౌకిక బాధలలో సహాయం చేయకపోతే, మనకు శరణు ప్రసాదించకపోతే, శక్తినివ్వకపోతే అసలు ఆయన నెవరు ఆశ్రయిస్తారు?

1918లో బాబా మహాసమాధి చెందేనాటికి ఆయన గురించి అతి స్వల్పంగా మాత్రమేభక్తులు అర్థం చేసుకున్నారు. ఆయన జీవిత విశేషాలను పదిలపరచాలనే తలంపే అంతగా లేదు. 1936లో కూడా కేవలం 10 మంది వరకు మాత్రమే భక్తులు మందిర దర్శనానికి వచ్చేవారు. 1936 తరువాత మాత్రం సాయి ఉద్యమం ఊపందుకుని దేశ విదేశాలలో విస్తరించింది. ఈ విస్తృత ప్రచారం కేవలం ఏకాగ్ర చిత్తంతో, భక్తి ప్రపత్తులతో శ్రీ నరసింహస్వామి లక్ష్య సాధనకు చేసిన కృషి వలననే సఫలమైంది. ఇది వేరుగా చెప్పవలసిన అవసరం లేదు. కానీ మనం మాత్రం సాయినాధుని చూపినందుకు, ఆయన వైపు నడిపించినందుకు శ్రీ నరసింహస్వామికి ఎప్పటికీ ఋణపడి ఉంటామని గుర్తుంచుకోవడమే ఆయనకు కృతజ్ఞత తెలపడం.

"అనేక భాషలలో పత్రికలు ప్రచురితమవ్వాలి. గ్రంథాలు ముద్రించాలి. ఉపన్యాసాలు, కీర్తనలు దేశవ్యాప్తంగా నిర్వహింప బడాలి. పూజలు, భజనలు ప్రతీరోజు అన్నిచోట్ల జరగాలి. దేశం ఒక చివరి నుంచి మరొక చివరి వరకూ బాబా తత్వం వ్యాపించాలి" అని శ్రీ నరసింసస్వామి పిలుపునిచ్చారు.

ఒకవైపు శ్రీ నరసింహస్వామి బాబాను గురించి అనేక భాషలలో గ్రంథాలు ప్రచురింపచేస్తున్నారు. అదే సమయంలో ఆయన దేశమంతా విస్తృతంగా పర్యటించి ప్రజలకు బాబాను, ఆయన తత్వాన్ని గురించి బోధిస్తూ ఉండేవారు. కొన్ని సార్లు ఒంటరిగా, కొన్నిసార్లు ఆయా ప్రాంత ప్రజలు, స్వచ్ఛంద సేవకులతో కలిసి శ్రీ నరసింహస్వామి దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం ప్రయాణించి ఉపన్యాసాలు చెప్పడం, క్రొత్త సంఘాలు స్థాపించడం, సాయి పూజలు ప్రారంభించడం, ఇంటింటిలో పూజకు ప్రోత్సహించడం, అవిశ్రాంతంగా తిరుగుతుండే మనస్సును నిశ్చలం చేసి బాబాపై దృష్టి కేంద్రీకరించమని ప్రజలకు శిక్షణనివ్వడం, 'సాయిరాం' అనే నామాన్ని స్మరణ చేస్తూ ఉండమని చెప్పడం, అనేక మంది ప్రజలు సోదరభావం పెంపొందించుకుని ఒక గుంపుగా ఏర్పడి ఏక భావంతో, భక్తితో బాబాను పూజించమని ఉద్భోదించడం వంటి అనేక కార్యాలు చేసేవారు. ఆయన రైళ్ళలో 3వ తరగతి కంపార్టుమెంట్లలోను, ఎడ్ల బండ్లు, జట్కా బండ్లు, బస్సులు, మోటారు వాహనాలు–ఇటువంటి వాటిలో ప్రయాణిస్తూ, విశ్రాంతి తీసుకోవటానికి ఎలాంటి స్థలమైనా, పట్టించుకొనక, అతి సామాన్యమైన ఆహారం స్వీకరిస్తూ, బాబా తనకు ప్రసాదించిన ప్రతీ అనుభవాన్ని ఆనందంగా స్వీకరించేవారు. ఆయన తనతో పాటుగా ఊదీ, కార్డ్ సైజు సాయి ఫోటోలు, సాయి అష్టోత్తరం తీసుకుని వెళుతూ అందరికీ ఉచితంగా పంచుతూ ఉండేవారు. తన మాటలు వినడానికి వచ్చే శ్రోతలు ఎంతమంది ఉన్నా ఆయన మాత్రం పట్టించుకునే వారు కాదు. విద్యార్థులు, వివిధ రంగాలలో పని చేసే స్త్రీ, పురుషులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, కళాకారులు, వృత్తి పనివారు, చేనేత కార్మికులు– అందరికీ తన ప్రవచనాలు అందించేవారు. ఇండ్లలో, క్లబ్బులలో, పాఠశాలలలో, పార్కులలో బహిరంగ ప్రదేశాలలో – ఎక్కడైనా మాట్లాడేవారు. సుమధురమైన, సుస్పష్టమైన రీతిలో ప్రతిధ్వనించే ఆయన గొంతు వారి హృదయాలను చేరి వారి జీవితంలో ఒక సరి కొత్త ప్రజ్వలమైన అధ్యాయానికి నాంది పలికేదిగా ఉండేది. దీని విషయమై ఆయనను భక్తులు ఇప్పటికీ ప్రేమతో, కృతజ్ఞతతో తలుచుకుంటూనే ఉంటారు.

1940–1950 మధ్య కాలంలో ఆయన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలోని ముఖ్యమైన పట్టణాలన్నింటిలోను తన పర్యటనలు చేసారు. 1943లో ఆయన బొంబాయి, భుసావల్‌లలో ప్రసంగించారు. ఢిల్లీ, అలహాబాద్, బెనారస్, కలకత్తాలలో సభలలో పాల్గొన్నారు. బెనారస్‌లోని థియోసోఫికల్ సొసైటీ, సెంట్రల్ హిందూ కాలేజీ, కలకత్తాలోని రామకృష్ణ ఇన్సిట్యూట్ ఆఫ్ కల్చర్‌లోను ఆయన ఉపన్యసించి తన భాషణలు అనుగ్రహించారు. అహ్మదాబాద్‌లో ఆయన ఉపన్యసించి అక్కడ ఒక సాయి సమాజ్‌ను ఏర్పాటు చేసారు. 1940–1943 మధ్య కాలంలో ఆయనను కలకత్తాలో ఒక శక్తివంతమైన సాయి సమాజ్‌ను ఏర్పాటుచేయడానికి 3 సార్లు ఆహ్వానించారు. ఖరగ్‌పూర్, అస్సాంలోని మసీమ్‌పూర్, కరీంగంజ్, సిల్చార్‌లలో కూడా ఆయన పర్యటించారు. బీహార్‌లోని పాట్నా, జంషెడ్‌పూర్‌లలో తన ప్రసంగాలు అందించారు. క్లుప్తంగా చెప్పాలంటే కన్యాకుమారి నుంచి శ్రీనగర్ వరకు, గౌహతి నుంచి లాహూర్ వరకు ఆయన దేశం మొత్తాన్ని తన ప్రసంగ ప్రసారాలతో పవిత్రీకరించారు.

ఈ ప్రసంగ పర్యటనల ద్వారా ఆయన అనేక ఉప సమాజాలను ఏర్పాటు చేయగలిగారు. 1948 నాటికి మన దేశంలో మొత్తం మీద 65 ఉప సమాజాలు ఏర్పడ్డాయి. ఇవన్నీ తమ తమ కార్యక్రమాలలో మద్రాసులోని "ఆల్ ఇండియా సాయి సమాజ్"కు అనుసంధానం చేయబడ్డాయి. వివిధ పట్టణాలలో 15 సాయి మందిరాలు నిర్మింపబడ్డాయి. శ్రీ నరసింహస్వామి తన పర్యటనలను ముందుగానే నిర్ణయించి ఆ కార్యక్రమం గురించి 'సాయి సుధ' పత్రికలో ప్రకటన చేసేవారు. ఆయన ప్రసంగ పర్యటన అనంతరం ఆ ప్రాంతంలో ఉన్న భక్తులు, నిర్వాహకులు ఆయన ప్రసంగ పాఠాన్ని ప్రచురణ నిమిత్తం తయారు చేసి ఆయనకు అందించేవారు.

ఈ దశలో జరిగిన అనేక ఆసక్తికర సంఘటనలు సాయి ఉద్యమాన్ని మరింతగా ప్రోత్సహించాయి. సాయి పూజ చేయడం ప్రారంభించిన వారు తమకు ఎదురైన అద్భుత అనుభవాలు తెలియచేయడం వలన శ్రీసాయి కీర్తి మరింతగా విస్తరించింది. "సాయి సుధ" పత్రికలోని అనేక సంచికలలో వీటి గురించి ప్రచురింప బడేది. ఉద్యమ తొలి రోజులలో సాయి సాహిత్యానికి మెల్ల మెల్లగా ప్రాచుర్యం పెరుగుతూ వచ్చేది. అంతే కాక శిరిడీ నుంచి ఉంగరాలు, లాకెట్లు, హారాలు వీటితో పాటు ఊదీ పట్ల కూడా ప్రజలలో ఆసక్తి, ప్రాధాన్యత పెరిగేయి. సాయి పూజలకు ఒక నిర్ణీతమైన, క్రమబద్ధమైన విధానాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరం ఏర్పడింది. దానిని దృష్టిలో ఉంచుకుని శ్రీ నరసింహస్వామి "సాయి పూజావిధి", "సాయిసహస్రనామాల"ను విస్తృతంగా వ్యాప్తిలోనికి తీసుకువచ్చారు. సాయి అష్టోత్తరం అప్పటికే ప్రజలు సుపరిచితం. పై రెండు పుస్తకాలను సంస్కృతం, తెలుగు, తమిళం, కన్నడ భాషలలో ప్రచురింపచేసారు. చిన్న వెండి పాదుకలకు, సాయి లాకెట్లు, పటాలకు పూజలు చేయడం ప్రారంభమైనది. (తరువాయి భాగం వచ్చే సంచికలో.)

సౌజన్యం : **శ్రీ నరసింహస్వామి చరిత్ర**


రచన : **డా॥ ఆర్ విజయకుమార్**, బెంగుళూరు

# సద్గురు శ్రీ సాయి పాదుకాష్టకము

(1) మొదట అద్వయులుగా వుండి, సంకల్పమాత్రాన ఈ బ్రహ్మాండ రూపం ధరించి, మరల దానిని పాలించడానికి అవతరించిన, ఓ సద్గురు మూర్తి ! మీ పాదపద్మములకు వందనములు. (2) కలి ప్రభావం వలన ధర్మం నశించి, యజ్ఞ యాగాదులు కరువైనప్పుడు భూమిపై అవతరించి, ధర్మాన్ని పునరుద్ధరిస్తూ లోకానికి జ్ఞానజ్యోతిని అనుగ్రహిస్తున్న సద్గురు మూర్తి! మీ పాదపద్మములకు నమస్కారములు. (3) సంసార సాగరంలో మునిగియున్న భక్తులను తరింప చేయడానికి అవతరించి, ఫకీరు రూపం ధరించి లోకోద్ధరణ చేస్తున్న ఓ సద్గురుమూర్తి! మీ పాదపద్మములకు నమస్కారములు. (4) సాయి మీ చరిత్ర చిత్రమైనది. మీ కీర్తి భూమండలమంతా వ్యాపించింది. మూగవానికి మాట్లాడే శక్తిని అనుగ్రహించారు. గ్రుడ్డివారికి దృష్టి, గొడ్రాలికి సంతానం, విధవరాలికి సౌభాగ్యము, భక్తులకు సిరిసంపదలు ప్రసాదించారు. ఓ సద్గురుమూర్తి! మీ పాదపద్మములకు నమస్కారములు (5) పాపాన్ని, దారిద్ర్యాన్నీ పోగొట్టి జగత్తుకు జ్ఞానజ్యోతి ప్రసాదిస్తూ, కామధేనువు మరియు కల్పవృక్షాల వలె భక్తులు కోరినవన్నీ నెరవేరుస్తూ, ముముక్షువులకు ముక్తిని గూడ మీరు అనుగ్రహిస్తున్నారు. వేదాలకూడ అతీతమైన స్వరూపంగల ఓ సద్గురుమూర్తి! మీ పాద పద్మములకు నమస్కారములు. (6) ఓ సద్గురుమూర్తి! మీ పాదపద్మములను నిత్యమూ స్మరించేవారికి సర్వతీర్థ క్షేత్రాలను సేవించిన ఫలితము, వాటిని దర్శించిన వారికి వేలాది అశ్వమేధాదియాగాలు చేసిన ఫలితము ప్రసాదిస్తున్న ఓ సద్గురుమూర్తీ! మీ పాదపద్మములకు నమస్కారములు. (7) వేదాలకు గూడ మీనామ మహాత్యం అంతుపట్టనిది. సకల భువనాధిపతులైన మీ పాదద్వయాన్ని నా హృదయ కమలంలో నిల్పుకొని మనసారా మరల మరల నమస్కరిస్తున్నాను. ఓ సద్గురుమూర్తి! మీ పాదపద్మములకు నమస్కారములు. శ్రీ సద్గురూ! నన్ను రక్షించు, వేదాలకు గూడ అంతు పట్టని మీ పరిశుద్ధమైన చరిత్రను నేనేమి వర్ణించగలను? మీరు ఓంకారస్వరూపులు. పంచభూతాలు, సూర్య చంద్రులు, జీవాత్మ అనే ఎనిమిది రూపాలలో మీరే విశ్వరూపం ధరించారు. ఓ సద్గురు మూర్తి! మీ పాదపద్మములకు నమస్కారములు. (8) ఈ కలియుగంలో భక్తులనుద్ధరించడానికి దత్తావతారుడువై, ఫకీరు రూపంలో అవతరించి, శిరిడీ నివాసివై శ్రీ సాయిబాబా అను పేర కొలువబడే సద్గురూ! మీ పాదపద్మములకు నమస్కారములు, ఈ ప్రపంచంలోని భక్తులందరినీ తరింపచేయడానికి, యోగస్వరూపుడవై ద్వారకామాయి వాసుడవై, నాల్గు పురుషార్థాలూ ప్రసాదిస్తున్న ఓ సద్గురు మూర్తి! మిమ్మల్ని స్తుతించడం వలన నాలోని దోషాలన్నింటిని జయించి, మీ పాదపద్మములకు నమస్కరిస్తున్నాను. సద్గురుస్తోత్రమైన ఈ అష్టకాన్ని నిత్యమూ పఠించినవారికి, బలము, సంపద, సద్బుద్ధి, వర్చస్సు, పుత్ర పౌత్రాభివృద్ధి, ఆయురారోగ్యాలతో కూడిన ఐహిక సౌఖ్యానికి తోడు, అటు తర్వాత ముక్తి గూడ లభించగలదు.

సేకరణ : "కౌండిన్యస"



## ఆహ్వానము

తరలి రండి! కలిసి సాగుదాము!

## 28వ సద్గురువుల పాదుకా మహోత్సవము

**తేదీలు :**
**2022 ఆగష్టు 13, 14 మరియు 15**
**(శని, ఆది మరియు సోమవారములు)**

**వేదిక :**
**శ్రీ సద్గురు పాదుకా క్షేత్రం**
**ప్లాట్‌నెం. 13, పవర్‌సిటీ, విశాఖ - 21**

శ్రీ శిరిడీ సాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో 28వ సద్గురువుల పాదుకా మహోత్సవము, 2022 ఆగష్టు 13,14 మరియు 15వ తేదీలలో నిర్వహించబడుతున్న తరుణంలో శ్రీ దత్త సంప్రదాయములో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న పాదుకల విశిష్టతను, పవిత్రతను తెలియజేస్తూ, పాదుకలతో పాటుగా వాడవాడలా సాయి తత్వ సారభాన్ని వెదజల్లుచున్న సాయి తత్వప్రచారకులు ఒక్కచోట చేరి క్షణక్షణమూ అద్భుతమైన సాయి తత్వాన్ని అందించే అపురూప కార్యక్రమము ఈ పాదుకా మహోత్సవము

పాదుకామహోత్సవ సందర్భముగా శ్రీ దత్తావతార, అవధూత, మహాత్ముల పాదుకలు మరియు దివ్య వస్తు, వస్త్ర సమదాయమును భక్తుల దర్శనార్థము ఏర్పాటు చేయడమైనది. అపురూపము, అమూల్యము అయిన వాటిని దర్శించి, స్పృశించి, శ్రీ దత్తసాయి భరద్వాజుల అనుగ్రహము పొందుటకు

**అందరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము.**

దూర ప్రాంతముల నుండి విచ్చేసే భక్తులకు సామాన్య ఉచిత భోజన, వసతి ఏర్పాట్లు చేయడమైనది.

వివరములకు :
**శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు (రిజిష్టర్డ్)**
శ్రీ సద్గురు పాదుకాక్షేత్రం, ప్లాట్‌నెం. 13, పవర్‌సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర, పరవాడ (మం), విశాఖ-21. సెల్ : 9849645224

# ఏరిన ముత్యాలు

### భగవంతుడు

భగవంతుడు అందరిలోనా ఉన్నాడు, కాని అందరూ భగవంతుడిలో లేరు, అందుచేతనే వారు బాధపడుతున్నారు

– శ్రీ రామకృష్ణ పరమహంస

### కోరిక

కష్ట నష్టాలు వద్దని భగవంతుడిని కోరకు వాటిని సమర్థవంతముగా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలను ప్రసాదించమని కోరుకో

– భగవాన్ రమణమహర్షి

### ఆనందం

నువ్వు ఇష్టపడింది చేయటంలో కాదు, నీవు చేసేపనిని ఇష్టపడటంలోనే ఆనందం యొక్క రహస్యం దాగి ఉంది

– శ్రీ సత్యసాయిబాబా

### జ్ఞానం

అన్నదానం ఆకలి తీరిస్తే అక్షరజ్ఞానం అజ్ఞానాన్ని తొలగిస్తుంది.

– డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ

### సాన్నిధ్యం

మహాత్ముల చరిత్రలు మరియు బోధలు భక్తిశ్రద్ధలతో పారాయణ చేయటం వారి ప్రత్యక్ష సాన్నిధ్యంతో సమానం.

– భగవాన్ రమణమహర్షి

### ఆలోచించు

పట్టుదలతో ప్రయత్నించే చిన్న విత్తనం భూమిని చీల్చుకొని మహా వృక్షముగా ఎదుగుతుంది. ఎందుకులే అనుకుంటే, ఒక పక్షికి ఆహారమై జీవితాన్ని కోల్పోతుంది

### అనుభూతి

గొంతు మౌనంగా ఉన్నప్పుడు మనస్సు మాట్లాడుతుంది, మనస్సు మౌనంగా ఉన్నప్పుడు, హృదయం మాట్లాడుతుంది, హృదయం మౌనమైనప్పుడు అంతరాత్మ అనుభూతి నిస్తుంది.

### పాఠం

ఓటమి, ఒంటరితనం ఈరెండూ జీవితంలో చాలా నేర్పిస్తాయి, ఒకటి ఎలా గెలవాలో నేర్పిస్తే, ఇంకొకటి ఎవరిని నమ్మాలో, ఎలా బ్రతకాలో నేర్పిస్తుంది

### కోరుకో

సద్గురు భక్తుడు ఏ మహాత్ముడిని దర్శించినా తనకు గురుకృప లభించేలా ఆశీర్వదించమని కోరుకోవాలి

– ఆచార్య శ్రీ భరద్వాజ

### హింస

హింస అంటే శారీరకమైనదే కాదు, మాటలతో ఎదుటివారిని బాధపెట్టినా అది హింసే అవుతుంది

– గౌతమబుద్ధుడు

### సంతోషం

ప్రపంచంలో మీ దగ్గర ఏమీ లేకపోయినా ఎంతమందికయినా పంచగల ఒకేఒక వస్తువు సంతోషం

### మేలు

ఇతరులకు మేలు చేయటం వల్లనే నీకు మేలు కలుగుతుంది

– స్వామివివేకానంద

### ధర్మం

ఇహపర శ్రేయస్సును చేకూర్చే జీవిత విధానమే ధర్మం, సద్గురువు మాత్రమే అది నేర్పగలడు

### గుణం

ప్రతి ఒక్కరిలో ఏదో ఒక గొప్పదనం ఉంటుంది, మనకు దానిని చూసే మనస్సు ఉండాలి, అభినందించే గుణం ఉండాలి.

### ఆలకించు

నీ శత్రువుల మాటలు విను, ఎందుకంటే నీలోని లోపాలు, తప్పులు అందరికంటే బాగా తెలిసేది వారికే

– విలియం షేక్స్పియర్